
దలీప్ కౌర్ తివానా రెండు నవలికలు

# సంధ్యారాగం

# వజ్రపు ముక్కు పుడక

అనువాదం

జె. చెన్నయ్య



<u>సంధ్యారాగం</u>

వజ్రపు ముక్కుపుడక

అంతర భారతీయ పుస్తక మాల

దలీప్ కౌర్ తివానా రెండు నవలికలు

# సంధ్యారాగం

# వజ్రపు ముక్కపుడక

అనువాదం

**జె. చెన్నయ్య**

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

ముఖచిత్రం శాశ్వతీ చౌదరి చిత్రంతో రూపొందిచబడింది.

ISBN 978-81-237-6018-6

మొదటి ముద్రణ 2010 (శక *1932*)

**₹ 80.00**

Twilight - Mark of The Nose-Ring *(Telugu)*

సంచాలకులు, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా
నెహ్రూ భవన్, 5, ఇన్స్టిట్యూషనల్ ఏరియా, ఫేజ్-II
వసంత్ కుంజ్, న్యూ ఢిల్లీ - 110 070 ద్వారా ప్రచురించబడింది.

సిమ్రన్ కు

అంకితం

# ముందుమాట

డా. దలీప్ కౌర్ తివానా అనగానే మంచి రచయిత్రిగా మరీ ముఖ్యంగా పంజాబీ సాహిత్యంలో జనే ఆస్టిన్‌గా ఎప్పుడూ నా తలపుల్లో మెదుల్తారు. ఆస్టిన్ లాగా ఈమె కూడా పంజాబీ సమాజంపట్ల అపారమైన అభిమానం కలిగి, అసాధారణ ప్రజ్ఞతో రచనలు చేశారు. అప్పుడెప్పుడో 18వ శతాబ్దంలో ఇంగ్లండులో నెలకొన్న పరిస్థితుల్లోనే మేము ఈనాడు పంజాబులో కొట్టుమిట్టాడుతున్నామేమో అనిపిస్తుంది.

ఈ సంపుటిలోని రెండు నవలికలూ డా. తివానా విశిష్ట సాహిత్య సృష్టికి నిదర్శనాలు. ఒక సమగ్ర స్వరూపాన్ని మనకు అందించడానికి ఈ రెండూ పరస్పరం దోహదం చేశాయి.

'మార్క్ ఆఫ్ ది నోస్‌రింగ్' (దీనిపేరు 'సింబల్ ఆఫ్ ది నోస్ రింగ్' అని పెట్టాల్సింది) ఒక సైనికుడ్ని పెళ్ళాడి, పెళ్ళయిన తర్వాత ఎంతోకాలం కాపురం చెయ్యకుండానే భర్తను కోల్పోయిన అభాగ్యురాలైన ఒక పంజాబీ కన్య జీవిత కథ ఇది. పెళ్ళిలో చేతులకు తొడుక్కున్న రంగురంగుల గాజులను తీసివేసి వితంతువుగా జీవితం గడపడాన్ని వ్యతిరేకించింది. అంతేగాక ఆమె తన వజ్రపు ముక్కుపుడక, గాజులు వంటి నవవధువు కుండవలసిన వాటిని అలాగే వుంచుకోవడం ద్వారా సమాజాన్ని ఎదిరించింది. కాని ఎంతోకాలం అలా వుండలేక పోయింది. చివరికి తన చుట్టూవున్న తనవాళ్ళ సూటిపోటి మాటలకు ఆమె తలవంచింది. ఎటో వెళ్ళిపోయింది.

భారత సమాజంలో వివాహ బంధాన్ని చిత్రించిన మరోనవలిక 'ట్వైలైట్'. వివాహిత అయిన సీనియర్ అధికారి ఈ పంజరంలో చిక్కుకుని విలవిల లాడింది. కాని ఆ బంధనాన్ని తెంచుకోలేకపోయింది. ఎంతో నలిగిపోయింది. స్వేచ్ఛా జీవిత భావన చుట్టూ తన ఆలోచనలు తిరిగాయి. కాని ఆ భావనను

అనుభవంలోకి తెచ్చుకోలేకపోయింది.

ప్రత్యేకించి తన ఈ రెండు నవలికల అనువాదకులు నరేందర్ కౌర్, జై రతన్ చేసిన అనువాదం డా. తివానాకు సంతృప్తినే కలిగించింది. వీరిరువురిలో నరేందర్ కౌర్ కొత్తవారు కాగా కీర్తిశేషుడై జైరతన్ స్వతహాగా భీష్మసహని వంటి పేరు మోసిన హిందీ రచయితల్లో ఒకరు. ఆంగ్లం నుంచి ఇప్పటికే మంచి అనువాదాలు చేయడంలో చేయి తిరిగినవారు.

డా. తివానాకు తన రచనలకు ప్రతిష్టాత్మకమైన సరస్వతీ అవార్డుతో సహా అనేక పురస్కారాలు లభించాయి. ఇప్పుడు నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా వెలువరిస్తున్న ఈ గ్రంథానికి ముందుమాట రూపంలో నాలుగు మాటలు రాసే అవకాశం కలగడం గౌరవంగా భావిస్తున్నాను. పంజాబీ కవిత్వంలో అమ్రితా ప్రీతం అందుకున్న గౌరవాదరాలను డా. తివానా కూడా అందుకోవడం సంతోషించదగ్గ విషయం.

01.02.2008 — కె. ఎస్. దుగ్గల్

# సంధ్యారాగం

# I

ఆఫీసులో అట్రమిక్ గది నా గది పక్కపక్కనే వున్నాయి. కాని ఈ గది అక్కడికి వెళ్ళలేదు. ఆ గది ఇక్కడికి రాదు. ప్రతిగదికీ తనదైన సరిహద్దు లుంటాయి. ఆ రెంటికీ మధ్య గోడ అడ్డుగా నిలిచింది. నిజానికిది చాలా సన్నగా వుంటుంది. ఆ గదిలో వుండే ఆయన చేయి పొరపాటున గోడకు తగిలినా ఆ చప్పుడు నా గదిలోకి వినిపిస్తుంది. ఒకరోజు ఎవరో ఆ గదిలో గోడకు మొలకొట్టిన చప్పుడుకు నా గదంతా మార్మోగింది. ఆ చప్పుడుకు నేను లేచి వెళ్ళి చూశాను. ఆయన గదికి పెద్ద కర్టెన్ వేసివుంది. వెనక్కి తిరిగి వచ్చాను. ఈ మధ్య చాలా వరకు ఇవతలి నుంచి ఏమీ కనిపించకుండా గదులకు ఇలాంటి పెద్దపెద్ద కర్టెన్లు వేస్తున్నారు. నా గదికి కూడా కర్టెన్ వుందన్న విషయం అప్పుడు గ్రహించాను.

ఎప్పుడైనా ఆయన ఏ కారణం చేతనో తన ఫ్యాన్‌పై అరిచారంటే ఇక నా పెన్‌ను కింద పెట్టేసి పని మానేసేదాన్ని. "ఏమైంది?" అని అడగాలని అనుకునేదాన్ని. అయితే మరీ ముఖ్యంగా తన ఫ్యాన్‌ను తాను మందలిస్తు న్నప్పుడు నా జోక్యం ఆయనకు నచ్చకపోవచ్చని ఊరుకునేదాన్ని. ఆయనకు తెలియకపోవచ్చు గాని తన శ్వాస కూడా నా గదిలోకి వినిపిస్తుంది.

ఒక రోజు నా గదిలో కరెంటు పోవడంతో ఫాన్ తిరగడం ఆగిపోయింది. కరెంటు వస్తుందేమోనని కాసేపు చూశాను. ఇక ఉక్కపోత భరించలేక కారిడార్‌లోకి వచ్చాను. మా ఇద్దరి గదులకూ అది ఒక్కటే. ఆయన ఫాన్ కూడా ఆగిపోయే వుంటుంది. అయినా "మీ ఫాన్ తిరుగుతోందా!" అని ఇవతలినుంచి అడిగాను. తిరగకపోతే ఇవతలికి రావచ్చుకదా అని నా ఉద్దేశ్యం. లోపల ఉక్కపోస్తుంటే కొంతసేపు ఇవతలికి రావడమే మేలుకదా!

"లేదు. ఫాన్ తిరగడం లేదు. కాని వెనుకవైపు కిటికీ తెరిచాను." అన్నారాయన. అవునుకదూ! నాకు వెనుకవైపు కిటికీ తెరవాలన్నది తట్టనేలేదు.

అందుకే గాలికోసం కారిడార్లోకి వచ్చాను.

ఒక రోజు నేనేదో రాస్తున్నాను. చేతిలోంచి పెన్ను జారిపడి పత్తి విరిగింది. అప్పుడు ఆయన్ని ఒక పెన్ను అడగాలనుకున్నాను. తన వద్ద మరో పెన్ను లేదని అంటారేమోనని అడిగే ధైర్యం చేయలేకపోయాను. ఒక్కోసారి మనకు మనమే ప్రశ్న వేసుకొని సమాధానం కూడా మనమే చెప్పుకోవలసి రావడం విచిత్రంగా ఉంటుంది కదూ!

'మా రెండు గదుల మధ్య గోడ అకస్మాత్తుగా కూలిపోతే' అని నాకు అప్పుడప్పుడూ అనిపిస్తుంది. అయితే అప్పుడు ఆయన గదీ నాగదీ రెండూ మిగలవు కదా! అలా మిగలకపోగా ఒక పెద్ద గదిగా మారతాయి. అలా జరగడం ... బావుండదు. దీన్నిలా రెండు గదులుగా చేయడం వెనుక వాస్తుశిల్పి మనసులో ఏదో ఆలోచన వుండేవుంటుంది.

కాంక్రీటు గోడలోంచి కూడా అవతల ఏం జరుగుతోందీ నేను చూడగల ననిపిస్తూ ఉంటుంది చాలాసార్లు. ఒకరోజు ఆయనకు ఏ పనీ చేయబుద్ధికాక, కొంతసేపు ఏమీతోచక పైకప్పుకేసి చూస్తూనో, ఊరికే అలా చేతుల్ని నలుపు కుంటూనో, కొన్నిసార్లు ఫైళ్ళు తెరుస్తూ, మూస్తూనో, బూట్లలోంచి కాలుతీస్తూ మళ్ళీ దూరుస్తూనో ఉంటారని అనిపిస్తూ వుంటుంది.

ఆయన ఎప్పుడైనా ఉల్లాసంగా ఉన్నప్పుడు పేపర్‌వెయిట్‌ను బల్లపైన గిరగిరాతిప్పుతూ, కుర్చీలో కూర్చునే మెల్లగా ఈలవేస్తూ, గోడను చేత్తో చరుస్తూ, నేలపై కాలితో తడుతూ ఉంటారు. నేను మాత్రం అవతలి వ్యక్తికి ఇబ్బంది కలిగించడం ఇష్టం లేక, పైగా నా గురించి ఏమనుకుంటారోనని ఏ చిన్న శబ్దమూ రాకుండా జాగ్రత్త పడుతూ వుంటాను.

వచ్చేటప్పుడో, వెళ్ళేటప్పుడో చాలాసార్లు పరస్పరం ఎదురుపడతాం. "ఎలా వున్నారు?" అని ఆయన అడుగుతారు. "బావున్నానండీ!" అని సన్నగా నవ్వుతూ చెబుతాను. దాంతో ఆయన తన గదిలోకీ, నేను నా గదిలోకీ వచ్చేస్తాం. అంతే ఆ గది ఇవతలికి రాదు. నా గది అవతలికి వెళ్ళదు. ప్రతి దానికీ తనవైన హద్దులు వున్నాయి. రెంటికీ నడుమ అడ్డుగోడ.

మధ్యలో గోడవున్నా ఆయన ఆఫీసుకురాని రోజు, ఆగదిలో ఆయన లేని రోజు నాకేదోలా అనిపిస్తుంది. నా వాచీకేసి మళ్ళీ మళ్ళీ చూసుకుంటూ గ్లాసు

ఎత్తి నీళ్ళు తాగుతూ ఫోన్లు మాట్లాడుతూ, పెండింగ్ వర్క్ పూర్తిచేస్తూ గడుపుతాను.

అటుగావెళ్ళి "మీ సార్ రాలేదా?" అని వాళ్ళ ప్యూన్‌ని అడుగుతాను. సార్ ఊళ్ళోలేరనో, ఎవరో చుట్టాలొచ్చారనో, ఆయనకు ఒంట్లో బాగాలేదనో, కొన్నాళ్ళు సెలవుపెట్టారనో చెప్తుంటాడు.

అలాంటి సందర్భాల్లో నా మెదడులోకి ఏవో పిచ్చి పిచ్చి ఆలోచనలు వస్తాయి. ఓ నూరేళ్ళకిందట ఈ గదిలో ఎవరు ఉండి ఉంటారనో, మరో నూరేళ్ళు పోయాక ఎవరు రానున్నారనో... ఇలాంటివి. మనుషులు ఎందుకు చనిపోతారు? ఈ మాత్రానికి అసలు ఎందుకు పుట్టాలిట? ఇలాంటి ఆలోచనల్తో అలసి పోయాక అఫీసులోని సహచర ఉద్యోగినులతో కలవడానికి వెళ్ళేదాన్ని.

"చాలా రోజునుంచి మీరు రావడం లేదు?" తెలిసీ అడిగాను ఆయనను.

"ఒంట్లో బాగాలేదండీ!" ఆయన సమాధానం.

"అయ్యో అలాగా! ఇప్పుడెలా వున్నారు?"

"బావున్నాను. థాంక్స్" అని చెబుతూ ఆయన తన గదిలోకి వెళ్ళిపోయారు. నేను నా గదిలోకి వచ్చేశాను.

ఒకసారి నేను కూడా కొన్నాళ్ళపాటు సెలవు పెట్టాను.

"మేడమ్ రావడంలేదెందుకు?" ఆయన మా ప్యూన్‌ను అడిగారు.

"సార్! ఆమె ఆరోగ్యం బాగాలేదు" ప్యూన్ చెప్పాడు.

"ఓ అలాగా!" అంటూ ఆయన తన గదిలోకి వెళ్ళిపోయారు. మా ప్యూను నాకు ఇదంతా ఇంటికి ఫైళ్ళు తెచ్చినప్పుడు చెప్పాడు.

నాకు జ్వరం తగ్గాక మరునాడు ఆఫీసుకు వెళ్ళాను. ఈ విషయం బహుశా ఆయనకు తెలిసినట్టులేదు. ఆరోజుఎందుకో వాళ్ళ ప్యూనును రెండు మూడు సార్లు కేకలేశారు. ఏవో కాగితాల్ని పదే పదే చించివేశారు. తప్పు రాసి వుంటారేమో! విజిటర్స్‌ని కలవనన్నారు. ఇంకోరోజు ఎప్పుడైనా రమ్మని చెప్ప మన్నారు.

ఎందుకో గదిలోంచి బయటికి వచ్చారు. నేను కూడా అప్పుడే బయటికి వెళ్ళాను.

"మీరు చాలా రోజులుగా రావడం లేదు" అని అడిగారు నన్ను....

కారణం తెలిసినా.

"నాకు బాగాలేదు"

"ఇప్పుడెలావున్నారు?"

"బావున్నాను. థాంక్స్"

నేను నా గదిలోకి వచ్చాను. ఆయన తన గదిలోకి వెళ్ళిపోయారు. ఎవరి పనిలో వాళ్ళం లీనమయ్యాం.

ఈ గది అక్కడికి వెళ్ళలేదు. ఆ గది ఇక్కడికి రాలేదు. ప్రతీదానికీ తనవైన హద్దులున్నాయి. రెంటికీ మధ్య గోడ నిలిచివుంది. ఆ రెంటిలో ఒక గది ఆయనది. వేరొకటి నాది.

ఆ రెండు గదులూ ఒక దానికొకటి పక్క పక్కనే వుండడం రెంటికీ మధ్య గోడ వుండడం మంచిదే అనిపించింది.

## II

మా మరదలి పెళ్ళికి వెళ్ళాను. పెళ్ళికి ముందుగానే వెళ్ళి కొన్నాళ్ళుండవలసి వచ్చింది. దీంతో చాలా రోజుల పాటు ఆఫీసుకు వెళ్ళలేదు.

చాలా రోజుల తర్వాత ఆఫీసు వెళ్ళాక తెలిసింది. అమ్రిక్‌కు ఆరోగ్యం బాగాలేదట, మొదట ముంబాయి తీసుకెళ్ళి అక్కణ్నుంచి చికిత్స కోసం ఆయన్ను న్యూయార్కు తీసుకు వెళ్ళారట. వీళ్ళ తమ్ముడు అక్కడ పేరు మోసిన వైద్యుడని కూడా తెలిసింది.

చికిత్సకోసం అమెరికా వరకూ తీసుకెళ్ళారంటే ఇదేదో తీవ్రమైన అస్వస్థతే అయివుంటుంది కదూ! కాన్సర్ గాని కాకపోవచ్చుకదా! ఆలోచిస్తేనే అదోలా వుంది.

మీ ఇంటికెళ్ళి మీరెలావున్నారో కనుక్కోవాలని వుంది. కాని నేనెవరని మీ వాళ్ళు అడిగితే? అంతే కాదు. నా భావాల్ని వాళ్ళెలా అర్థం చేసుకుంటారో!

మీరు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మీకు లేఖ రాయాలనుకుంటున్నాను. కాని నా వద్ద మీ చిరునామాలేదే!

ఒకవేళ 'మీరు ఇకలేరు' అన్న వార్తను ఎవరో చెప్పనున్నారా! అని నా

మనసులో ఎంతో ఆందోళన కలుగుతోంది.

మీరు అల్పాయుష్కులైతే నా ఆయువులోంచి కొన్నేళ్ళు తీసుకోండి. మీ మరణాన్ని భరించలేను. ఈ మాటలు అనడానికి నేను మీకేమవుతాను అనుకుంటారేమో! నేను మీకేమవుతానో నాకే తెలియదు.

ఆఫీసులో చాలా చికాకుగా అనిపిస్తోంది. అంతా నిరర్థకమే అన్నట్టుగా వుంది. మీరు క్షేమంగా వున్నారనే వార్త ఎప్పుడు చెప్తాడా అని మీ ప్యూన్ వైపే చూస్తున్నాను. కాని అతను ఇవేవీ పెద్దగా ఆలోచిస్తున్నట్టు అనిపించడంలేదు. సారు జబ్బుపడ్డారా, సెలవులో వున్నారా అనే విషయాల గురించి పట్టింపు లేనట్టున్నాడు.

మీ గురించి అతన్ని "రాంలాల్! మీ సార్ ఇప్పుడెలా వున్నారు?" అని ఎలాగైనా అడగాలని నిర్ణయించుకున్నాను.

"ఆయన రెండునెలల సెలవుపై అమెరికావెళ్ళారు." అని రాంలాల్ సమాధానమిచ్చాడు. ఇప్పుడు కొత్తసారు వస్తారు. ఈ గదిలో కూర్చుంటారు." అని నిర్లక్ష్యంగా చెప్పాడు.

ఇంకెవరో ఈ గదిలోకి వస్తారా? ఎంత సులభంగా చెబుతున్నాడు. మొట్ట మొదటిసారిగా జీవితం ఎంత క్షణ భంగురం అన్న నిజం నాకు అవగతమైంది.

ఒక వ్యక్తి పోతే మరోవ్యక్తి ఆ స్థానాన్ని భర్తీచేస్తాడు. జీవితం కొనసాగుతూనే వుంటుంది. నాకైతే కాలం స్తంభించినట్లుంది.

న్యూయార్కులో వున్న నా ఒకప్పటి క్లాస్‌మేట్ కాంటాకు ఉత్తరం రాస్తూ న్యూయార్కులోని ఆస్పత్రిలో చికిత్సకోసం చేరిన అమ్రిక్ ఎలా వున్నారో కనుక్కొని చెప్పవా అని అడుగుదామనుకున్నాను. కాని అమ్రిక్‌కు నీకు సంబంధమేమిటని అడుగుతుందేమో!

ఇదమిత్థంగా చెప్పలేని సంబంధమే ఉండకూడదా?

నా ఆలోచనల్లో నేను న్యూయార్కు వెళ్లాను......

ఆయన్ని ఆస్పత్రిలో కలుసుకున్నాను.

"ఎలా వున్నారు! తిరిగి ఎప్పుడొస్తున్నారు?" అడిగాను.

"చూద్దాం" ఆయన సమాధానం.

ఆయన ఇక ఎప్పుడూ తిరిగారా?

ఇంతకూ దేశం కాని దేశంలో తెలియని ఆస్పత్రిలో వున్న ఆయన ఏం ఆలోచిస్తూ వుంటారో!

తనను చూసేందుకు నేనక్కడికి వస్తానని ఆయన అస్సలు ఊహించరు. ఇలా నేను ఆలోచిస్తుంటానని కూడా ఆయన ఎన్నడూ అనుకోరు.

ఒకరోజు నా ధైర్యాన్నంతా కూడదీసుకుని మా ఆఫీసులో పనిచేసే కొలిగ్‌ను న్యూయార్కులో ఆయన చికిత్స పొందుతున్న ఆస్పత్రి చిరునామా అడిగాను. అతను నావైపు ఆశ్చర్యంగా తేరిపారజూసి చిన్న కాగితంపై చిరునామా రాసిచ్చారు. దాన్ని మడిచి నా పర్స్‌లో పెట్టుకున్నాను.

ఇవాళ రోజంతా ఆఫీసులో పెద్దగా పనిచేయలేక పోయాను. ఆయనకు చాలాసార్లు ఉత్తరం రాద్దామని ప్రయత్నించాను. రాయడం, చించేయడం తప్ప పూర్తి చేయలేకపోయాను. చివరికి పూర్తి చేశాను. "ఎలా వున్నారు? మీరు ఆఫీసుకు రాకపోవడం నాకస్సలు బావుండటం లేదు. మీరు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను." అని

ఉత్తరాన్ని కవర్‌లో వుంచి పైన చిరునామా రాశాను. కాని పోస్టు చెయ్యమని ఎవరికీ ఇవ్వలేకపోయాను. అమ్రిక్‌కు నేను ఉత్తరం రాశానని మరొకరికి తెలుస్తుంది కదాని భయం.

ఇంటికి వెళుతూ నేనే పోస్ట్ చేద్దామనుకున్నాను.

అయితే మావారు రాజేందర్ సాయంత్రం నాలుగింటికి నన్ను పికప్ చేసుకోవడానికి వచ్చారు. కొలీగ్ కూతురు పెళ్ళికి ఇద్దరమూ కలిసి వెళ్ళాల్సి వుండింది.

మధ్యలో పళ్ళు, కూరగాయలు కొందామని ఆగాం. నేను వాటికి డబ్బు లివ్వబోతుండగా పర్స్‌లోని కవర్‌పై ఆయన దృష్టి పడింది. నీలి-ఎరుపు రంగు అంచు కావడంతో దానిపై అలవోకగా దృష్టిపడింది.

దాన్ని చేత్తో తీసుకోబోతూ "ఎవరిదీ ఉత్తరం?" అని అడిగారు.

"పోస్ట్ చెయ్యాల్సింది" భయపడుతూ చెప్పాను.

"ఎవరికి?" దాన్ని బ్యాగులోంచి చేతిలోకి తీసుకున్నారు.

"న్యూయార్కులో అనారోగ్యంతో వున్న నా కొలీగ్ అమ్రిక్‌కి. ఆయన

బహుశా బతకకపోవచ్చు... ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి..." ఒక దాని వెంట మరొకటి గబగబా చెప్పాను. ఆయన ఉత్తరాన్ని చదవడం ప్రారంభించడంతో నాకు నోట మాట రాని పరిస్థితి ఏర్పడింది. ఉత్తరం చదవడం పూర్తిచేసి నా వైపు కన్నార్పకుండా చూశారు. దాన్ని నాకు తిరిగి ఇచ్చారు. అంతదూరమూ తిరిగి ఇంటికి వచ్చే వరకు కూడా ఒక్క మాటా మాట్లాడలేదు.

స్కూటర్ వెనుక కూర్చొని ఆలోచిస్తున్నాను ఎవరి ఆరోగ్యం గురించి అయినా తెలుసుకోవాలని భావించడం పాపమా? వారు త్వరగా కోలుకోవాలను కోవడం నేరమా? ఒకే ఆఫీసులో పనిచేస్తూ రావడం మానేస్తే ఆందోళన చెందడం ఎంతో సహజం కదా! అనిపించింది.

మరి దీనికోసం నేనింతగా భయపడుతున్నానేమిటి?

"భయపడుతున్నాను కదూ!"

అవును భయం కావచ్చు.

మేం ఇంటికి వచ్చాక కూడా ఆయన ఏమీ అడగలేదు.

మా మధ్య ఏమీ లేదని నేనెందుకు చెప్పలేక పోయాను?

ఇంట్లో ఎప్పటిలా హీటర్ వెయ్యలేదు. టీ తెమ్మని అడగలేదు. కనీసం తన బట్టలైనా మార్చుకోలేదు.

నేను టీ తయారు చేస్తుండగా ఆయన బయటి గేటు వైపు వెళుతున్నారు.

గేట్‌కు తాళం వేయడానికి వెళుతున్నారని అనుకున్నాను. కాని ఆయన బయటికి వెళ్ళారు. అరగంట గడిచింది. తిరిగిరాలేదు. ఎన్నో కలవరపెట్టే ఆలోచనలు నన్ను ముసురుకున్నాయి. అంతలో ఆయన తిరిగి వచ్చారు. హమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నాను.

"ఎక్కడికి వెళ్ళారు?" జంకుతూ అడిగాను.

"నీ బ్యాగులోంచి తీసుకున్న ఉత్తరాన్ని పోస్ట్ చెయ్యడానికి వెళ్ళాను" అన్నారు.

"అమ్రిక్‌కు ఉత్తరం రాయడం ఇదే మొదటిసారి" సంజాయిషీ ఇచ్చాను.

"నిన్నేమీ అడగలేదే!" ఆయన అన్నారు.

"అమ్రిక్ చాలా మంచివారు" నేను వివరణ ఇవ్వడానికి ప్రయత్నించాను.

"అందుకే ఆయనంటే నీకు ఇష్టం" చాలా సీరియస్‌గా అన్నారు.

"నో.... నో... ఆయన చెడ్డవారు కారు అని నా ఉద్దేశ్యం"

"ఇష్టమైన వ్యక్తిలో చెడు విషయమే ఉండదు."

"నో! అలా కాదు. మీరు పూర్తిగా పొరబడుతున్నారు".

"అయితే ఆయనతో నీకేమిటి సంబంధం? మీ మధ్య ఏదైనా వ్యవహారం నడుస్తోందా?"

"లేదు. నేను అబద్ధం చెప్పడంలేదు" చిరాకు పుట్టింది

"నీ బతుకు అబద్ధాలమయం ఈ ఇల్లు, నీ భర్త, ఈ జీవితం నీకు సంతోషాన్నిస్తున్నా యనుకున్నాను."

"అవును... అవును నా ఇల్లు, నా జీవితం, నా భర్తతో సంతోషంగా వున్నాను" చెప్పాను. "ఈ ఇల్లు, ఈ భర్త, ఈ జీవితం నీకు సంతోషానే ఇచ్చేవిగా వుండివుంటే నీవు ఇలా... బయట తిరుగుళ్ళు..."

"మీరిలా మాట్లాడి నన్ను అవమానిస్తున్నారు" ఆయన మాటలకు అడ్డుపడుతూ అన్నాను.

"నేను కాదు నిన్నవమానిస్తున్నది... నిన్ను నీవే అవమానించుకునేలా ప్రవర్తిస్తున్నావు"

"కాదు అది ఏ మాత్రం నిజం కాదు."

"ఇలా గట్టిగా అరిస్తే, జరిగింది నిజం కాకుండాపోదు. నేను నీ మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో నువ్వు విఫలమయ్యావు. ఆరోజు... ఆరోజు... తన బావమరిది పని అక్రమిక్‌తో సానుకూలమవుతుందని వర్మ అన్నప్పుడు... అది నీ ద్వారా కాస్త చేయించమని కోరినప్పుడు నేను అర్థం చేసుకోలేక పోయాను. నువు చెప్తే అతను కాదనడని వర్మ అన్నాడు. ఈ విషయం నాకు తెలియక నీ వెంటపడ్డాను."

"అయ్యో... దేవుడా... ప్లీజ్ ఊరుకోండి... " చెవుల్ని గట్టిగా మూసుకొని ఆ గదిలోంచి బయటపడి టీ తయారు చేద్దామని వంటింట్లోకి వచ్చాను.

"టీ తీసుకోండి!" రెండు మూడుసార్లన్నా ఆయన తీసుకోలేదు.

రాత్రి భోజనం కూడా చెయ్యలేదు.

స్టడీ రూంలోకి వెళ్ళి పడుకున్నారు.

హుం! మన అనుబంధం ఇంతగా గాలికి కూలిపోయే పునాదులపై నిర్మితమైందా! ఎల్లకాలం నా మనిషి అనుకున్న వ్యక్తి ఈనాడు ఒక్కసారిగా ఇంతగా కొత్తగా మారిపోయాడేమిటి?

ఎవరికైనా చిన్న ఉత్తరం కూడా రాసే స్వేచ్ఛ లేదా నాకు?

నేను మరొకరి గురించి ఆలోచించడంతోనే అపవిత్రమై పోయేంత బలహీనమైన దాన్నా?

ఈ సమాజం గీసిన గీత ఆవలివైపు చూసే సాహసం చేయడంతోటే నా మంచితనమంతా ఇట్టే గాలికెగిరి పోతుందా?

ఇంతటి అల్పమైన విషయానికి ఇంతగా అవమానించి, కాదు పొమ్మనే దశ పట్టిందా నాకు.

ఇంకా ఏ అర్హతతో ఈ ఇల్లు నాదనుకోవాలి? ఏ ముఖం పెట్టుకొని ఈ మనిషి నా భర్తను కోవాలి? గత జీవితాన్నో, లేదా ఇటీవలి అనేక సందర్భాలనో గుర్తు చేసుకుంటే... అమ్రిక్ తన గదిలోంచి, నేను నా గదిలోంచి ఇవతలికి రావడం, మీరెందుకో విచారంగా వున్నట్లున్నారు అని ఆయన అడగడం, నేను అవును కాస్త బాధగా వుంది అనడం ఆయన తిరిగి తన గదిలోకి వెళ్లిపోవడం, ఆ పక్కనే వున్న నా గదిలోకి నేను తిరిగి రావడం... గుర్తొచ్చింది.

నాకు చాలా బాధగా వుంది అని అమ్రిక్‌కు ఎందుకు చెప్పాలనుకుంటున్నాను? నిద్రపట్టలేదు.

ఏదైనా పుస్తకం చదువుకుందామని స్టడీ రూములోకి వెళ్లాను. అక్కడ ఆయన గాఢనిద్రలో వున్నారు.

తిరిగి పడక గదిలోకి వచ్చి మళ్ళీ బెడ్ మీద వాలిపోయాను.

రాత్రి చాలా నెమ్మదిగా గడుస్తున్నట్లుంది. ఎప్పుడో నిద్రపట్టింది.

పొద్దున ఆలస్యంగా లేచాను.

ఆయన నన్ను లేపలేదు. స్టౌ మీద టీ తయారు చేసుకొన్నారు.

తన కోసం ఒక కప్పులో పోసుకుని నా కోసం కూడా మరో కప్పులో పోశారు. నేను లేచేసరికి తను ఆఫీసుకు వెళ్లేందుకు తయారవుతున్నారు.

నేను అల్పాహారం తయారుచేశాను. ఆయన టిఫిన్ తిన్నారు. కాని ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

నిన్నటి వైమనస్యం సమసిపోయినా మా మధ్య దాని తాలూకు నీలితెర మాత్రం అలాగే వుంది.

నా వైపు చూడకుండానే తన బ్యాగు తీసుకొని స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయారు.

ఆఫీసుకు వెళ్ళడానికి తయారవుతున్నా, బస్సులో ప్రయాణం చేస్తున్నా, ఆఫీసుకు చేరాక కూడా ఒకటే ఆలోచన. పని చేసే స్త్రీ రోజూ తనకు తారసపడే వాళ్ళలో వాళ్లు నచ్చారు, వీళ్ళు నచ్చలేదు అనకుండా ఉండడం సాధ్యమా!

అంటే ఏమిటి, ఎవరైనా నచ్చితే వారితో అక్రమ సంబంధం వున్నట్లు, నచ్చలేదు అంటే వారితో కనీసం మాట్లాడుకొనే సంబంధాలు కూడా లేనట్లా!

ఈ రోజు ఆఫీసులో చాలా ఇబ్బందిగా అనిపించింది.

సరకులు కొనడానికెళ్ళినా, పిల్లల ఫీజులు కట్టడానికి వెళ్ళినా ఎక్కడికి వెళ్ళినా భర్తల్ని వెంట బెట్టుకువెళ్ళే స్త్రీలు ఎంతో అదృష్టవంతులు అనిపిస్తుంది.

ఒకసారి ఇల్లుదాటి ఉద్యోగం చూసుకున్నావంటే ఇక నీవు అన్నిరకాలైన కష్టాల్ని ఆహ్వానించినట్లే, నీ గురించి ఎవరు ఎన్నిరకాలుగానైనా అనుకునేందుకు అవకాశమిచ్చినట్లే!

నా గురించి నాలో నేను అనుకుంటున్నట్లుంది.

లంచ్‌టైం ఫోన్‌ఎత్తి, మా ఆయన నెంబర్‌కు డయల్ చేశాను. అవతలి నుంచి ఆయన ఫోన్ ఎత్తి "హలో" అన్నారు.

ఏం మాట్లాడాలో నాకు తోచలేదు.

"హలో! హలో!" ఆయన మళ్ళీ మళ్ళీ అంటున్నారు.

ఆయనను ఉద్దేశించి 'డియర్ రాజేందర్' అని సంబోధించి ఉత్తరం రాయాలని చాలాసార్లు ప్రయత్నించాను. ప్రతిసారీ మధ్యలోనే చించేశాను.

ఇంతకూ ఆయనకు నేనింతగా భయపడుతున్నానేమిటి? నేనేమీ తప్పు చేయలేదే! నా గురించి ఆయన చెడుగా భావిస్తే... ఏమైనా అనుకొని.

నా తల పగిలిపోతోంది.

సగం రోజు సెలవుపెట్టి ఇంటికి వచ్చాను.

వచ్చానుకాని ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. అశాంతిగావుంది. కొన్ని ఏవో కొనాల్సినవి వున్నాయి. ఆయన షర్టు కుట్టడానికివ్వాలి.

అందుకని మార్కెట్‌కి వెళ్ళాను.

అక్కడ సోనాల్ కలిసింది. "ఏమైంది? అదోలా వున్నావు?"

"అలాంటిదేమీ లేదే" అబద్ధం చెప్పాను.

ఎంత కృత్రిమ జీవనం గడుపుతున్నామో అనిపించింది.

అమ్రిక్ అంటే నాకిష్టమని రాజేందర్‌కు నిజం చెప్తే ఏం! ఇష్టం అంటే ఎలాంటిది? ఓ పువ్వునో, నదినో, ఇంటినో ఇష్టపడడంలాంటిది.

కాని ఈ సంగతి రాజేందర్ అర్థం చేసుకోడే! స్త్రీకి తన శరీరం అంత ముఖ్యం కాదన్న సత్యాన్ని ఎవరూ గ్రహించరు కూడా. అంతేకాదు. ఏమగాడూ తన భార్య వ్యక్తిగతమైన ఇష్టా యిష్టాలను గౌరవించడు.

"ఓ...ఫ్...!" కొద్దిలో కారు నన్ను గుద్దేసేదే. ఎటో ఆలోచిస్తున్నాను.

నేను ఇంటికి చేరుకునే సరికి ఆయన వచ్చేసి వున్నారు. నేను కాస్త రిఫ్రెష్ అయ్యి ఆయన పక్కనే కూర్చున్నాను.

"శుభవార్త లాంటిదే? అమ్రిక్‌కు కాన్సర్ కాదని తేలింది. కడుపులో గడ్డ వుందని తెలిసింది. ఆపరేషన్ చేసి దాన్ని తీసేశారు. ఇప్పుడు ఆయన బావున్నారు" ఆయన నా వైపు చూస్తూ చెప్పారు.

నేను ఏమీ మాట్లాడలేదు.

"నేను ఆయన స్నేహితుడ్ని ఫోన్‌లో అడిగాను. "నీ శుభాకాంక్షలు ఆయన్ను త్వరగా కోలుకొనేలా చెయ్యగలవు. సుఖసంతోషాలను కొని తేగలవు."

"మీరు నన్ను అపార్థం చేసుకుంటున్నారు" నా గొంతులో నిరసన ధ్వనించింది. ఆయన నుంచి జవాబు రాలేదు.

"మీరు నాతో సరిగా వుండటం లేదు" నేను రెట్టించాను. ఈ సారి కూడా ఆయన మాట్లాడలేదు.

"ప్రమాణం చేసి...."

"ఆపు" అంటూ మధ్యలోనే తుంచేశారు. ఏడ్చేశాను.

ఆయన లేచి మరో గదిలోకి వెళ్ళిపోయారు.

చాలా సేపటివరకూ మౌనంగా బాగా ఏడ్చాను. నా అంతట నేనే ఊరుకున్నాను. లేచి ముఖం, చేతులూ కడుక్కుని రాత్రి వంట చేయడానికి వంటింట్లోకి వెళ్ళాను. 'స్త్రీగా పుట్టడం పాపమా?' అని పదే పదే ఆక్రోశించాను.

ఆయన లేచి స్టడీరూములోకి వెళ్ళారు.

గదిలోకి వెళ్ళి కర్టెన్ వేసుకున్నారు. అది కర్టెన్‌లా లేదు. అకస్మాత్తుగా మా మధ్య వెలసిన అడ్డుగోడలా వుంది. ఇటుకలతోనో, గచ్చుతోనో, సిమెంటుతోనో, రాయితోనో కాదు లావాతో కట్టిన గోడలా వుంది.

"మీక్కావాలంటే ఉద్యోగాన్ని వదిలేస్తాను. కావాలంటే మరో నగరానికి వెళ్ళిపోదాం. మీక్కావాలంటే..." ఇలా చెప్పాలనుంది. కాని రాజేందర్ ఏదీ వినే పరిస్థితిలో లేదు.

నాకు అలనాటి అహల్య గుర్తొచ్చింది. ఆమె కూడా నాలాగే గౌతమ మహర్షికి చాలా చెప్పాలని ప్రయత్నించి వుంటుంది. అయితే ఆ ఋషి కూడా ఇలాగే ఏ విషయమూ విని వుండడు. వినివున్నా నమ్మి ఉండేవాడు కాదేమో! ఫలితంగా అహల్య శిలగా మారింది.

తాను చెయ్యని పాపానికి ఎంతకాలం ప్రాయశ్చిత్తం అనుభవించాలి అని అహల్య అడగ్గా త్రేతాయుగంలో శ్రీరాముడు వచ్చి శాపవిముక్తి కలిగిస్తాడని గౌతముడు చెప్తాడు.

కాని ఇది సత్యయుగమో, త్రేతాయుగమో, ద్వాపరయుగమో కాదు. నా పరిస్థితి ఏమిటి? నేను అహల్యను కూడా కానే!

వంటగదిలో ఏవో వండుతూ ఎన్ని పూర్వ యుగాలను గురించిన ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయో, నా ఆలోచనల్లో ఎందరు మెదిలారో చెప్పలేను.

రాత్రి 8 అవుతోంది. వెళ్ళి "భోజనం వడ్డించనా!" అని అడిగాను.

"వద్దు! నాకు భోజనం వద్దు" మొరటుగా సమాధాన మిచ్చారు.

"నేను కూడా ఈ రాత్రికేమీ తినను"

పాలు వేడిచేసి ఆయనకు గ్లాసులో పోసి తీసుకెళ్లాను.

"నాకేమీ వద్దు" చాలా దురుసుగా అన్నమాటకు నాకు చాలా భయ మేసింది. గ్లాసు వెనక్కి తెచ్చాను.

తలుపేసుకున్నారు.

పాలు వంట గదిలో పెట్టి నేను పడకమీదకు చేరాను.

నాకళ్ళనిండా నీళ్ళు నిండాయి. ఆయన ముందు నా అభ్యర్థనలు,

ప్రమాణాలు అన్నీ గాలికి పోయాయి. నాకు అవమానాల్నే మిగిల్చాయి.

ఈ పరిస్థితులు చూస్తుంటే నాలోని ప్రేమ స్రోతస్సు ఇంకి పోతుందేమో అనిపిస్తోంది. ఇకపై నన్ను కలిసేవారితో ఎప్పటిలా మసలుకోలేనేమో! రాజేందర్ ఏమనుకుంటాడోనని ఎప్పుడూ ఒకరకమైన భయం నన్ను వెంటాడుతూ వుంటుంది.

స్త్రీలో ప్రేమానురాగాలు అడుగంటిపోతే ఆమెలో మాతృత్వం, సోదరి గుణం, భార్య భావన కూడా వాడిపోతాయని నా ఉద్దేశ్యం.

పత్రికల్లో భయంకరమైన విషయాలు చదివాను. ఒకామె తను బిడ్డకు జన్మ ఇవ్వడం కోసం మాయలు, చేతబడులతో మరొకరి పిల్లను చంపబోయిందని, మరో స్త్రీ ఎవరెవరితోనో కుమ్మక్కయి తన భర్తనే చంపిందని వచ్చింది. స్త్రీలో ప్రేమ, ఆప్యాయతా భావనలు అడుగంటి పోవడమంటే ఇదేకదా!

ఎవరో కొత్తవ్యక్తికి... మీరు ఆఫీసుకు రాకపోవడం వల్ల నాకు అదోలా వుందనీ, మీ ఆరోగ్యం బాగవ్వాలని కోరుకుంటున్నానని నేనెలా ఉత్తరం రాయగలిగానని రాజేందర్‌కు కోపం వచ్చింది.

నిజానికి ప్రతి స్త్రీకీ ఆమాటకొస్తే స్వయంగా ఆమె భర్తే పెళ్లికి ముందు కొత్తవ్యక్తి. ఆమెలోని సహజమైన ప్రేమ, ఆప్యాయతాభావాల వల్లే ఆ కొత్తవ్యక్తి ఆమెకు జీవన సర్వస్వంగా మారతాడు.

ఇప్పుడు నన్ను నేను సమర్థించుకోడానికేమీ ప్రయత్నించడం లేదు. అమ్రిక్‌తో 'అప్పుడున్న' నా సంబంధం తెల్లని మేఘంలా ఎంతో స్వచ్ఛమైంది. 'అప్పుడున్న' అని ఎందుకంటున్నానంటే ఈ సంబంధం నాకు శాపంగా పరిణమించిందనీ, నా మీద కాళరాత్రి లాంటి నింద మోపిందని, నాలో నాకే అయోమయంగా వుంది. నాదేమైనా పొరపాటా?

బహుశా స్త్రీలు లోతైన ఆలోచనల్లో కొట్టు మిట్టాడకూడదన్న కారణంగానేమో ప్రాచీనకాలంలో వారు ధర్మ శాస్త్రాల్ని చదవకుండా నిషేధం విధించి వుంటారు.

రాత్రంతా భయంభయంగా గడిపాను.

ఎప్పుడోగాని నిద్రపట్టలేదు.

కొంతసేపటికీ నడుస్తున్న రైలులాంటి శబ్దానికి మెలకువ వచ్చింది.

అప్పటికింకా తెల్లవారడానికి ఎంత సమయముందో తెలీదు.

## III

ఈ రోజు ఆఫీసుకు వెళ్ళాలనిపించలేదు.

రాజేందర్ ఆఫీస్‌కు వెళ్ళాక కూడా ఏ పనీ చేయలేక పోయాను. రాత్రంతా వందలాది మైళ్ల దూరం నడిచినట్టు ఒళ్ళంతా నొప్పులు.

భక్తిగీతాలు క్యాసెట్లు వేశాను. కాని నా ధ్యాస వాటిపై నిలవలేదు.

పరధ్యానంగానే విన్నాను. నిజానికి ఎప్పుడూ ఊరకే కూర్చునే అలవాటు లేని నేను ఈ రోజు మాత్రం ఏమీ చెయ్యలేకపోతున్నాను.

కుర్చీలో జారగిలపడి చేతులు అలా వేసి ఆలోచిస్తున్నాను. పెళ్లయిన స్త్రీ అందులో కుటుంబ స్త్రీ మరో మగాడి పట్ల ఆసక్తి చూపడమేమిటి? అని అనిపించింది.

భారతీయ సంస్కృతి స్త్రీ త్రికరణశుద్ధిగా భర్తకు విధేయురాలిగా ఉండాలని శాసించడమే ఇందుకు కారణం.

ఒక్క స్త్రీ మాత్రమే త్రికరణశుద్ధిగా విధేయంగా ఉండాలని భారతీయ సంస్కృతి ఎందుకు నిర్బంధించాలి? అని సోనాల్ ప్రశ్నిస్తోంది.

సోనాల్ మొండిఘటం తనను తాను సమర్థించుకోవడానికి ఇటువంటి వాదాల్ని లేవదీస్తుంది. త్రికరణశుద్ధిగా విధేయంగా ఉండడం విధేయత కాదు అది బానిసత్వం అంటుంది తాను.

"విధేయతను, హృదయ నైర్మల్యాన్ని నీవు బానిసత్వం అంటావా? నీ ఆలోచనలు ఎంతగా కుళ్ళిపోయాయి అనేది దీనివల్ల తెలుస్తోంది. మంచి చెడుల మధ్య అంతరాన్ని మరచిపోయావు" సోనాల్‌ని తిట్టాను. నిజానికి ఆమె తల్లిదండ్రులు చూసిన అబ్బాయిని చేసుకోక పోవడం, మరో పట్టణంలో పని చేయడం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉండడం, తన కిష్టమైన రీతిలో జీవించడం పై నాలో మిశ్రమ భావాలు కలిగాయి. కొన్నిసార్లు ఆమె చాలా దృఢమైన స్త్రీలా కనిపిస్తుంది. కొన్నిసార్లు స్వార్థ పరురాలిగా, కొన్నిసార్లు అహంభావిగా, కొన్ని సార్లు తెలివిమాలిన దానిలా అనిపిస్తుంది. అయితే

ఆమె వాదాల్లో సగటు మహిళల జీవితంలోని నిరాశా నిస్పృహలు కనిపిస్తాయి.

"విధేయత, హృదయ నైర్మల్యాన్ని నీవు బానిసత్వం అంటావా?" అనడిగితే, "హర్‌జిత్! స్వచ్ఛందంగా నిర్మలంగా ఉండడానికీ, వొత్తిడి వల్ల అలా వుండడానికి వున్న తేడాను నీవు అర్థం చేసుకోలేవులే" అంటూంది సోనాల్.

సోనాల్ చేసే ఈ వాదానికి నాదగ్గర సమాధానం లేదు.

ఇవాళ సోనాల్‌తో కాదు రాజేందర్‌తో ఇలాంటి చాలా విషయాలు మాట్లాడాలి, గతంలో ఆయనతో మాట్లాడటానికి భయపడిన విషయాలు ఇప్పుడు మాట్లాడాలి.

ఒక రోజు నీవు ఇంటికి రాకపోతే నేను ఎంత ఆందోళన చెందానో అని రాజేందర్‌కు చెప్పాలనుంది. ఆ రాత్రి ఎన్నో రకాలైన భయాలతో సతమత మయ్యాను. ఆరాత్రంతా కుమిలి పోతూనే వున్నాను. ఉదయం పొరుగింటికి వెళ్ళి నీ గురించి వాకబు చేయమని వాళ్ళను కోరాను.

నీవు ఇంటికి తిరిగి వచ్చాక నీకోసం నేను పడ్డ ఆందోళనను హర్షించక పోగా పొరుగు వారిలో నీకు అప్రతిష్ఠ కలిగించానని నామీద విరుచుకుపడ్డావు. నువ్వో స్నేహితునింట తాగుతూ ఉండిపోయావు. ఆ స్నేహితుడు నిన్ను రాత్రంతా అక్కడే వుంచుకున్నాడు. "అదేమంత పెద్ద విషయం?" అన్నావు. "నేనేమన్నా చిన్న పిల్లాడినా?" అని సమర్థించుకున్నావు. నేను వాదిస్తే నీవు మరింత రెచ్చిపోయి "నేనేమీ నీ బానిసను కాను నేను చేసే ప్రతి పనికీ నీ అనుమతి తీసుకోవడానికి. అదీగాక మంచేదో, చెడేదో చెప్పడానికి నువ్వెవరు? నా జీవితంలో నీ జోక్యం అవసరంలేదు."

రాజేందర్ చాలా మొరటుగా ప్రవర్తిస్తున్నాడు. ఇక ఏం చెప్పినా ఫలితం లేదు. కాని ఈ మాటలకే నా మనసు తీవ్రంగా గాయపడింది.

"రాత్రంతా ఇంటికి రావు గానీ అందుకు నన్ను బాధకూడా పడవద్దంటావా? ఇదెలా సాధ్యం?" కాస్త ధైర్యాన్ని కూడదీసుకుని అన్నాను.

"నీ బాధ, నీ ఆందోళన ఇవే నీకు ముఖ్యం. నా జోలికి రాకు. ఇంట్లో అడుగు పెట్టినప్పటి నుంచీ నాపై ఎగిరిపడుతున్నావు. ఇప్పుడే చెప్తున్నాను. ఇదే చివరిసారి. మరొకరి వ్యవహారంలో తలదూర్చి ఉక్కిరిబిక్కిరి చేయడం మానుకో. నీ పనేదో నువ్వు చూసుకో. ఎప్పుడూ నా గొడవలో తలదూరుస్తా

వెందుకు? నా సంగతి నేను చూసుకోగలను. నా గురించి నీవు బాధపడనవసరం లేదు" రాజేందర్ కోపంగా అన్నాడు.

నేనిక నోరుమూసుకు కూర్చున్నాను. ఇంకేమన్నా అన్నానంటే ఇక మరింత రెచ్చిపోయే అవకాశముంది. నాలో నేనే కుమిలిపోవడం ప్రారంభించాను. స్విచ్ నొక్కగానే వంట చేయడం మొదలుపెట్టడానికీ, బట్టలుతకటానికీ, ఊడవటానికీ, ఆయనకు కావలసిన సౌకర్యాలు, వసతులన్నీ సమకూర్చటానికి, స్విచ్ ఆఫ్ చేస్తే మారు మాట్లాడకుండా, ఆయన రాత్రంతా ఇంటికి రాకున్నా మాట్లాడకుండా ఉండటానికి నేనేమీ యంత్రాన్నికాదే!

స్త్రీ ఏదైనా మనసారా స్వీకరిస్తేనే ఏ సంబంధమైనా. ఒకసారి ఆమె మనసులో స్థానం కోల్పోతే ఇక ఏ సంబంధమూ ఉండదని నా ఉద్దేశ్యం.

చాలాసార్లు ఆయన నా ఉద్దేశ్యాన్ని నిజం చేసేలా ప్రవర్తించారు. పురుషుడు స్త్రీమనసు విరిచేందుకు ఎక్కువ కాలం అవసరం లేదని చాటిచెప్పాడు.

కాని దీన్ని నేను విశ్వసించను. బహుశా ఈ నిజాన్ని నేనెదుర్కోదలచు కోవడం లేదేమో!

ఇలాంటివి అలావుంచితే రాజేందర్ మంచివాడే.నా జీతమెంత వస్తుందని లెక్కలడగడు. ఏమేం కొన్నానని అడగడు. ఇంటికి మా బంధువు లెవరైనా వస్తే విసుక్కోడు.

అతడు నిజంగా సత్యవంతుడు. గతజీవితంలోని రహస్యాలన్నీ నాకు చెప్పాడు. ఒక యువతితో ఎలా లేచిపోవాలనుకుందీ, 'ఒకవేళ ఆమెకు ఆడపిల్ల పుట్టి ఆ పిల్ల కూడా పెరిగి పెద్దయి ఇలాగే తయారైతే' అన్న ఆలోచన రాగానే లేచిపోయే ప్రయత్నాన్నే విరమించుకున్నదీ నాకు చెప్పాడు.

ఈనాటికి కూడా ఎప్పుడైనా ఏ స్నేహితుని భార్యనో, లేదో ఏ అందమైన స్త్రీనో బస్సులో ఆయన పక్కన కూర్చుంటేనో, ఆఫీసులోని సహోద్యోగినులు ఆయనను వలలో వేసుకోవాలని ప్రయత్నిస్తేనో ఏదీ దాచకుండా నాతో చెప్తారు.

"ఇవన్నీ నీకు చెబితే నీకు బాధ కలుగుతుందనే సంకోచమేమీ లేదు కాబట్టి అవన్నీ నీకు చెబుతాడ"ని సోనాల్ అంటుంది.

కానీ నా అభిప్రాయం వేరు. అవన్నీ చెప్తున్నప్పుడు నేను రియాక్ట్ అయితే చెప్పడం మానేస్తాడు. అబద్ధాలు, క్షమాపణలు అల్లడం చేస్తాడు.

ఇవాళ రాజేందర్‌తో చాలా విషయాలు మాట్లాడాలి. నాకు కావలిసిన వస్తువేదైనా నా అంతట నేనుగా కొనుక్కోగలను. అయినా నీవే నాకోసం ఏమైనా తీసుకురమ్మని చెప్పాలి.

పుట్టి పోయిన మన బిడ్డ లేని తోడు నన్ను చాలా తీవ్రంగా బాధిస్తోందనీ బతికుంటే వాడిప్పుడు బడికి వెళ్తుండేవాడనీ చెప్పాలని వుంది.

మరో సంగతి. నేను కాలేజీలో చదువుతున్నప్పుడు ఒక కుర్రాడి ప్రేమను తిరస్కరించినందుకు అతను ఆత్మహత్య చేసుకున్నాడనీ అప్పుడప్పుడు అతను గుర్తుకొస్తుంటాడనీ కూడా చెప్పాలని వుంది.

ఆఫీసులో, ఇంట్లో పనిచేసి చేసి అలసిపోయాను. ఈ అలసటవల్ల ఒకవేళ ఇంట్లో ఏదో ఒక వంటకం తక్కువైతే మాత్రం ఆయనకు అన్నం రుచించదేమోనని భయంగా వుందని ఆయనకు చెప్పాలని వుంది.

ఎప్పుడైనా మీరు కాఫీ హౌస్‌కు వెళ్ళినా, క్లబ్బుకు వెళ్ళినా, లేదా స్నేహితుని ఇంటికివెళ్ళినా ఇంట్లో ఒంటరి తనంతో బాధపడుతున్నానని కూడా ఆయనతో చెప్పాలని వుంది.

నేనో పిరికిదాన్ని. రాజేందర్‌లో తరచూ మారిపోయే మూడ్‌ను మౌనంగా చూస్తూ వుండిపోతాను. ఆయన చెప్పే ప్రతిమాటకు సరేననడం మినహా నా భావాలను వ్యక్తం చేసే ధైర్యమే నాకు లేదు. అంటే ఏమిటి? నాకు స్వతంత్రంగా ఆలోచించే శక్తి లేదన్నట్లేగా, పూర్తిగా నాకా శక్తి పోయినట్లేగా!

వచ్చే జన్మలో నాకు ఇంగ్లండులో జన్మించాలనుందని, నదీతీరంలో చిన్న కుటీరంలో నేనొక్కదాన్నే జీవనం గడపాలని వుందని ఆయనకు ఈరోజు చెప్పాలనిపించింది. ఇప్పుడు నాకిష్టమైన పుస్తక పఠనానికి ఏ మాత్రం సమయం చిక్కడం లేదు కదా! అప్పుడు మాత్రం చాలా పుస్తకాలు తెచ్చుకుని చదువుతాను. బోల్డంత సంగీతాన్ని వింటాను. అన్నట్లు సెలవు రోజుల్లో ఆలస్యంగా నిద్ర లేస్తాను... ఇవన్నీ ఆయనకు చెప్పాలనిపించింది.

కలలో ఆ కుటీరానికి అనేక సార్లు వెళ్ళాను.

రాజేందర్ అంటే నాకిష్టం లేదని కాదు. ఆ మాటకొస్తే నేను రాజేందర్‌ను మాత్రమే ఇష్టపడతాను. అమ్రిక్ అన్నా ఇష్టముంది. అయితే అమ్రిక్‌ను ఇష్టపడడమంటే అందరూ ఓ పువ్వునిష్టపడినట్లు, ఓ నదిని ఇష్టపడినట్టు, ఓ

ఇంటి నిష్టపడినట్లు.

అయితే రాజేందర్‌కు ఇదంతా ఎప్పుడూ చెప్పలేదు. ఇదంతా వినడానికి ఆయనకు సమయం లేదు. ఈ రోజు అన్నీ ఆయన ముందు వెళ్ళగక్కినట్లు ఊహ.

నా వల్ల ఆయన ఇబ్బంది పడకూడదు. ఆయనకు ఇబ్బంది కలిగిందంటే నా పాదాలకింది నేల కంపించినట్లుంటుది. నిజానికి నేను.... చాలా బలహీనురాలిని. అందుకే....

# IV

ఈ రోజు రెండవరోజు కూడా ఆఫీసుకు వెళ్ళాలనిపించలేదు.

జీవితం స్తంభించినట్లనిపిస్తోంది.

ప్రతిదీ చిందరవందర అయినట్లనిపిస్తోంది.

ఈ రోజు ఉదయం చెట్లకు నీళ్లు పట్టడమే మరచిపోయాను.

బిగుతుగావున్న ఈ బట్టలవల్ల ఊపిరాడ్డంలేదు. అసలు గాలి ఆగినట్లుంది. రాజేందర్ ఆఫీసుకు వెళ్ళిపోయాక, చన్నీళ్ళతో తలస్నానం చేశాను.

తలపై చల్లని నీళ్ళు పడుతుండగా జుట్టంతా విడదీసి పట్టుకున్నాను. ఆ చల్లదనం నా ఒళ్ళంతా పాకుతోంది. తలార స్నానం చేసి తడి వెంట్రుకలతోనే ఇంటి పై కప్పు మీదకు వెళ్ళాను... పై నుంచి చూస్తే, కిందనున్న ఇళ్ళన్నీ చాలా చిన్నగా కనిపిస్తున్నాయి.

ఆకాశంలో గద్ద ఎగురుతోంది.

"అదెంత దూరం ఎగరగలుగుతుంది. న్యూయార్కువరకూ వెళ్ళగలదా?" నాలో ఈ ఆలోచన ఎందుకు మెదిలిందో అర్థం కావడం లేదు.

ఎదురింట్లో ఆవిడ కూడా పై కప్పు మీదకు వచ్చి తీగపై తడి బట్టలు ఆరవేస్తోంది. నేను కిందకు వచ్చేశాను.

స్టౌ మీద పప్పుపెట్టి కూరగాయలు కోస్తున్నాను. క్యారట్లు పెచ్చు తీయడం కష్టంగా వుంది. కత్తి మొద్దుబారిందో నా శక్తి అంతా తగ్గిందో తెలియడం లేదు. ఆయనకు క్యారట్, బటానీలు కలిపి వండిన కూరంటే ఇష్టం. అందుకే ఈ కూర రుచిగా వుండేందుకు ఎంత శ్రద్ధ తీసుకుంటాను.

ఈరోజు శనివారం. మధ్యాహ్నం రెండవుతోంది. ఇవాళ ఆఫీసులు ఒంటిగంట వరకే.

ఆయనింకా రాలేదు.

నాకు ఆకలి దంచేస్తుంది.

ఆయన వస్తారేమోనని మధ్యాహ్నం మూడింటి దాకా ఎదురు చూసి ఇక ఉండలేక భోంచేశాను.

చేతులు కడుక్కుని కారిడార్‌లు దుప్పటి పరచుకొని చిన్న కునుకు తీద్దామని పడుకున్నాను. మెలకువ వచ్చేసరికి అయిదయ్యింది.

తర్వాత ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది రాత్రి పదకొండయినా ఆయన ఇంటికి రాలేదు. నా మనసేదో కీడు శంకిస్తోంది. దేవునికి దండం పెట్టుకున్నాను.

అంతలో బయటి గేటు చప్పుడైంది.

ఆయన లోపలికి వచ్చారు. గేటు వేయలేదు. స్కూటర్ పార్క్ చేసి బాత్రూంలోకి వెళ్ళారు. బట్టలు మార్చుకోకుండానే మంచంమీద పడుకున్నారు.

ఆయన తాగి వున్నారు.

గేటు తాళం వేసి తిరిగివచ్చి ఆయన కాళ్ళకున్న షూష్ విప్పాను. మంచం మీద పడుకున్న ఆయనకు దుప్పటి కప్పి కదిపి "భోం చేస్తారా!" అనడిగాను.

"పో అవతలికి" అరిచారు నన్ను తోసివేస్తూ.

నాకు ఒక్కసారిగి తలలో రక్తం పొంగినట్లయింది. కాళ్ళూ, చేతులు వణికాయి.

వంట గదిలోకి వెళ్ళి అన్నం వడ్డించుకుని తిన్నాను. తిన్నాను అనేకంటే నీళ్లతో మింగాను అనచ్చు.

మంచం మీద ఆయన పక్కన పడకోవాలంటే భయమేసింది. ఆయన వ్యక్తిత్వంలోని ఈ వైఖరి నాకు పూర్తిగా కొత్త.

రాత్రి పొద్దుపోయేవరకు మేలుకొనే వున్నాను. ఆయన నిద్రలో ఏదో పలవరిస్తూనే వున్నారు.

లేచి స్టడీ రూంలో సోఫా మీద పడుకునేందుకు వెళ్ళాను.

ఎంతకూ నిద్ర రావడం లేదు. ఎడతెగని ఆలోచనలు. భయాలు...

గది లోపలి నుంచి గొళ్ళెం పెట్టి అప్పుడు నిద్రపోయాను.

పొద్దున నిద్రలేచేసరికి ఆయన టీ తాగుతున్నారు.

నాకు మిగల్చలేదు. తనకోసమే చేసుకున్నారు. నాకోసం తయారు చేసుకోవడానికి వెళ్ళేముందు "మరో కప్పు తీసుకుంటారా!" అనడిగాను. ఆయన సమాధానం చెప్పలేదు. చాలా బాధేసింది.

కప్పులో పోసుకుని తాగబోతుండగా "ఎంతకాలం నుంచి ఈ నాటకం సాగుతోంది?" రాజేందర్ కటువుగా అడిగారు.

"ఏం నాటకం!" నేను కప్పు కింద పెడుతూ అన్నాను.

"అదే అమ్రిక్‌తో నీ సంబంధం!"

"మా మధ్య అలాంటి సంబంధమేదీ లేదు."

"నువ్వు చెప్పేది పచ్చి అబద్ధం."

"నన్నిలా అవమానించే హక్కు మీకు లేదు." దుఃఖం పొంగుకొస్తోంది నాకు.

"చాలు. మనం ఒక నిర్ణయానికి వద్దాం. నీతో ఇక కలిసి వుండలేను." ఆయన చెప్పారు. నేను షాక్ తిన్నాను.

ఈ దిగ్భ్రాంతిలో ఏం జరుగుతోందో నాకు తెలియటం లేదు.

ఏడుపు కూడా రావడం లేదు.

"నువ్వు వెళతావా లేకపోతే నేనే ఎటైనా వెళ్ళిపోతాను." ఆయన చాలా సీరియస్‌గా అన్నారు. ఆయన అన్నంత పనీ చేసేవారే. భయం నన్నావరించింది. ఆయన వెళ్ళేలోగా నేనే లేచి బట్టలు కూడా మార్చుకోకుండానే గడపదాటాను.

ఆయన తలుపు మూయలేదు. నేను తిరిగివచ్చి కాళ్ళావేళ్ళాపడి క్షమాపణ వేడతాననుకున్నారేమో!

ఏం చెయ్యాలో ఒక్క క్షణం పాలు పోలేదు. కొంతసేపు అలా స్థాణువై నిలబడిపోయాను. బహుశా నిజంగా ఇంట్లోంచి వెళ్ళి పొమ్మనడం ఆయన ఉద్దేశమై వుండక పోవచ్చు. బయటికి వచ్చి నా చేయి పట్టుకుని లోపలికి తీసుకెళతారేమోనని భావించాను. కాని అలాంటిదేమీ జరగలేదు.

కొంతసేపటికి మెల్లగా నడుస్తూ రోడ్డెక్కాను. రిక్షా తీసుకుని సోనాల్ ఉంటున్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కు చేరుకున్నాను. ఆమె దగ్గర డబ్బులు

తీసుకొని రిక్షావాడికిచ్చి పంపించివేశాను.

సోనాల్ దగ్గర కొంత పైకం తీసుకుని మా అమ్మానాన్నల వద్దకు వెళ్ళాలనుకున్నాను. కాని ఆమె నన్ను వెళ్ళనివ్వలేదు. "అమ్మా నాన్నల దగ్గరికి వెళ్ళి జరిగిందంతా ఫిర్యాదు చెయ్యడానికి నువ్వేమీ చిన్న పిల్లవు కావు. అదీగాక, నీ సమస్యలన్నీ వారికి చెప్పి వాళ్ళను ఇబ్బందిపెట్టే హక్కు నీకు లేదు. పైగా ఇతడ్ని నీ అంతట నీవు ఎన్నుకున్నావు." ఆమె అంది.

"అయితే నన్నేం చెయ్యమంటావు?" అడిగాను ఆందోళనగా.

"నీ అదృష్టం బావుంది. నీకు నీ ఉద్యోగం వుంది. అది చాలు ఇంకేమీ అక్కర్లేదు. ఈ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో చేరిపో. రాజేందర్‌కు నీవు కావాలనుకుంటే తన తప్పు తెలుసుకొని తనే నీవద్దకు వచ్చి తీసుకెళతాడు. అలా జరక్కపోతే అక్కడికి వెళ్ళి ప్రయోజనం ఏమిటి?" సోనాల్ నాకు సలహా ఇచ్చింది.

నాకు ఎటూ తోచడం లేదు. సోనాల్ చెప్పిందే సరైందనిపిస్తోంది

"మరి నా బట్టలు" అన్నాను. సోనాల్ నవ్వి "నా దగ్గర ఓ వెయ్యి రూపాయలు తీసుకుని నీక్కావలసినవి కొనుక్కో!" అంది.

మరునాడు కూడా నేనాఫీసుకు వెళ్ళలేదు.

"నా స్నేహితురాలు సోనాల్‌కి వంట్లో బాలేదు. కొన్నాళ్ళు నేను వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లోనే వుంటున్నాను" అని మా అమ్మకు ఉత్తరం రాశాను.

నిజానికి నాగురించి నాకంటే మా అమ్మకే ఎక్కువ తెలుసు. అందుకే ఉత్తరం అందుకోగానే నా దగ్గరికి వచ్చింది.

"ఏమైంది" అమ్మ ప్రశ్న.

రాజేందర్ నన్నుమానించాడనీ, ఇంట్లోంచి వెళ్లిపొమ్మన్నాడనీ చెప్పాను.

అమ్మకు కోపం వచ్చింది.

నేను వద్దంటున్నా వినకుండా వెంటనే రాజేందర్‌ను కలిసేందుకు వెళ్ళింది. నేనలాంటిదాన్ని కానని అమ్మకు తెలుసు.

"సంపాదించే స్త్రీలకు తలబిరుసు ఎక్కువ. నేను ఆమెతో కలిసి జీవించలేను" అన్నాడు. అమ్మ చాలా నొచ్చుకుని నా దగ్గరికి తిరిగివచ్చింది. నా తప్పేమీ లేకపోయినా క్షమాపణ చెప్పి ఇంటికి తిరిగి వెళ్ళమని ఆమె కోరింది.

"నా తప్పేమీ లేనప్పుడు నేనెందుకు క్షమాపణ చెప్పాలి?"

"అతను నీ భర్త. అతనేదో అన్నా పెద్ద విషయం కాదు" అమ్మ నచ్చజెప్ప జూసింది. "మొగుడు భార్యకు తిండీ బట్టే కదా పెట్టేది? హర్‌జిత్‌కు అవి కూడా అక్కర్లేదని" సోనాల్ చెప్పింది.

"స్త్రీ బతికేది తిండీ బట్టకోసమేనా!" నా ఆవేదన.

"తిండీ, బట్ట మాత్రమే అయితే ఉద్యోగం వదిలేసి నాతో వచ్చేయి. నిన్ను నేను పోషిస్తాను" అమ్మ మండిపడింది.

"చూడమ్మా! స్త్రీ 24 గంటలూ ఇంటి చాకిరీ చేయడం లేదూ! ఆదివారం సెలవైనా వుందా ఆమెకు? జీవితాంతం ఇది చేసినందుకు ఒక జీతమో, ప్రమోషనో ఉందా? ఆమెకు వచ్చే ప్రతిఫలమేమిటి? అదీగాక యజమాని మనసు ఎప్పుడైనా మారవచ్చుననే భయంతో బతకాలా!" సోనాల్ అమ్మతో ఆవేశంతో అంది.

"ఇల్లు భర్తదికాదు. భార్యది. ఈనాటి పిల్లలకు ఇది అర్థం కావడం లేదు." సోనాల్‌కు వివరణ ఇస్తున్నట్లు అంది అమ్మ.

"ఆ ఇంటి యజమాని భార్యను ఎప్పుడైనా బయటికి వెళ్లగొట్టవచ్చు. హర్‌జిత్‌కు భర్త అదేగతి కదా పట్టించాడు."

"ఆమె రాజేందర్‌కు నచ్చని పని ఏదో చేసి వుంటుంది." అమ్మ కారణాన్ని అన్వేషించింది.

"అతని ఇష్టాలే ఎందుకు ముఖ్యమనుకోవాలి? ఆమె ఇష్టాల్ని కూడా అలాగే గౌరవించవచ్చుకదా!"

"ఒకరి ఇష్టాయిష్టాల్ని గురించి మరొకరు వాదించుకుంటుంటే సాధించేది ఏమీ వుండదు. నా దృష్టిలో మహిళలకు పెద్ద చదువు చెప్పించకూడదు" అమ్మ చాలా ఆగ్రహంగా అంది.

"రాజేందర్ స్వయంగా తానే నన్ను వెళ్ళిపొమ్మన్నాడు" అన్నాను మళ్ళీ "అతనీమాట ఏదో కోపంలో అని వుంటాడు. దానర్థం నీవిక్కడ శాశ్వతంగా ఉండిపోవాలని కాదు. వివేకంతో ఆలోచించు. ఇల్లన్నాక అనేకం వస్తుంటాయి. ఎంతో సహనం వుండాలి" అమ్మ నన్ను తప్పుబట్టింది.

నేను ఏడ్చేశాను.

"మీరేం బాధపడకండమ్మా! వాళ్ళను సావధానంగా ఆలోచించుకో

నివ్వండి. వాళ్ళే రాజీ పడతారు. పైగా హర్‌జిత్‌కు రాజీపడడం తప్ప ఇంకేం చేతనవుతుందిలే" సోనాల్ నన్ను ఉద్దేశించి వ్యంగ్యంగా అంది.

అమ్మ సోనాల్ ముందు ఊరుకుంది. ఆమె వెళ్ళాక నా మీద విరుచుకు పడింది. "అసలు నీకేమయిందే? అలాంటి వాళ్ళేనే నిన్ను తప్పుదారి పట్టించేది. తర్వాత నష్టపోయేది నీవే. అప్పుడెవరూ కాపాడలేరు. భర్త ఒక్కడి వల్లనే నీవు గౌరవంగా జీవించగలవు. మగడు లేకుండా ఆడది చిల్లి గవ్వకు పనికి రాదు. కొన్నిసార్లు అతని కోపాన్ని భరించాలి. వాదులాట పెట్టుకుంటే ప్రయోజనం లేదు. కాస్త శాంతంగా ఉంటే వచ్చే నష్టమేమీలేదు. మగవాడు బయట లోకంతో పోరాడాల్సి ఉంటుంది. ఇక ఇంట్లో భార్యతో కూడా పోట్లాడవలసి వస్తే అతను కొరగాని వాడవుతాడు." అమ్మ నీతి వాక్యాలు.

"రాజేందర్ నన్నుమానించాడు." నేనన్నాను.

"దేనికి?"

"మా ఆఫీసులో ఒకాయనతో సంబంధం వుందని."

"నువ్వో పని చెయ్యి. ఉద్యోగం మానెయి." అమ్మా సలహా ఇచ్చింది.

"నో. ఉద్యోగం వదిలే ప్రసక్తే లేదు" ఖండితంగా అన్నాను.

"ఇంట్లో నీవు నిర్వర్తించవలసిన విధి ప్రధానం" గట్టిగా చెప్పింది.

"నీ జీవితమంతా నువ్వదే పని చేశావు. ఇల్లు, భర్తే సర్వస్వమనుకున్నావు. నాన్న నిన్నేం పట్టించుకున్నాడు?" నేనీ మాటలనడంతో అమ్మ బాగా నొచ్చుకుంది.

నాకివన్నీ తెలియవనుకుంది అమ్మ. తెలిసినా అవేవీ పెద్దగా అర్థమయ్యే విషయాలు కావనుకుందేమో!

ఇక ఊరుకుంది. తిరిగి వెళ్ళి పోయింది.

అమ్మ రాజేందర్ వాళ్ళమ్మానాన్నల దగ్గరికి వెళుతుందని, అలా రాజేందర్‌కు నచ్చజెప్పమని కోరుతుందని అనుకున్నాను కాని అలా వెళ్ళలేదు.

## V

రోజూ ఆఫీసుకు వెళుతున్నాను.

ఆఫీసులో నా పని చూసుకుంటున్నాను. ఇంకా మనసులో కలతగానే వుంది. భారమైన హృదయంతో హాస్టల్ నుంచి ఆఫీసుకెళుతున్నాను, ఆఫీసు నుంచి హాస్టల్‌కు వస్తున్నాను. ఎలాంటి మార్పులేదు.

లేనిపోని ఆలోచనలు మెదడును తొలుస్తున్నాయి. కొన్నిసార్లు నేనేదో రైల్వే లైన్లమధ్య నలిగిపోతున్నట్లు లేదా స్వచ్ఛమైన గంగాజలాల్లో మునిగిపోతున్నట్లు ... కొన్నిసార్లు ఎక్కువగా నిద్రమాత్రలు మింగి నిద్రలోకి జారి ఇక తిరిగి లేవనట్లూ అనిపిస్తుంది.

ఇది నా బలహీనత అని తెలుసు. అవాంతరాలెదురైతే ధైర్యంగా వాటిని ఎదిరించలేక నిర్జీవంగా వాటికి లొంగి పోతుంటాను. అయినా ఎన్ని అవాంతరాలు వచ్చినా తట్టుకొని నిలబడతాను.

కాని ఎలాంటి అవాంతరాలు! పాశ్చాత్య యువతులు ఎందుకిలా ఒకర్ని విడిచి మరొకరితో జీవనం సాగిస్తారు? అని క్యాథీని అడిగాను. దానికి ఆ అమ్మాయి నవ్వుతూ "ఒకరితో జీవనం దుర్భరమైనప్పుడు దాన్ని పట్టుకుని వేళ్ళాడేంతగా అంటిపెట్టుకోవడమెందుకు? అదీగాక! మానవ జీవితం బంధాలకంటే చాలా ముఖ్యమైంది" అంది.

క్యాథీ పద్దెనిమిది, పందొమ్మిదేళ్ళ అమ్మాయి. అత్యంత సంపన్నులైన తల్లి దండ్రులకు ఒక్కగానొక్క కూతురు. భారతీయ యువకుడ్ని పెళ్ళాడింది. ఇప్పుడు అతని దేశాన్ని చూడడానికి అతని తలిదండ్రుల్ని కలుసుకోవడానికి వచ్చింది. కావలసిన సూట్లు, చీరలు కొనడానికే కాక తన భర్త పుట్టిన మట్టిపరిమళాన్ని కళ్ళకద్దుకోవడానికి వచ్చింది.

"రేపు ఎప్పుడైనా అమర్‌జిత్ మరో 'స్త్రీతో' జీవించేందుకు సిద్ధపడితే!" నేనామెను అడిగాను.

"ఏముంది? గుడ్ బై చెబుదాం" ఆమె చాలా తేలిగ్గా తీసుకుంది.

"అంత సులభమా?" నేను కలవరపడ్డాను.

"నిజమే. అంత సులభమేమీ కాదు. కానీ తెగిన బంధాన్ని ఎంతోకాలం లాగడం కష్టం కదా!"

"ఇంత చిన్న వయసులో ఇదంతా నీకెలా తెలుసు?

ఆమె నవ్వి చెప్పడం ప్రారంభించింది. "ఇది తెలియడానికి ఏళ్ళు అవసరం

లేదు. తెగిన బంధాలను బలవంతంగా లాగితే బాధపడతాం. మనతో పాటు అనుబంధాలు సజీవంగా పెరగకపోతే వాటిని మనమే తెంచేసు కుంటాం. ఇప్పుడు అమర్‌జిత్ నాతో వున్నాడు. ఓ ఐదేళ్ళు పోయాక అతని శరీరకణాలు మార్పు చెందుతాయి. అవి మారినప్పుడు అతను మారకుండా ఉంటాడా?"

"క్యాథీ! ఈ అనుబంధాలు ఇక్కడ... భారదేశంలో ఒక జన్మకు సంబంధించినవి కావు. ఎన్నెన్నో జన్మల నుంచే పెనవేసుకుని వుంటాయి. ఇక్కడి స్త్రీలు ఈ విశ్వాసంతో జీవిస్తారు."

"ఈ విశ్వాసం కలిగిన మహిళల జీవితం చాలా హాయిగా గడిచిపోతుంది. ఉదయం ఇంటినుంచి పని మీద బయటికి వెళ్ళిన భర్త సాయంత్రం ఇంటికి తిరిగివస్తాడా రాడా అన్నది మనకే తెలియదు."

"అయితే బంధాలపై నమ్మకం లేకపోతే ఎవరైనా ఎలా జీవిస్తారు.?"

"ఈ వాస్తవాన్ని అంగీకరించడంవల్ల ఈ బంధం శాశ్వతంగా నిలుస్తుందా అనీ మీకు సందేహం వుంది. ఇంకోవైపు వైవాహిక బంధాల్లో అపనమ్మకం యేర్పడవచుననే భావాన్ని మీరు జీర్ణించుకోలేక పోతున్నారు. ఇదే నేటి భారతీయ స్త్రీలతో వచ్చిన సమస్య.

"ఇంత చిన్న వయసులో ఇన్ని విషయాలు నీకెలా తెలుసు క్యాథీ!" నా ప్రశ్న మళ్ళీ వేశాను. ఆమె మళ్ళీ నవ్వి "మీరు అడగాలనుకుంటున్న దేమిటి శ్రీమతి రాజేందర్?" అంది.

సోనాల్ అప్పుడే లోపలికి వస్తూ అంది. "క్యాథీ! వెనుకటికి గౌతమ మహర్షి భార్య అహల్య వుండేది. అలాగే గౌతమ బుద్ధుని భార్య యశోధర ఉండేది. ఇప్పుడు ఇక్కడ రాజేందర్ గౌతమ్ భార్య హర్‌జిత్ వుంది. ఇంతకూ తను అలనాటి అహల్యలాగా జీవించాలా, యశోధరలా జీవించాలా లేదా హర్‌జిత్‌లా జీవించాలా అన్నది నిర్ణయించు కోలేకపోతోంది. 'గౌతముడు' ప్రతి యుగంలోనూ వుంటాడు. కాబట్టి ఈమె ఆ ముగ్గురు స్త్రీ మూర్తుల వ్యక్తిత్వాల్ని మేళవించుకొని తన వ్యక్తిత్వాన్ని సంతరించుకోవాలనుకుంటోంది."

క్యాథీ ఇదంతా అర్థం చేసుకుందో లేదా నాకు తెలీదు. కాని సోనాల్ మాత్రం యుగయుగాల్లోని గౌతముల్ని తన హస్తరేఖల్లో చూపి నన్ను ఎంతో సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఇప్పుడు ఆ మూడు రకాలైన గౌతములు

ఆమె ఎడమ చేతిమీద మూడు ముఖాలు చూపే స్తంభమై కనిపిస్తున్నారు.

"క్యాథీ, అమర్‌జిత్, నేను సినిమాకు వెళుతున్నాం. వస్తావా హర్‌జిత్?" సొనాల్ అడిగింది.

"లేదు. నాకు రావాలని లేదు" చెప్పాను.

నా గదికి తిరిగి వచ్చాను.

రాజేందర్ గౌతమ్ ఎవరు?

ఎవరీ అమ్రిక్?

ఎవరీ హర్‌జిత్?

ఎవరీ సోనాల్?

ఎవరీ క్యాథీ?

మేమందరమూ ఎక్కడ నడకప్రారంభించాం?

అందరమూ ఇక్కడికి వచ్చి ఎలా కలిశాం?

రాజేందర్‌ను గురించి ఆలోచించడం మానేసే ప్రయత్నం చేస్తాను. ఇంతకూ అసలు నా సమస్య ఏమిటి?

ప్రజలు ఏమంటారన్నదే!

ఎవరీ ప్రజలు?

అమ్రిక్ అంటే నాకిష్టమని రాజేందర్‌కు నేనెందుకు చెప్పలేకపోతున్నాను. అయితే నా సోదరుడంటే కూడా ఇష్టం కదా! మామ, నాన్న, బావ... వీరందరన్నా ఇష్టమే. మరి ఈ బంధుత్వాలను గురించి అలా ఆలోచించరే. ఎందుకు? వీటికి ఏవో పేర్లున్నాయి గనకనా? ఏ పేరు లేని బంధుత్వం వుండ కూడదా? ఉంటే అలాంటి బంధుత్వం అక్రమ సంబంధమా! అంటే అక్రమ సంతానంలాగా? కర్ణుడు లాంటివారి జనన వృత్తాంతం గమనిస్తే తెలుస్తుంది. నిజానికి మన ఆలోచనా విధానం వల్ల ఒక సంబంధం అక్రమం అంటున్నాం తప్ప అక్రమం అంటూ ఏదీ లేదు.

నన్ను నేను సమర్థించుకోవడానికి ఇలా ఇవన్నీ ఆలోచిస్తున్నానా? మహిళ ఒకరి కంటే ఎక్కు మందిని ప్రేమిస్తే అది పాపం అని ముద్ర వేస్తున్నా మెందుకు? వేరెవరో ఆమెను మానసికంగా ఆకర్షిస్తే దాన్ని అన్యాయమని, భర్తను మోసం చేయడమని, వదిలి పెట్టడమని ఎలా అంటారు?

ప్రాచీన కాలంలో రాజు మరణిస్తే ఆయన రాణుల్నీ, బానిసలందరినీ ఆయనతో పాటే సమాధి చేసేవారని అంటారు.

భర్త చితిలో భార్యనువేసి సజీవంగా దహనం చేయడం కూడా స్త్రీ నిజాయితీని చాటి చెప్పేందుకే.

అంటే మనసా వాచా కర్మణా స్త్రీ భర్తకు విధేయురాలై ఉండడం అంటే మిగతా ప్రపంచంతో స్త్రీకి సంబంధం లేదన్నట్లే కదా?

అంటే ఇక స్త్రీకి తనకోసం తాను జీవించే హక్కు లేదన్నట్లే కదా?

ఈ హక్కు స్త్రీకి కాకుండా మరెవరికో ఇవ్వాలని ఎవరు నిర్ణయిస్తారు? స్త్రీ తన నిర్ణయాన్ని తానే ఎందుకు తీసుకో రాదు?

ప్రతి స్త్రీకి తన జీవితానికి తానే బాధ్యత వహించడానికి వీల్లేని ఈ పరిస్థితిపై ప్రతి మహిళా తిరగబడాలని నేను చెప్పడం లేదు. చాలా మంది స్త్రీలు నిర్ణయాలు తీసుకునే బాధ్యతను మరొకరిపై నెట్టి తాము బాదర బందీ లేకుండా జీవించాలనుకుంటున్నారు. తండ్రి రూపంలో, భర్త లేదా కుమారుల రూపంలో, కొన్ని సార్లు మతం, కొన్నిసార్లు చట్టం, కొన్ని సార్లు సమాజం, కొన్ని సార్లు సంప్రదాయాలు వారి నిర్ణయాలను తీసుకుంటూ స్త్రీని అమ్ముకొనే, పంచుకొనే, బదలాయించుకొనే వస్తువుగా చేస్తున్నారు.

ఇవన్నీ కొత్తగా అనిపిస్తాయి గాని వాస్తవాలే. గోధుమలను అమ్మి ఇంటికి కావలసిన ఇతర వస్తువులు కొన్నట్లే తన కూతుర్నిచ్చి మరొకరి కూతుర్ని మనింటికి తెచ్చుకుంటున్నాం. నిత్యావసరాలకు వస్తు మార్పిడి పద్ధతి ఉన్నట్లే స్త్రీ వినిమయ పద్ధతి కూడా అనాదిగా ఈనేలపై అలిఖిత న్యాయంగా అమల్లో వుంది.

నిజానికి అమ్మాయితో పాటే బట్టలు, ఇతర వస్తువులు కూడా ఇవ్వడం వల్ల ఆమె విలువ తగ్గినట్లవుతుంది. రెండు రూపాయలతో పాటే చెత్తకూడా తీసుకెళ్ళమని స్వీపర్‌కు చెప్పినట్లుగా ఆస్థాయిలో స్త్రీ విలువ తగ్గింది.

ఓరి దేవుడో! ఇంత దారుణంగా ఆలోచిస్తున్నానేమిటి?

స్త్రీ ఇంటికి రాణి. మగాడి ప్రేమకు నోచుకున్న స్త్రీని మాత్రమే రాణిగా పరిగణిస్తున్నారు. లేకపోతే ఆమె దుమ్ము, ధూళితో సమానం, ఓ దిష్టి బొమ్మ, ఓ దుశ్శకునం, ఓ అపకీర్తికి ప్రతిరూపు.

ఒక్కోసారి కొడుకులగన్న తల్లి మాత్రమే రాణి.

ఎందుకని?

ఏమీలేదు. ఇలాంటివన్నీ గొప్పలకోసం చెప్పుకునే మాటలు. కొడుకులు గన్న తల్లిని రాణి అన్నా, మహారాణి అన్నా, సామ్రాజ్ఞి అన్నా ఆమె చివరికి ఆ కొడుకుల మలం, మూత్రం ఎత్తిపోసి కడిగి పెంచి పెద్దచేయవలసిందే కదా!

ఆడపిల్లను కన్న స్త్రీ మానసిక స్థితి ఎక్కడో అంతరాంతరాల్లోకి కుంగి పోవడం చారిత్రక సత్యం. ఈ అభాగ్యురాలి రూపంలో తానే స్వయంగా మళ్లీ పుట్టానని ఆమె అంతరాత్మ ఘోషిస్తూనే వుంటుంది.

ఈ మాటలన్నీ కొత్తగా వున్నాయి కదూ! నాక్కూడా కొత్తగానే వున్నాయి. ఎందుకంటే ఇంతకు ముందు ఇవన్నీ చెప్పినదాన్నీకాను, విన్నదాన్ని కాను.

గుడ్డపేలికలతో చేసిన బొమ్మ మాట్లాడడం మొదలు పెట్టింది. ఆశ్చర్యంగా వుంది కదూ!

కాని ఏం చెయ్యనూ?

స్త్రీ మెత్తని పిండితో చేసింది అని కొందరంటారు. ఆమె ఇంట్లోనే వుంటే ఎలుకలు తినేస్తాయి. బయటికి వెళితే లోకులనే కాకులు తీవ్రంగా పొడిచేస్తాయి. ఇక ఆమె ఈ తినేయడాలకు, పొడవడాలకు దూరంగా క్షేమంగా వుండే మూడో స్థలం ఏదైనా వుందా?

రాజేందర్‌తో కలిసి జీవించినప్పుడు ఇలాంటి ఆలోచన నాకెప్పుడూ రాలేదు. అప్పుడు ఈయన నా భర్త. ఇది నా ఇల్లు, ఇది నాలోకం, భగవంతుడు నాకు ఎంతో ఇచ్చాడు అన్నట్లుండేది. కాని ఇప్పుడు మనిషివున్నాడు, ఇల్లుంది, భగవంతుడూ వున్నాడు. కాని వీటిలో ఏదీ నాది కాదు అన్నట్లుంది.

భగవంతుడు కూడా లేడా?

అవును. భగవంతుడే నాకుంటే నన్ను చల్లగా చూసేవాడు. ఏ స్త్రీ రాజ్యాల్ని కోరదు. వస్తువాహనాలను ఆశించదు. నగలూ నాణాలూ అడగదు. "ఈ ఇల్లే నా చిన్న ప్రపంచం. నేను కోరేదల్లా ఇది బావుండడమే" అని అడుగుతుంది.

ఇవన్నీ ఆలోచిస్తూ నేను పిచ్చిదాన్నయ్యేలా వున్నాను. నేను సోనాల్ వాళ్ళతో సినిమాకు వెళ్ళుండాల్సింది.

సుప్రసిద్ధ రచయిత్రి వర్జీనియా ఊల్ఫ్ ఒకనాడు సముద్రంలోకి వెళ్ళి

ఇక తిరిగిరాలేదు. శవాన్ని వెలికి తీశారు.

సిల్వియాప్లాత్ కూడా ఆత్మహత్యకు పాల్పడింది.

ఈ రచయిత్రులు ఈ సుడిగుండంలో ఎలా చిక్కుకున్నట్లు?

సిల్వియా! మరణించడం అంత తేలికా!

తనకోసం మరొకరు మరణించేంత స్థాయి ఉండడం ఎవరికైనా గొప్ప. అన్న సోనాల్ మాటే సత్యం.

నా మనసింకా కల్లోల భరితంగానే వుంది. రాజేందర్ నా వద్దకు వచ్చి "హర్‌జిత్! ఇంటికి వెళదాం రా! నువు విడిచి పెట్టిన ఆ ఇల్లు నాది మాత్రమే కాదు నీది కూడా " అని అంటే బావుండునని మనసుకు అనిపిస్తోంది. కాని నో... అతనలా అనడు.

చాలా మంది స్త్రీలు తిట్టినా, తన్నినా భర్తలతోనే కాపురం చేస్తుంటారు. వాళ్ళకు మనసు గాయపడదా? శరీరం వేరు, మనసు వేరు అన్నట్లు ద్వంద్వ జీవితాలు గడుపుతారా? వాళ్ళకు మనసనేది లేదా?

ఆడపిల్లలకు మరీ ఎక్కువ చదువు చెప్పించ కూడదని అమ్మ అనడం సరైన మాటే.

వెనుకటికి తక్కువ కులం వారు, స్త్రీలు వేదం చదువుకోకూడదని నిషేధించడమే అందుకు కారణమై వుంటుంది.

కాని ఇది ఆ కాలం కాదు!

## VI

న్యూయార్కు నుంచి అమ్రిక్ ఉత్తరం మా ఆఫీసు చిరునామాకు వచ్చింది. కాదు నా ఉత్తరం వచ్చింది. కాదు కాదు నా ఉత్తరానికి సమాధానం వచ్చింది.

ఆయన ఇలా రాశారు:

"ఈ సమయంలో మీ మంచి మాటలు నాకెంతగానో అవసరం. నాక్కూడా త్వరగా కోలుకోవాలని, నా దేశానికి, నా ఇంటికి, ఆఫీసుకు తిరిగి రావాలని వుంది... ప్రేమతో."

ఎందుకో... నాకు తెలియకుండానే ఆ ఉత్తరం చదువుతుంటే నా చేతులు వణుకుతున్నాయి. ఎందుకో తెలీదు. అది చదివాక ఏడ్చేశాను."

నా సాంసారిక జీవనం చెల్లా చెదరైపోయిందని అమ్రిక్‌కు చెప్పాలని పిస్తోంది. నాకిప్పుడు ఇల్లనేది లేదు. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో తల దాచు కుంటున్నాను. రాజేందర్ నేనో నీతి మాలిన స్త్రీని అనుకుంటున్నాడు... నేను చచ్చిపోవాలనుకుంటున్నాను అని కూడా చెప్పాలనివుంది.

అంతలోనే మళ్ళీ ... ఆయన నాకేమవుతారు. ఇదంతా ఆయన కెందుకు చెప్పాలి అనిపించిందినాలో నాకే.

చెంపల మీదుగా కన్నీళ్ళు వస్తున్నాయి.

అమ్రిక్ త్వరగా కోలుకోవాలని, తన దేశానికి, తన ఇంటికీ, ఆఫీసుకు తిరిగి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

నాకు ఆయన 'ప్రేమతో' అని రాశారు.

ఎందుకలా రాశారు?

ఒక వేళ ఆయనకు జరక్కూడనిది ఏదైనా జరిగితే, ఆయన తిరిగి రాకపోతే రాజేందర్ అనుమానాలన్నీ తొలగిపోతాయి. నాలో మరో ఆలోచన కదిలింది.

నో... నో అమ్రిక్‌కు అలా జరక్కూడదు.

ఆయన తిరిగి వచ్చిన తర్వాత రాజేందర్ నన్ను అనుమానిస్తున్నాడని తెలిస్తే ఏమనుకుంటారో.

ఈ అనుమానాలకు కారణమేమిటని అమ్రిక్ అడిగితే నేనేమని చెప్పను? నేను వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటున్నానని తెలిస్తే నా కొలీగ్స్ ఏమను కుంటారో?

ఏదైనా వేరే పట్టణానికి నాకు బదిలీ అయితే బావుండు.

కాని అక్కడ కూడా ఇలాంటి వాళ్ళు ఉండకపోతారా?

ఇలాంటి ఆలోచనలతో రాత్రి పొద్దుపోయే వరకూ మేలుకొనే వున్నాను. చివరికి నిద్రమాత్రలు వేసుకుని నిద్రపోయాను. పొద్దున గాఢ నిద్ర నుంచి మెలకువ వచ్చే సరికి బాగా అలసటగా అనిపించింది.

ఏ మగవాడి గురించో బాధ పడాల్సిన అవసరం ఎంత మాత్రం లేదంటుంది సోనాల్.

ఒకప్పుడు సోనాల్ కూడా ఒకతని గాఢంగా ప్రేమించింది. మనస్ఫూర్తిగా

ప్రేమించింది. అయితే అతను మరొకామెను పెళ్ళిచేసుకున్నాడు. సొనాల్‌తో స్నేహపూర్వక సంబంధాలు పెట్టుకోవాలనుకున్నాడట.

ఆ తర్వాత సోనాల్ ఎంతో మందితో స్నేహం చేసింది, వదిలేసింది. చెప్పినట్లు నడచుకోడానికి తాను ఎవరికీ భార్యను కానంటుంది. కాని మొదటి ప్రేమకు ప్రతీకారం తీర్చుకోడానికా అన్నట్లు మిగతా మగాళ్ళు ఏమైనా నాకు లెక్కలేదంటుంది.

ఆడది తనను నొప్పించడానికి మగాడికి తానే హక్కు కల్పించిందని సోనాల్ అనడం తప్పు.

ఎప్పుడైతే మగవాడికి నీవు అక్కరలేదో. అతనూ నీకు అంతే! అని కూడా సోనాల్ అంటుంది.

స్త్రీలను భర్తలు కొడుతున్నారు. తన్ని తగలేస్తున్నారు అంటే అందుకు కారణం స్త్రీలే. తెలివి లేని వాళ్ళు. వాళ్ళకు ఆ శాస్తి జరగాల్సిందే. లేకపోతే మీతో పురుషులు ఎందుకలా దురుసుగా ప్రవర్తించాలి? అని కూడా అంటుంది.

ఆమె ప్రశ్నల్లో దేనికీ నా వద్ద సమాధానం లేదు. ఆమె ఆలోచన ప్రకారం చూస్తే తానే కరక్టేమో బహుశా!

అమ్మే గనక ఇక్కడుంటే "నీ మగడే నీ దేవుడు?" అనేది.

సోనాల్ బాధగా వున్నప్పుడు తాగుతుంది. ఎక్కువ తాగితే తూలుతుంది. బాధలో తాగే హక్కు ఒక్క మగవాడికేనా వుంది! అని ప్రశ్నిస్తుంది.

ఒక రోజు స్త్రీల పాతివ్రత్యం వట్టి బూటకం అంది. ఈ వెధవ కుక్కల కోసం స్త్రీలెందుకు స్వచ్ఛంగా వుండాలి. అతను ఆమెను బాగా చూసుకున్నప్పుడు మాత్రమే అలా వుండాలనడం న్యాయం.

ఆ మాటకొస్తే ఈ దౌర్భాగ్యులెంత నీతి మంతులో చెప్పగలరా?

నీ ఆలోచనా విధానం సరికాదని చెప్పాలనుకున్నాను. మళ్ళీ నన్ను నేను తరచి చూసుకోవాలి.

ఆమె విసుక్కుంది. "వృథాగా గడిచిపోయిన నీ కాలాన్ని నీకు ఎవరైనా తెచ్చివ్వగలరా! నీకంటే ముఖ్యమైంది మరొకటి లేదు. నువ్వెందుకిలా శిలగా మారావు? ఏదో ఒకటి చెయ్యి? అతనికి విడాకులివ్వడం మంచిది."

ఆమాట వినగానే నా వెన్నులో వణుకు పుట్టింది.

ఇంత జరిగాక కూడా రాజేందర్, నేనూ శాశ్వతంగా వేరవుతున్నాం అంటే నమ్మలేకపోతున్నాను.

అంతా పీడకలలా వుంది. ఈ కల త్వరగానే కరిగిపోతుంది. ఎప్పటిలాగా ఆ రోజులు తిరిగివస్తాయి. మళ్ళీ మా ఇల్లు, మా సంతోషాలు, మా బాధలు, మా గతం, మా భవిష్యత్తు... ఎవరూ లేరు. మేమే... మేమిద్దరం, పుట్టి పోయిన మా బిడ్డ... అంతే. దైవికంగా ఇదంతా జరగవచ్చేమోనని నా అంతరాత్మ ఎదురుచూస్తోంది.

"మనసు బాధగా వుంది కదా! వైన్ తీసుకునే ప్రయత్నం చేయి మనసు కుదుటపడుతుంది" అని సలహా ఇచ్చింది సోనాల్.

"సోనాల్! నీకు తగినట్లు మంచివాడ్ని ఒకడ్ని చూసుకోరాదా?" అని నేనన్నాను. ఆమె నవ్వి... అంది "నీ భర్తనే ఎందుకు చూసుకోకూడదు" అంది.

"నేను హాస్యానికనడం లేదు సోనాల్!"

"పెళ్ళికి ముందు ప్రతివాడూ బాగానే వుంటాడు. కాని తర్వాతే చెడ్డ వాళ్ళయి పోతారు. అంతా అయ్యాక మంచివాడ్ని ఇప్పుడెక్కడ్నించి తేనూ?" ఆమె సీరియస్‌గా అంది.

"సోనాల్! పెళ్ళి చేసుకోకుండానే అన్ని తీర్పులిచ్చేస్తావు" నేను సరదాగా అన్నాను.

"పెళ్ళి వల్ల స్త్రీకి అన్నీ తెలిసిపోవు. ఆ బంధం నిలుపుకొనే ఆలోచనల తోనే ఆమెకు సరిపోతుంది."

"మరేం చేద్దాం సోనాల్?" చాలా ఆందోళనగా అన్నాను.

"నువ్వు ఒక్క విషయాన్ని అర్థం చేసుకో హర్‌జిత్! నీకు నీవు ముఖ్యం ఇంకేది కాదు."

"నన్ను చాలా ఇబ్బంది పెడుతున్నావు సోనాల్?" బాధగా అన్నాను.

"వాస్తవాన్ని జీర్ణించుకోవాలి. తప్పించుకు వెళ్ళద్దు. ఊహల్లో జీవిస్తావా? జీవితంలో దేన్నైనా ఎదుర్కొనడానికి దృఢంగా వ్యవహరించు."

అంతలోనే ప్యూన్ లోపలికి వచ్చి "ఆఫీసు నుంచి ఎవరో మిమ్మల్ని చూడడానికి వచ్చారు?" అని చెప్పాడు.

"నేనిక్కడుంటున్నానని ఆఫీసు వాళ్ళకెలా తెలిసింది?" అని అనుకున్నాను.

"ఇందులో అంతగా ఆశ్చర్యపడాల్సిందేముంది? పనిచేసే మహిళలపై మగవాళ్ళెప్పుడు నిఘా వేసే వుంటారు" అంది సోనాల్

నేనిక గేటు వైపు నడిచాను, ఆ వచ్చిన వ్యక్తి కోసం.

"చెప్పండి?" అన్నాను.

"నేను మీ ఇంటికి వెళ్ళాను. మీరిప్పుడు ఇంట్లో వుండడం లేదని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటారని ఒకామె చెప్పింది. బహుశా ఆమె సర్వెంట్ అయివుంటుంది. అయితే అలా అనిపించదు" అన్నాడాయన.

"ఏం పనిమీద వచ్చారు?" ముక్తసరిగా అడిగాను.

"నాకు అమ్రిక్ గారి చిరునామా కావాలి. మీ దగ్గర దొరకవచ్చని వచ్చాను" ఇక్కడికి రావడానికి తనకు కారణం దొరికినట్లుగా చెప్పాడు.

"లేదు. నా దగ్గర ఆయన చిరునామా లేదు" తీవ్ర స్వరంతో అన్నాను.

"ఫరవాలేదు లెండి ఇంకెవరినైనా అడుగుతాను. మీకేమైనా కావాలంటే చెప్పండి" అన్నాడు వికృతంగా. చెప్పుతో కొట్టాలన్నంత కోపం వచ్చింది. "ఇదే కాబోలు నాకోసం చేయవలసింది" అని చెబుతూ, నా హావభావాలు అర్థమయ్యాయేమో "సరేనండీ! ఇక నేను సెలవు తీసుకుంటా" అన్నాడు. చాలా కోపంగా తిరిగి వచ్చి జరిగిందంతా సోనాల్‌కు చెప్పాను.

"బాస్టర్డ్స్! వీళ్ళు నన్ను చౌకబారు స్త్రీ అనుకుంటున్నారు".

"నీ గురించి ఇతరులేమనుకుంటే నీకేమిటి? నీ గురించి నీవేమను కుంటున్నావన్నది ముఖ్యం." సోనాల్ అంది.

"రాజేందర్, నేనూ వేరుగా ఉంటున్నామని వీడికి తెలిసిందేమో!"

"కమాన్ హర్‌జిత్ నువ్వేమైనా దోపిడీ చేశావా? ఎవరినైనా హత్య చేశావా? వ్యక్తులు కలిసి వుంటారు, ఉండరు. శాశ్వతంగా కలిసివుంటారో విడిపోతారో వీరికెందుకు? వాడేమైనా చేయాలా అని అడిగితే నీ చెప్పులు ఇచ్చి బాగు చెయ్యమని చెప్పివుండాల్సింది అంతే గాని దీనికి నువ్వు డిస్టర్బ్ కావడమెందుకు? ఇలాంటివాటిని వినోదించాలి."

"సోనాల్ నిజానికి ఇలాంటి వాళ్ళు మన పరిస్థితి చూసి వినోదం పొందుతారు."

"స్త్రీ బలవంతురాలైతే ఇలాంటి వాళ్ళను పురుగుల్లా నలిపేయగలదు."

"అది కాదు సోనాల్ ఒంటరి స్త్రీ ఎప్పుడూ బలవంతురాలై వుండలేదు."

"నీకు తెలీదు. నిజానికి స్త్రీకి తెలియదు తాను ఎంత బలవంతురాలో! మగాడి బిడ్డను మోయగలిగినప్పుడు ఇంకేం చెయ్యలేదు? ఆమె అనుకుంటే ఆ మగాడి వంశాన్నే సర్వనాశనం చేయగలదు."

"దేన్నో నాశనం చేయడం బలం అనిపించుకోదు సొనాల్?" అన్నాను ఆమెను అర్థం చేసుకోకుండా.

"స్త్రీ ఎల్లప్పుడూ తనను తాను నాశం చేసుకుంటుంది. నన్ను చూడు. నిజానికి నేనెవర్ని? వాడెవడినో ప్రేమించిన ఆ సోనాల్‌ను నాశనం చేస్తున్న మరో సోనాల్‌ను నేను ఆమె ఏడ్చేసింది.

"సోనాల్!" నేను లేచి ఆమె తలమీద చేయి వేసి ఓదార్చాను.

## VII

నేనేతప్పూ చేయలేదు. అయినా ఏదో అపరాధభావం నన్ను ఆవరించింది. ఏమీ తినాలని, బాగా తయారవ్వాలని అనిపించడం లేదు.

ఎవరితోనూ మాట్లాడాలనిపించడం లేదు.

ఎక్కడికీ వెళ్ళబుద్ధి కావడం లేదు.

గడుస్తున్న ఈరోజులు జీవంలేనివిగా వున్నాయని సోనాల్ అన్నది నిజమే. దేని మీదా ఆసక్తి లేకపోవడం చూస్తే నేను శిలగా మారానా అనిపిస్తోంది.

సోనాల్‌కు ఎలా తెలుస్తాయో ప్రపంచంలోని వార్తలన్నీ తీసుకొస్తుంది. అలాంటిదే ఈ వార్త కూడ. రాజేందర్ తన గ్యారేజ్‌ని వాళ్ళ ప్యూన్‌కు అద్దె కిచ్చాడట. ఆ ప్యూన్ భార్యే ఇప్పుడు ఆ ఇంటిని చూసుకుంటుందట.

ఎందుకో తెలియదుగాని ఇది విన్నాక రాజేందర్‌కు భోజనం సమస్య తీరింది గదా అని ఉపశమనం లాంటిది కలిగింది. రాజేందర్‌కు నా అవసరం ఇక ఏమాత్రం వుండదని సోనాల్ అంది. నేను నవ్వకుండా ఉండలేకపోయాను.

"ఇందులో నవ్వడానికేమీ లేదు. చాలా మంది మగవాళ్ళకు స్త్రీ అక్కర్లేదు. నౌకరు చాలు" అంది సోనాల్.

"సోనాల్! నువ్వు పిచ్చి పిచ్చిగా ఆలోచిస్తావ్?"

"ఓకే. ఒక మగాడు ఎంతకాలం తెలివైన స్త్రీని, భావోద్రేక పూరితమైన స్త్రీని భరించగలడు? అంతటా విభేదాలు పొడసూపుతాయి. తెలివి తేటలు లేని, ఎటువంటి భావోద్రేకాలు లేని స్త్రీ ఉన్నచోట మాత్రమే సుఖం, శాంతి కనిపిస్తాయి. అందుకే అంటున్నాను నీ భర్త నౌకరుతో ఎంతో సౌకర్యంగా ఉంటాడు."

దీంతో నేను చాల డిస్టబ్ అయ్యాను. ఇలా జరుగుతుందని ఎప్పుడూ అనుకోలేదు. "కాని ఆమెకు తన భర్త వున్నాడే!" సోనాల్ తన వాదనను ఉపసంహరించుకుందనే ఉద్దేశ్యంతో అన్నాను.

"ఆమె భర్త సహకారం కూడా ఉందేమో! పాపం తన యజమానిని తృప్తిపరచాలన్న అతని ఆకాంక్ష ఆమెను ముందుకు తోస్తున్నదేమో!"

"సోనాల్!" దాదాపు అరిచాను.

"రాజేందర్ దుర్బుద్ధిని నీవింకా అంగీకరించడం లేదు" సోనాల్ నన్ను దెప్పిపొడిచింది. లేకపోతే, ప్యూన్ భార్య ఇంటిని ఎలా చూసుకుంటుంది?" నేనన్నాను "నీకు అసూయ కలిగిందా?" సోనాల్ నవ్వింది.

"కావచ్చు" అన్నాను.

"నిన్ను నీవు ఆ ప్యూన్ భార్యతో పోల్చుకుంటున్నావని ఇప్పటికైనా నీకు తెలిసిందా? ఒక స్త్రీకి తనదైన ఇమేజ్ అంటూ ఏదీ లేనప్పుడు సాటి స్త్రీలను ఎవర్ని చూసినా భయపడుతుంది. నిజానికి ప్రతి స్త్రీ తన భర్త ఇచ్చే ఇమేజిని స్వీకరిస్తుంది. భర్త ద్వారానే ఫలానా స్త్రీ అని గుర్తింపు పొందుతుంది." సోనాల్ చెప్పింది.

"సోనాల్ నువ్వు వట్టి కుళ్ళు మాటలు మాట్లాడతావు" కోపంగా అన్నాను.

"కాదు. నావి కుళ్ళు మాటలు అసలే కావు. ఈ నిజాన్ని అంగీకరించే ధైర్యం నీకు లేదు" అంది. బహుశా సోనాల్ వాస్తవం చెప్పిందేమో! ప్యూన్ భార్య అంటే అసూయ కలుగుతోంది.

నేను ఇంటికి వెళ్ళి దాన్ని ఇంటినుంచి బయటికి గెంటి వేసినట్లు ఊహ కలిగింది. అనుకున్నట్లే ఎలా వెళ్ళానో ఒక పూట ఆఫీసుకు సెలవు పెట్టి మా ఇంటికి వెళ్ళాను.

తలుపు కొట్టాను

ఫ్యాన్ భార్య కావచ్చు. తలుపు తీసింది.

"సార్ ఏరి!" నాకు తెలుసు, అయినా అడిగాను.

"ఆయన ఆఫీసుకువెళ్ళారు" ఆమె సమాధానం.

"మీరెవరు?" ఆమె అడిగింది..... అడగాలా వద్దా అనుకుంటూనే.

"నేను సార్ బంధువుని." నేను చెప్పగానే ఆమె పక్కకు తొలగి లోపలికి వెళ్ళడానికి దారి ఇచ్చింది.

నేను లోపలికి వెళ్ళి డ్రాయింగ్ రూంలో కూర్చున్నాను.

"కొంచెం టీ తెమ్మంటారా? సారు సాయంత్రం వస్తారు."

"సరే తీసుకురా?" నేను చెప్పాను.

ఆమె టీ చేసేందుకు లోపలికి వెళ్ళింది. ఇల్లంతటినీ ఒకసారి చూశాను. అంతా అలాగే వుంది. కొన్ని వస్తువులు మాత్రం అటూ ఇటూ వేసి వున్నాయి.

ఆమె టీ తీసుకురావడానికి ముందే నేను ఇతర గదుల్లోకి కూడా వెళ్ళాను. అవి బోసి పోయి వున్నాయి. "మీరు చాలా దూరం నుంచి వచ్చారా?" టీ ఇస్తూ అడిగింది.

"అవును" నేను చెప్పాను

"ఏమైనా పని వుందా?

"అవును"

"అయితే ఆయనకోసం ఆఫీసుకు వెళ్ళడం మంచిది."

"వారి భార్య లేరా?" తెలియనట్లే అడిగాను.

"ఆమె ఆయనను వదిలివెళ్ళిపోయింది. మరెక్కడో వుంటోంది. ఇది మేమిక్కడికి రాక ముందే జరిగింది. సారు చాలా మంచివారు. ఎప్పుడూ ఆమె గురించి వ్యతిరేకంగా మాట్లాడరు. ఆమె తనంతట తాను వెళ్ళిపోయిందట. నిజం ఆ దేవునికి మాత్రమే తెలుసు. ఎవరికీ చెప్పకండి. కాని ఆమె గుణం మంచిది కాదని అంటారు," ఆమె వెంటనే సర్దుకుని, "ఆమెను తిరిగి తీసుకు రమ్మని ఆయనకు చాలా సార్లు చెప్పాను. ఆయన వినిపించుకోలేదు. ఆమె తనంతట తానే రావచ్చు. నేనిలా చెప్పానని దయచేసి సార్‌తో చెప్పకండీ."

"ఈ బట్టల్ని మీకు ఆమెనే ఇచ్చిందా?"

ఆమె కట్టుకున్న నా బట్టల్ని చూసి అడిగాను. "నా వద్ద ఉన్న బట్టల్ని

ఉతుక్కోవాలంటే ఇంకో జత బట్టలు నా లేవు. సార్ ఇచ్చారు. నేను వద్దన్నాను. అమ్మగారు వచ్చిచూస్తే, కోప్పడతారన్నాను. ఆమె తిరిగి రాదని చెప్పారు. ఆమె చాలా సంపాదింస్తోందని విన్నాను."

ఆమె ఇంకా చెప్తోంది. "మీరు ఆమెను చూసి వుంటారుగా? ఎలా వుంటారు?"

"చాలా అందంగా వుంటుంది.."

"కొరగాని ఆ అందం వుండి ఏం ప్రయోజనం" తల అడ్డంగా తిప్పుతూ, అంది.

"మీ సారు నీ పట్ల సంతృప్తిగా వున్నారా?" నా ప్రశ్నకు ఆమె భయపడింది.

"నేనెక్కువగా మాట్లాడను. వంట చేసి ఆయనకు వడ్డిస్తానంతే. నేనెక్కువ మాట్లాడితే నా భర్త చంపేస్తాడు."

టీ తాగడం పూర్తిగానే నేను లేచాను..

నీరసంగా అనిపిస్తోంది.

"సరే! నేనిక వెళతాను" చెప్పాను.

"ఆయనకు ఏం చెప్పమంటారు?" ఆమె అడిగింది.

"నేను ఆఫీసులో కలుస్తాన్లే."

"కాని దయవుంచి నేను మీకు చెప్పిన విషయాలేవీ ఆయనకు చెప్పవద్దు" ఆమె ప్రాధేయపడింది. అక్కడ్నుంచి తిరిగి వచ్చేశాను. సోనాల్ నిజమే చెప్పింది. రాజేందర్‌కి నా అవసరం ఇక ఎంత మాత్రం లేదు. అనుకున్నాను.

నేను పనికిరాని దాన్నయ్యాననిపిస్తోంది. ఏదైనా వాహనం నన్ను గుద్దితే బాగుండు ననిపించింది.

మధ్యాహ్నం మూడవుతోంది అంతే. హాస్టల్‌కు వెళ్ళకుండా ఆఫీసుకు వచ్చాను. ప్యూను పక్క గదిని శుభ్రం చేస్తున్నాడు.

"అయితే, మీ సార్ తిరిగొచ్చేస్తున్నారన్నమాట!" అతడ్ని అడిగాను ఉత్సాహంగా.

"అవును. ఆయన రేపు వచ్చేస్తున్నారు."

"ఆయన బావున్నారా?"

"బావున్నారు" చెప్పాడతను. గట్టిగా అరవాలనిపించింది. తాను లేని

సమయంలో నాకు జరిగిందంతా అమ్రిక్‌కు చెప్పాలనిపిస్తోంది.

## VIII

మా అత్తామామలు వచ్చివెళ్ళారని కొన్నాళ్ళ తర్వాత తెలిసింది. రాజేందర్‌ను కలిసి ఇరువురూ రాజీకి రావాలని వత్తిడి చేశారని కూడా తెలిసింది. కాని ఆయన ఒప్పుకోలేదట. వెళ్ళేముందు వాళ్ళు నన్ను కలవలేదు.

వాళ్ళు కొడుకును కోప్పడి వెళ్ళారు. కాబట్టి ఇక నాకు కూడా వారితో సంబంధం తెగిపోయినట్లే.

వాళ్ళకు మొదటి నుంచీ మా పెళ్ళి ఇష్టం లేదు. కావలసిన కుటుంబం నుంచి తమకు నచ్చిన పిల్లను తెచ్చి రాజేందర్‌కు చెయ్యాలనుకున్నారు. ప్రేమ వివాహాలపైన వారికి నమ్మకం లేదు.

"నీకు ముందే చెప్పాం" అని ఇప్పుడు అని వుంటారు.

జరిగిందానికి వాళ్ళు నన్నే బాధ్యురాలిని చేసివుంటారు. కొడుకుల తప్పేమీ ఉండదు. ఎప్పుడూ కోడళ్ళదే తప్పు. వాళ్ళు నన్నేమీ అడగలేదు. కనీసం నన్ను కలవడానికైనా రాలేదు.

అద్దం పగిలిన చందంగా ఈ బంధాలు కూడా తెగిపోవడం చాలా సులభం కదూ! కొన్నిసార్లనుకుంటాను. "రాజేందర్ వచ్చి జరిగినవన్నీ మరచి పోయి కొత్త జీవితం ప్రారంభిద్దాం" అంటాడేమోనని.

కాని అతనికి నేనిక అవసరం లేదని సోనాల్ చెప్పింది. అది నిజమా?

నా జీవితమంతా ఇలాగే గడుపుతానా?

నేను శీలంలేని దాన్నని అనుకుంటున్నాడేమో అతను. ఆతని భార్యనై వుండీ వేరొక మగాడి గురించి ఆలోచిస్తున్నాననీ, నేను ఆయనకు వెన్నుపోటు పొడిచాననీ అనుకుంటున్నాడేమో! కాని అది పూర్తిగా తప్పు. నేనేతప్పు చెయ్యలేదు.

మేం పరస్పరం కలసి జీవించలేకపోయామని అందరూ అనుకుంటారేమో! కాని ఇది నిజం కాదు.

నేను అతని అవసరాలన్నీ తీర్చాను. ఆతని సాటి ఉద్యోగినులపట్లా

ఎన్నడూ తప్పుగా మాట్లాడలేదు.

ఎప్పుడైనా తను, ఆయన స్నేహితుడు, స్నేహితుని భార్య కలిసి సినిమాకు వెళ్ళినా నన్ను కూడా ఎందుకు వెంట తీసుకెళ్ళలేదని ఎన్నడూ అడగలేదు.

ఇతర స్త్రీల్లా నగలూ, బట్టలు అడగలేదు. అవేకాదు నేనేమీ అడగలేదు. నిజానికి నా జీతంతోనే ఇంటిని నడుపుతున్నాను. అందువల్లనే ఆయన ఆదాయం నుంచి ఒక ప్లాటు కొనగలిగాం.

ఆఫీసు వెళ్ళేవరకే ఇంటి పనులన్నీ పూర్తి చేసే దాన్ని, తిరిగి వచ్చాక కూడా ఇంటి పనులు చేసేదాన్ని. స్త్రీలు గృహిణులుగానే వున్న ఇళ్ళలో కూడా గిన్నెలు తోమడానికి, ఇతర పనులు చెయ్యడానికి పని మనుషులున్నారు.

ఆదివారాల్లో ఇంట్లో బూజంతా దులిపి శుభ్రంగా ఊడ్చి, బట్టలుతికి, ఇస్త్రీ చేసి స్పెషల్ వంటకాలు కూడా చేసేదాన్ని.

ఆయన ఇవన్నీ మరచిపోయారు. అదంతా నా డ్యూటీయేకదా! అని ఆయన ఉద్దేశ్యం. అందుకే నేనడుగుతున్నా, ఇదంతా చేసిన నాకు ఇచ్చిందేమిటి?

నా గురించి పట్టించుకునేవారెవరు?

నా గురించి ఆయన ఏ కాస్త ఆలోచించివున్నా ఈ చిన్న విషయాన్ని ఆయన కిష్టం లేకపోయినా వదిలేసేవారు. క్షమించే పనులన్నీ మహిళల వంతు!

తన స్వంత విషయాలను ఎంత ఈజీగా చెప్పేవారు? బస్సులో తన పక్కన కూర్చుని ప్రయాణం చేస్తున్న స్త్రీని కప్పుకున్న శాలువా లోంచి ఆయన చెయ్యి పట్టుకున్న వైనాన్ని కూడా ఆమె ఎంత తేలిగ్గా చెప్పారు.

పక్కన కూర్చున్న మీ ప్రోద్బలం లేకుండా ఆ అమ్మాయి అలా ఎలా చేస్తుందని ఆయన్ని ఎవరైనా అడగాలి.

కాని నేను మాత్రం తేలిగ్గా నవ్వేశాను.

మగాడు మరో స్త్రీతో ప్రేమలో పడితే దానర్థం తన భార్యంటే ఇష్టంలేక కాదని ఒకనాడు చెప్పాడు. ఒక స్త్రీని మించి మరి కొందర్ని ప్రేమించేంతగా ఆయన కామాతురత పెరిగిందేమో! తెలివితక్కువ స్త్రీలు అసూయతో తమ భర్తల్ని దూరం చేసుకుంటారు.

అంటే? స్త్రీ మాత్రం తన భర్త ప్రేమ వ్యవహారాల్ని సహించాలి. వారి ఆ భర్త సంగతి?

ఇందులో నిజమెంత అని కూడా నన్ను ఆయన అడగలేదు.

ఒక్క ఉత్తరం ముక్క పెద్ద రుజువుగా దొరికింది. మిగతాదంతా ఆయన ఊహించుకున్నారు. ఇది స్త్రీని చెడుగా ఊహించుకొని అవమానపరచడమేకదా!

స్త్రీ తనను అవమానపరచడానికి తానే అతనికి అధికార మిస్తుందన్న సోనాల్ మాట నిజమనిపిస్తుంది.

అతనికి నీవు అవసరం లేనప్పుడు నీకూ అతనవసరం లేదని సోనాల్ అంటుంది. నాకు తీవ్రమైన తలపోటు వస్తోంది. ఈ వేదనలన్నీ నన్ను తీవ్రంగా బాధపెడుతున్నాయి. ఓ భగవంతుడా! నేనేం చేయాలి? అతడ్ని కలవాలని అనిపిస్తోంది. నాకు ఎక్కడున్నా నిశ్చింతగా లేదు. బహుశా వీటన్నిటినీ ఆ రోజుల్లో లాగా ఆలోచించలేకపోతున్నాను. నేను మానసికంగా పూర్తిగా బలహీనురాలినై వుంటాను. రాజేందర్‌ను కలిసి నా మనో వేదనను ఆయనకు వివరించాలని, నీవు తప్ప నాకు మరెవ్వరూ లేరని చెప్పాలనుంది.

నేను నిజంగా పిరికిదాన్ని. ఇప్పుడు అమ్రిక్‌ను గురించి ఆలోచించడానికి కూడా ధైర్యం చేయలేకపోతున్నాను.

అతనితో ఫలానా అని చెప్పలేని సంబంధం వుందనేది నిజమా? అతడ్ని ఇష్టపడుతున్నాననేది నిజమా?

అతని అనారోగ్యం నన్ను బాగా కదిలించడం నిజమా? నేను అతను కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాను. మీరు ఆఫీసుకు రాలేకపోవడ మనేది నాకు బాధాకరంగా వుంటోందని కూడా చెప్పానే! కానీఇప్పుడు అవన్నీ విడనాడా లనుకుంటున్నాను. రాజేందర్‌కు ఇదంతా ఇష్టముండదు కాబట్టే?

ఇకపై ఆయన ఇష్టాలు నా ఇష్టాలుగా, ఆయన అయిష్టాలు నా అయిష్టాలుగా కృత్రిమ జీవితాన్ని గడిపేందుకు సిద్ధమవుతున్నానా?

ఇలా కృత్రిమ జీవితాన్ని గడపడం ద్వారా నిజాన్ని అబద్ధాన్ని వేరు చేసి చూసే దృష్టినాలో లేకుండా పోతుందా?

నిజానికి ప్రతి విషయాన్ని ఎంతో నిజాయితీగా ఆయనకు చెప్పాలనుంది. ఆయన కూడా నాతో అలాగే వుండాలని, జరిగిందాన్నంతా నా వైపు నుంచి చూసే ప్రయత్నం చెయ్యాలని, నన్ను బాధ్యురాలిని చెయ్యవద్దని, కోపగించవద్దని. కోరుకుంటున్నాను.

లేని పక్షంలో రాజేందర్‌కంటే అమ్రిక్ మెరుగని నేను భావిస్తానేమో! నిజానికి రాజేందర్ కన్నా మరొకరు మెరుగు అని భావించం నాకిష్టం లేదు.

ఇది నిజం. నూటికి నూరుపాళ్ళు నిజం.

రాజేందర్ లోటు నాకు ఎంతగానో కనిపిస్తోంది. కాని ఊహల్లో ఆయనతో మాట్లాడుతూనే వున్నాను.

ఆయన రాడని నాకు తెలుసు. అయినా ఎదురు చూస్తూనే వుంటాను. నాతో ఏ సంబంధమూ లేదని ఆయన చేతల్లో చూపదలచారు.

శాశ్వతమైన అనుబంధాలు ఇంత అల్పమైన విషయాలకు తెగిపోయేంత సున్నితంగా వుంటాయా! అతనికి నా అవసరం లేదని సోనాల్ చెప్పింది.

ఆమె చెప్పినమాటే నిజమా?

# IX

అమ్రిక్ తిరిగి వచ్చారు.

ఇవాళ చాలామంది ఆయన్ని చూడడానికి వచ్చారు.

“మేడమ్ వచ్చారా?” ఒకసారి ఆయన మా ప్యూన్‌ను అడిగారు. సరిగ్గా అప్పుడే ఎవరో ఆయనను కలవడానికి వచ్చారు. నేనూ ఆయనను కలవడానికి వెళ్ళలేకపోయాను. ఒక విధమైన జంకు నన్ను వెళ్ళకుండా ఆపింది. ఆయనతో నా అనుబంధం గతంలో లాగా ఎంతోకాలం ఉండబోదు. అమ్రిక్ నా గదికి రావడం, సరిగ్గా అదే సమయానికి రాజేందర్ ఎక్కడ్నించో ఊడిపడడం.... ఒకవేళ ఇలా జరిగితే!.... ఈ ఊహే నన్ను భయానికి గురిచేస్తుంది.

బహుశా ఈ భయంవల్లే ఈరోజు ఆఫీసునుంచి త్వరగా వచ్చేశాను. అకస్మాత్తుగా నాకు మరో ఊహ కలిగింది. ఒకవేళ అమ్రిక్ నన్ను కలవడానికి మా ఇంటికి వెళితే! అలా ఎవరూ మరొకరి దగ్గరికి వెళ్ళకూడదు. వద్దు వద్దు రేపే నా అంతట నేనే వెళ్ళి ఆయనను కలుస్తాను. ఆయన ఆరోగ్యమెలా వుందని అడిగి తెలుసుకోవడానికే.

ఒకవేళ ఆ సమయంలో పరిచయం వున్న వ్యక్తి, నన్ను అక్కడ చూసి ఆ సంగతి రాజేందర్ దగ్గరికి వెళ్ళి చెబితే? నేనెందుకింతగా భయపడుతున్నాను.

అసలు ఆయన గది నా గదిపక్కన ఉండక పోయివుంటే బాగుండేదని ఆలోచిస్తూ వుంటాను.

ఇంతకూ అలా కావాలని నా మనసులో వుందా? నిజానికి నేను పిరికి దాన్ని. అలా కావాలని నాకుందని చెప్పలేను. అమ్రిక్‌కు ఏమీ కాకూడదని కోరుకుంటాను. ఆఫీసులో ఆయన గది నా గది పక్కనే వుండాలి. కారిడార్‌లో అలా అలా ఒకరికొకరం ఎదురు పడాలి.

కాని ఎందుకిలా జరగాలి? ఆయన నాకేమవుతారు?

ఆయన కుటుంబ సభ్యుల గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను.

కుటుంబ సభ్యులతో ఎలా మెలగుతారో?

ఎలాంటి పుస్తకాలు చదువుతారో?

జీవన శైలి ఎలా వుంటుందో?

కొంత మంది ఈ లోకాన్ని మరింత అందంగా మార్చగలిగే వారున్నారు. వద్దు. ఆయనను కలవడం కాదు. ఎక్కడికైనా బదిలీచేయించుకొని ఇక్కడ్నుంచి వెళ్ళిపోవాలి. నేను చాలా డిస్టర్బ్ అయ్యాను. ఇంతలో సోనాల్ లోపలికి వచ్చి నాకోసం ఎవరో వచ్చారని చెప్పింది. దాంతో నా లోచనలకు బ్రేక్‌పడింది. వచ్చిందెవరో నాకు తెలుసు. బహుశా అమ్రికే అయి వుంటారు. వచ్చిన వ్యక్తికి నేనింట్లోలేనని చెప్పు అని సోనాల్‌కు చెబుతామనుకున్నాను. కాని చెప్పలేక పోయాను. వచ్చింది అమ్రిక్ ప్యూన్.

“సార్ మీకిది పంపారు. ఒక ఉత్తరం కూడా” అంటూ ఒక పాకెట్‌ను, ఉత్తరాన్ని ఇచ్చాడు.

“సరే” రెండూ తీసుకున్నాను.

నమస్కారం చేసి ఆ ప్యూన్ వెళ్ళిపోయాడు. నేనూ నా గదికి తిరిగి వచ్చేశాను.

పాకెట్ తెరచి చూశాను. ముదురు ఎరుపురంగు గొడుగు.

ఆ ఉత్తరంలో “తరంగా బుద్బుదాశ్చైవ నైవభిన్నాస్తనో దధేః...” అని వుంది.

ఈ పంక్తులు ఉపనిషత్తుల నుంచి తీసుకున్నవి. అనంతమైన అర్థం నా హృదయాన్ని కదిలించింది. బుద్బుదాలు నీరే, సాగరం నీరే అని భావం.

గొడుగు చాలా బావుంది.

ఎందుకోగాని నాకు ఏడుపొచ్చింది.

అకస్మాత్తుగా తట్టింది. ఇంతకూ నేనిక్కడుంటున్నట్లు అమ్రిక్‌కి ఎలా తెలుసుంటుంది? దేనివల్ల తెలిసి వుంటుంది?

నా భర్త నుంచి వేరయ్యాననా?

నా గురించి ఎవరూ ఏదీ చెప్పకూడదని భావించాను.

సోనాల్‌కు గొడుగు చూపించాను "ఓ చాలా బావుంది. ఆయన మంచి అభిరుచి వున్నవారే!" అంది.

"ఆయనకు నీవంటే ఎంత ఇష్టం!" మామూలుగా అంది.

"నాకు తెలీదు." సరదాగా అన్నాను. చూడు నువ్విలాగే నిర్లక్ష్యంగా వున్నావంటే కొన్నాళ్ళకు అతను కూడా వెనక్కి వెళ్ళి పోతాడు. ఈ రోజుల్లో ప్రియమైన వారికోసం వేచి చూసే ఓపిక మగాళ్ళకు అట్టే ఉండడం లేదు."

"అతను కాదు. నేనే ఆసక్తి చూపుతుంది." హాస్యమాడాను. "నీకు నీవంటేనే ఇంట్రస్ట్ లేదు. ఇంకొకళ్ళ గురించి ఎందుకు మాట్లాడతావు? నువ్వు 15వ శతాబ్దంలో పుట్టాల్సిందానివి. సరే ఓపని చెయ్యి. అతనంటే నీకు ఇంట్రస్ట్ లేకపోతే నాకు పరిచయం చెయ్యి. అతనెలాంటివాడో నేను చూస్తాను. ఈ దొంగ వెధవలు భార్య ముందు మాత్రం ఏమీ ఎరగని వారిలా ఫోజులు కొడతారు. భార్య వెంట లేకపోతే మాత్రం చంద్రుడ్ని నేలకు దించుతామని ప్రగల్భాలు దంచుతారు" సోనాల్ బూతులు తిడుతోంది అమ్రిక్‌కు థాంక్స్ చెప్పాలని మనసులో అనుకున్నాను. మరునాడు నేను అప్పుడే నా గదిలోకి వెళ్లాను. సరిగ్గా అప్పుడే ఆయన నా గదిలోకి వచ్చారు.

"ఎలా వున్నారు!" నేనడిగాను.

"నేను బాగానేన్నాను. కాని మీరే బావున్నట్టు అనిపించడం లేదు. మీరు చాలా వీక్‌గా కనిపిస్తున్నారు."

నన్ను పరిశీలనగా చూస్తూ అన్నారు.

"లేదు... లేదు.... నేను బావున్నాను అన్నట్లు మీరు పంపిన గొడుగు చాలా అందంగా వుంది. ఇదివరకు నా దగ్గర గొడుగు లేదు. సరిగ్గా అవసరానికి ఇచ్చారు." నేను చెప్పాను. ఆయన చిరునవ్వు నవ్వారు.

"మొత్తానికి అద్భుతమైన అమెరికా మందులు మీ జబ్బును నయం చేశాయి" సంభాషణ కొనసాగించే ప్రయత్నం చేశాను.

"మందులతో పాటు మీ ప్రార్థనలు కూడా జబ్బు నయం కావడానికి దోహదం చేశాయి" ఆయన అన్నారు.

"టీ తీసుకుంటారా?" జంకుతూ అడిగాను. వ్యక్తిగత విషయాలేవీ చర్చించడం నాకిష్టంగా లేదు.

"ఇంటి నుంచి ఆఫీసు బయల్దేరకముందే ఇవాళ ఎలాగైనా మీతో కలిసి టీ తాగాలని నిర్ణయించుకున్నాను."

గంట కొట్టి ప్యూన్‌ను పిలిచాను. టీ తెమ్మన్నాను. "అమెరికా బావుంటుంది కదూ!" కాలక్షేపానికి చిన్న ప్రస్తావన చేశాను.

"కాని నా దేశాన్నే నేనిష్టపడతాను" ఆయన నవ్వుతూ జవాబిచ్చారు.

"ఎందుకు?"

"ఇక్కడ జీవించడం వెనుక ప్రయోజనం వుంటుంది. అక్కడ జీవించడం
కే జీవిస్తారు."

"ఎక్కడైనా జీవించడం వెనుక ఏ ప్రయోజనం లేదని నా భావన." నేనిలా అనేసరికి ఆయన ఇబ్బందిగా చూశారు.

"నేను వెళ్ళిపోయాక మీరు బావున్నట్టులేరు. అంతా క్షేమమేనా?" ఆయన అడిగారు. "నేను మంచిదాన్ని కాదని నా భర్త భావిస్తున్నారు. నాకు విడాకులు ఇవ్వాలనుకుంటున్నారు. మేం వేరుగా ఉంటున్నాం."

నాకు తెలియకుండానే అనుకోకుండా అంతా వాగేశాను.

ఆయన స్థాణువయ్యాడు "ఓ.....నో.. అలా జరగడానికి వీల్లేదు."

"ఏది జరగడానికి వీల్లేదు? నేను చెడ్డదాన్ని అయివుండచ్చు కదా! నా భర్త నాకు విడాకులివ్వకూడదా? మేం వేరువేరుగా జీవించకూడదా?" నాలో నేనే ఆయనతో అన్నట్లు అనుకున్నాను.

ఆ తర్వాత మా సంభాషణ ముగిసింది. ఎవరికీ ఎవరితోనూ చెప్పడానికేమీ లేదు. నేను నేల చూపులు చూస్తూ కాగితంపైన పెన్సిల్‌తో ఏవో గీతలు గీస్తూ గడిపాను.

టీ వచ్చింది. ఆయన కప్పు తీసుకున్నారు.

నేను కూడా తీసుకున్నాను.

నిశ్శబ్దంగా టీ చప్పరిస్తూ మాలో మేమే ఏదో మాట్లాడుకుంటూ ఉండిపోయాం. టీ తాగడం అయ్యాక కప్పును ఆయన బల్లపైన పెట్టారు. నేను కూడా టీ తాగడం పూర్తి చేశాను.

"సరే, నేనిక వెళతాను" ఆయన లేచారు.

"మీ ఆరోగ్యం జాగ్రత్త" అన్నా అనుకోకుండా.

ఆయనేం మాట్లాడలేదు.

ఆయన లేచి వెళుతున్నారు. నేను ఆయన ముఖంలోకి చూశాను. పాలిపోయినట్లుగా వుంది. నేనింకేమీ మాట్లాడలేదు. విచిత్రం జరిగింది. అగ్రిమిక్ అలా వెళుతున్నారు. రాజేందర్ ఇలా లోపలికి వచ్చాడు, ఈ అవకాశం కోసమే కాచుక్కూచున్నట్లుగా. నేను షాక్ తిన్నాను. నేనే ఏదో పెద్ద నేరం చేసినట్లుగా.

"ఇద్దరి యోగ క్షేమాలడగడం అయ్యిందా!" తన కోపాన్ని, అసహ్యాన్ని తనలోనే అణచుకుంటూ అన్నాడు.

"ఆఁ!" అన్నాను కుర్చీలో కూర్చుంటూ. ఆయన మరో కుర్చీని లాక్కుంటూ అన్నారు "నువ్వూ జిత్తులమారి దానివి"

"మీరు హద్దు మీరుతున్నారు. నాకు విడాకులివ్వాలని నిర్ణయించుకున్నాక ఇక వీటన్నిటితో మీకేం పని?" నా కోపాన్ని అణచుకుంటూ అన్నాను.

"ఇదన్న మాట నీ నిజస్వరూపం. ఆఫీసులో ప్రేమ వ్యవహారాలు, కలసి మెలసి టీ తాగడాలూ" అన్నాడు.

"దేవుడికే తెలుసు...." నా మాట

"నోర్మూయ్" అని గర్జిస్తూ లేచాడు. విసురుగా తలుపు తోసుకుని విస విసా వెళ్ళిపోయాడు. నేను తలుపు మూసుకున్నాను. గంటకొట్టి ప్యూన్‌ను పిలిచి బల్లను శుభ్రం చెయ్యమన్నాను. ఖాళీ కప్పులు తీసివేసి గ్లాసుతో మంచి నీళ్ళు తెమ్మన్నాను.

ఊపిరాడ్డం లేదు. బ్యాగ్‌లోంచి ఒక నిద్ర మాత్ర తీసి వేసుకున్నాను. తర్వాత అనిపించింది. దేవుడికే తెలుసు అని ఎందుకన్నానా? అని. నేనెందుకు అంతగా భయపడాలి? ఊపిరి తీసుకోవడానికి కూడా ఆయన అనుమతి తీసుకోవాలా? నేనేమన్న ఆయన బానిసనా?

దేవుడిపై ప్రమాణం చేస్తున్నానెందుకు? నా దగ్గర నేనే దాస్తున్నట్లుందేమిటి? అమ్రిక్ పైన నాలో అనురాగం నిజం కాదూ?

మీ కారణంగానే నేనీ బాధలన్నీ అనుభవించాల్సివస్తోందని ఆయనకు చెప్పనా? కాని వద్దు.

కొన్ని సార్లు అమ్రిక్ భుజమ్మీద తలవాల్చి గట్టిగా ఏడవాలనిపిస్తుంది. కాని వద్దు. అతను ఎంతయినా పరాయివాడు.

ఇన్నేళ్ళలో రాజేందర్ నన్నర్థం చేసుకుంది ఇంతేనా?

....బహుశా నన్ను సరిగానే అర్థం చేసుకున్నాడేమో. నన్ను నేనే సరిగా అర్థం చేసుకోలేక పోయానేమో!

## X

అమ్రిక్‌ను తప్పించుకు తిరగడం ప్రారంభించాను. నా భావాలను అంచనా వేస్తాడేమో, నా గురించిన విషయాలన్నీ ఆయనకు తెలుస్తాయేమోనని నాకు భయంగా వుంది.

భర్త వదిలేసిన స్త్రీని, అటువంటి పరిస్థితిలోవున్న స్త్రీని సమాజం అనుమానపు దృక్కులతో చూస్తుంది. ఈ రకమైన చూపులను భరించాలంటే నాకు భయంగా వుంది.

ఆఫీసుకు వెళితే ప్రతివారూ నా గురించే మాట్లాడుకుంటున్నట్లే అనిపిస్తుంది. హాస్టల్‌లో వుంటే అక్కడుంటున్న ప్రతి స్త్రీకీ రాజేందర్ నాకు విడాకులిస్తున్నాడనీ తెలిసినట్లనిపిస్తోంది.

ఎప్పుడు ఏ ఉత్తరం అందినా దీనికి సంబంధించిందేనేమో అనిపిస్తుంది. కాలం వెనక్కి వెళితే బావుండుననిపిస్తోంది. దీనివల్ల ఇప్పటి వరకు జరిగివన్నీ వెనక్కి వెళ్ళి ఏవీ జరగని కాలం వస్తుంది.

తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోలేని పరిస్థితి వస్తే స్త్రీ ఎంత నిస్సహాయురాలుగా మిగులుతుందో కదా! కాని నేను నిస్సహాయురాల్ని కాను. భౌతికంగా కాకపోయినా మానసికంగానైనా నేను అమ్రిక్‌కు సన్నిహితురాలినై పోయాను.

తర్వాత ఏమవుతుందోనని భయంగా వుంది.

అనంతర కాలంలో శాపగ్రస్తురాలిగా జీవించవలసివస్తుందా? రాజేందర్ ఎందుకు అర్థం చేసుకొనే ప్రయత్నం చేయలేక పోతున్నాడు?

హాస్టల్ గదిలో మంచంమీద వాలిపోయి నీరసంగా పైకపు కేసి చూస్తూ దీర్ఘాలోచనలో మునిగిపోయాను.

ఫ్యాన్‌వచ్చి ఎవరో నాకోసం వచ్చారని చెప్పాడు.

అతను అమ్రిక్ అయివుంటాడు.

నేను లేనని చెప్పమందామా అని ఒకసారి అనిపించింది.

గెస్ట్‌రూంకు వెళ్లేసరికి అక్కడ రాజేందర్ ఉన్నాడు.

ఆశ్చర్యంగా వుందే.

బహుశా నా మనసులోతుల్లో నేనెప్పుడూ ఆయన కోసం ఎదురు చూస్తుంటాను. అతను నన్ను గుచ్చి గుచ్చి చూస్తూ "నీ ప్రియుడు ఇక్కడ్నించి నన్ను బదిలీ చేయించాడు. ఇకపై తనకే ఇబ్బందీ ఉండదు" అన్నాడు.

"లేదు. అది అసాధ్యం." నాకు అయోమయంగా వుంది.

"ఎందుకు అసాధ్యం? చౌదరి నాకీ విషయం స్వయంగా చెప్పారు."

"చౌదరి పొరబడి వుంటారు."

"అవును. పొరబడ్డాను. మొదట పొరబడ్డది నీ విషయంలో. తర్వాత అందరూ పొరబడ్డారు. ఇప్పుడు....ఇప్పుడు అమ్రిక్ విషయంలో చౌదరి పొరబడ్డారు. ఆ బాస్టర్డ్‌కి ఎంత ధైర్యం? తన గురించి ఏమనుకుంటున్నాడు? వాడ్ని నలిపేస్తాను" చాలా దురుసుగా అన్నాడు.

"ఆయన్ని నేను అడుగుతాను" నా కిప్పటికీ అయోమయంగానే వుంది.

"ఏమిటి వాడ్ని నువ్వు అడిగేది? నేను... నేనే అడుగుతాను" కోపంగా అన్నాడు.

"అడగండి అలాగే అడగండి. అడిగి నిజం బయటికీ రానీయండి. అందరికీ తెలియనివ్వండి" నేనూ తీవ్రంగానే అన్నాను.

"అవును అందరికీ తెలియాలి. అయినా ఇప్పటి వరకూ ఈ విషయాలు తెలియనిది ఎవరికి? మన పెళ్ళప్పుడే అమ్మ చెప్పింది. అమ్మాయి మంచి కుటుంబం నుంచి రావాలి అని. అమె అన్నమాటలకు అర్థమేమిటో నాకప్పుడు తెలియలేదు. కాని ఇప్పుడు తెలిసింది. మంచి కుటుంబాలంటే ఎలాంటివో. నువ్వు ఏరకమైన దానివో?"

"నా కుటుంబం చేసిన తప్పేమిటి?" నేను కోపంగా అడిగాను.

ఆడపిల్ల సంపాదనకు మరిగిన తల్లిదండ్రులు ముప్పయ్యేళ్ళొచ్చే వరకు పెళ్ళి చెయ్యరు. ఆమె తనంతట తానే మొగుడ్ని వెతుక్కుంటే ఈ మనిషి మాకు నచ్చలేదని, అతనితో పెళ్ళికి ఎట్టిపరిస్థితిలోనూ ఒప్పుకోమని అంటారు. ఎందుకంటే డబ్బు ఖర్చుచేసి పెళ్ళి చేయాల్సి వస్తుందని. నిజానికి ఆమె ఏ రిజిస్టర్ మారేజో చేసుకొని వెళ్ళిపోవాలని వారి ఉద్దేశం. ఇదీ మీ కుటుంబం."

"నీవు తప్ప నాకింకేమీ అక్కర్లేదని అనేవాడివి కదా! అప్పుడు ఇవన్నీ ఆలోచించు కోవాల్సింది" వ్యంగ్యంగా తిప్పికొట్టాను.

"నా మంచితనానికి ప్రతిఫలంగా నాకేమిచ్చావ్? బయట లోకం నన్ను చూసి నవ్వుతున్నారు."

"నువ్వు రాత్రంతా ఇంటికి దూరంగా వున్ననాళ్ళు అదే లోకం నన్నుచూసి నవ్వలేదా?"

"నా తోనే పోటీపడతావా యూ ఇడియట్!"

"మాటలు జాగ్రత్తగా రానీ" కోపంగా హెచ్చరించాను.

"నోర్ముయ్! ముందు నువ్వో దొంగవి అయి వుండి చట్టాన్ని రక్షించేదాన్లా ఫోజులు కొడతావా!"...ఇక అతని ముందు నిలవలేక నీరసంగా కుర్చీ లోంచి లేచాను. నా గదికి తిరిగి వచ్చి బాగా ఏడ్చాను.

సోనాల్ రాత్రికి తిరిగి వచ్చాక వాచిపోయిన నా కళ్ళను చూసి విసుగ్గా "నిన్ను ఏడిపించేలా ప్రవర్తించిన మనిషికోసం నీ కన్నీళ్ళు ధారవోయకు. నిన్ను తన జీవితంలోనుంచి గెంటేసిన వాడిని నువ్వు నీ మనసులోంచి ఎందుకు తోసివెయ్య లేవు?" సోనాల్ ఆవేశంగా చెప్తూంటే నేను మౌనంగా వింటున్నాను.

"నీ మనసును ఇంతగా కష్టపెట్టే హక్కు అతనికి ఎందుకిచ్చావ్?" ఈ ప్రశ్నకు నా దగ్గర సమాధానమేలేదు.

"నీకు సరిపడా నీవే సంపాదించుకుంటున్నప్పుడు ఈ బానిసత్వమెందుకు? భద్రత కోసమా? రక్షణ కోసమా? ఆ మనిషి ఎప్పుడు పడితే అప్పుడు నిన్ను ఇంటి నుంచి గెంటి వేయగలడు. ఇదేం భద్రత? ఇదేం రక్షణ? ఎప్పుడు తిక్క ముదిరితే అప్పుడు తిడతాడు. తంతాడు. అప్పటికీ అతను కావాలనుకుంటే అన్ని మరచి పోవాలా? జరిగినవన్నీ మరచిపోయి లేదా మరచిపోయినట్లు

నటిస్తూ ఆత్మ వంచన చేసుకుంటూ జీవితాన్ని గడపాలా?" సోనాల్ మాటలు ప్రవాహంలా వున్నాయి.

"ఒక్కమాట అడగనా సోనాల్?"

"నాకో భర్త, ఇల్లు, పిల్లలు, అవసరం లేదా..... ఇదే కదా నువ్వు అడగ దలచుకుంది? తాను మాత్రం దేవుడుగా వుండాలి. నన్నుమాత్రం సేవకురాలిగా చూసే భర్త నాకవసరంలేదు. కారాగారం లాంటి ఆ ఇల్లు, బాధ్యత తల్లిది. యాజమాన్యపు హక్కు మాత్రం తండ్రిది అనే పిల్లలు నాకవసరం లేదు."

"అంటే. స్త్రీకి లభించే వాటికి ప్రతిగా ఆమె ఏమీ చెయ్యకూడదంటావా?"

"భారతీయ సంప్రదాయాలు అలా వున్నాయి. మన ఇల్లు, భర్త, పిల్లలు, మనం సాధించిన విజయాలని మనం అనుకుంటున్నాం. మరి స్త్రీని పురుషుడు తన విజయమని పరిగణించడు ఎందుకని?"

సోనాల్ వేసే ప్రశ్నలకు మామూలుగా అయితే నేను నోటమాట రాకుండా ఉండిపోతాను. సంప్రదాయం పునాదుల నుంచి రాని స్త్రీ ఏ సమాధానమైనా చెప్పవచ్చు. నా వద్ద కూడా ఈ ప్రశ్నకు సమాధానం లేదు. అయినా నేను ఏమన్నానంటే: "సోనాల్! ఈనాటి స్త్రీ తను పయనించవలసిన దిశను తప్పింది. ఏం చెయ్యాలో ఆమెకు తెలియకుండా వుంది?"

"హర్‌జిత్! స్త్రీ తనంతట తాను ఎప్పుడూ తన దిశ ఏదనేది తెలుసుకొనే ప్రయత్నం చెయ్యలేదు. ఆమెకంత ధైర్యం కూడా లేదు. ఈ శక్తిని, ఈ ధైర్యాన్ని తనలో పాదుకొల్పుకొనే తెలివితేటల్ని కూడా ఆమె ప్రదర్శించలేదు" సోనాల్ చెప్పింది.

"కాని సోనాల్ నువ్వు చెప్పే ఈ ధైర్యం అనే మాట తప్పుదోవ పట్టించే భావన. ఎటువంటి బంధాలకు తావులేని జీవితాన్ని స్త్రీ గడపాలన్న ఆలోచన ప్రాథమికంగా పురుషుని అవసరమే కాని స్త్రీ ది కాదు. ఏ హద్దులూ లేని స్త్రీ పురుషుని ఆపలేదు. అతనికి కావలసిందే ఇదే. తనంతట తాను జీవిస్తున్నానని స్త్రీ అనుకుంటుంది. కాని వాస్తవంలో ఈ మాత్రం అవకాశం కూడా ఆమెకు దక్కదు."

కొన్ని క్షణాలపాటు సోనాల్ వెనక్కి నా వాదం విని ఆశ్చర్య పోయింది. ఇలా చెప్పింది: "స్వేచ్ఛగా ఆలోచించే స్త్రీకి జీవితం విషాదభరితంగా వుంటుంది."

"సోనాల్, ఎవరైనా కొన్నేళ్ళు మాత్రమే బతుకుతారు."

"నీ అభిప్రాయం తప్పు కొన్నేళ్ళే అని ఎందుకనుకోవాలి. ఆ కొన్నేళ్ళు కూడా ప్రతి క్షణం ముఖ్యమే."

"అది సరే, సోనాల్ నీవు గడుపుతున్న జీవితం నీకు సంతోషాన్నిస్తోందా?" సూటిగా అడిగాను.

"సంతోషాన్నిస్తుందా లేదా అనేది కాదు. నా జీవితం నా స్వంతం. నా జీవితానికి ఎవరూ కర్తలు లేరు. ఆ విధంగా నేను సంతృప్తిగా వున్నాను." హాస్టల్ పనిమనిషి నుంచి భోజనానికి రమ్మని పిలుపు. ఈ చర్చతో కాలం వేగంగా గడిచింది. సోనాల్ లోపలికి వెళ్ళింది. తను బయటే తినివచ్చింది.

భోంచేస్తూ ఆలోచిస్తున్నాను. రాజేందర్‌ను బదిలీ చేయించింది అమ్రికా? ఇది నిజమా? అయితే ఎందుకు చేయించివుంటాడు? రోజూ రెండు నిద్ర మాత్రలు వేసుకునేదాన్ని ఈ రోజు నాలుగు వేసుకుని గబగబా నీళ్ళు తాగాను.

షెల్ఫ్‌లోంచి మహాభారతం తీసి చదవడం మొదలు పెట్టాను. యావత్ ప్రపంచానికి సంబంధించిన అపారమైన జ్ఞానం ఇందులో నిక్షిప్తమై వుందని చెప్తారు. పుస్తకం చదువుతుండగానే నిద్ర ముంచుకొచ్చేసింది. నాకు తెలియకుండానే నిద్రలోకి జారిపోయాను.

లైటు కూడా తీయలేదు.

ఉదయం ఆలస్యంగా నిద్రలేచాను. ఒళ్ళంతా నొప్పులు. దీని నుంచి బయట పడేందుకు వేడినీళ్ళతో స్నానం చేశాను. స్నానం పూర్తిచేసి అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్నాను. ముఖం పాలిపోయినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కళ్ళ చుట్టూ నల్లటి వలయాలు ఏర్పడ్డాయి.

బ్రేక్‌ఫాస్ట్ పూర్తిచేసి ఆఫీసుకు వెళ్ళడానికి సిద్ధమయ్యాను. మంచి బట్టలు వేసుకున్నాను.

"ఎందుకిలా తయారవుతున్నావ్? ఈ రోజు అమ్రిక్‌ను కలవబోతున్నాననా?" నా అంతరాత్మ అడుగుతోంది.

నిన్నటి చీరలోకి మారాను.

"రాజేందర్‌ను ఎందుకు బదిలీ చేయించారు" అని ఆయన్ను అడుగుతాను. ఆయన్ని కలవడానికి నాకు ఒక నెపం దొరికింది.

వేళకు ముందే ఆఫీసు చేరుకున్నాను. ఇంకా స్వీపర్ తన పనిలో నిమగ్నమై వుంది. కొంతసేపు బయటే వేచివున్నాను. అమ్రిక్ కూడా ముందుగానే వచ్చారు. ఎందుకో తెలీదు. అలా వెళుతూ రెండు చేతులు జోడించి నవ్వుతూ నన్ను పలకరించారు. ఆయన్ను ఇష్టపడుతున్నానని అనుకొని ఆ కారణంతో అమ్రిక్ రాజేందర్‌ను బదిలీ చేయించి వుంటారా? లోలోపల కోపంగా వుంది నాకు.

నా గది శుభ్రం చేస్తుండడం అమ్రిక్ చూశారు. "రండి. కాసేపు నా గదిలో కూర్చుందురుగాని" అన్నాడు.

అయిష్టంగానే ఆయన గదిలోకి వెళ్ళాను.

"ఏమిటి విషయం" నా వేపు చూశాడు.

"నా భర్తను మీరే బదిలీ చేయించారా?" సూటిగా అడిగేశాను.

"అలా అని మీకెవరు చెప్పారు?"

"ఎవరైనా చెప్పనివ్వండి. అది నిజమేనా?"

"అవును" చాలా మామూలుగా చెప్పాడు. ఆయన వైపు దిగ్భ్రాంతిగా చూశాను.

"చూడండి. మీ వ్యక్తిగత జీవితంతో జోక్యం చేసుకోవాలనుకోవడం లేదు. అందుకే మమ్మల్ని ఏమీ అడగలేదు. కాని మీరు వేరుగా ఉండడం అనేది మీ గురించి ఇతరులు ఏమైనా అనుకోడానికి ఆస్కారమిస్తుంది. ఆయన మరో పట్టణంలో వుంటే ఈ విషయాన్ని ప్రశాంతంగా ఆలోచించడానికీ, మీ తోడు లేకపోవడం వల్ల ఏర్పడుతున్న లోటు గ్రహించడానికీ వీలవుతుంది. స్త్రీకే కాదు పురుషునికి కూడా ఇల్లు అవసరం వుంటుందని గట్టిగా చెప్పగలను." అమ్రిక్ గుక్కతిప్పకోకుండా చెప్పాడు.

నేను నిశ్శబ్దంగా వింటున్నాను.

"చూడండి! ఈ ప్రపంచం మనం సృష్టించింది కాదు. ప్రతిదీ మన ఇష్ట ప్రకారం జరగదు. ఎవరో ఒకరు మనకు తల్లి, ఎవరో ఒకరు తండ్రి, అన్న, చెల్లి, భర్త, భార్య అనేవి కేవలం యాదృచ్ఛికం మాత్రమే. ఏ సంబంధానికీ గట్టి పునాదులులేవు. వీళ్ళలో మిమ్మల్ని ఎవరు, ఎక్కడ వదిలి వెళ్తారో మీకు అస్సలు తెలియదు. ఈ మనస్పర్థలకు మనకు సమయమెక్కడుంది?" ఆయన వివరిస్తున్నారు.

"కాని అన్నీ మన చేతుల్లో వుండవు" నాలో విసుగు ధ్వనించింది.

"మీ చేతుల్లో లేనివేవో చెప్పండి. మీరంటే ఎంతో గౌరవం వుంది. మీరు సరేనంటే నేను రాజేందర్‌తో మాట్లాడతాను."

"లేదు.. లేదు.. ఆ అవసరం లేదు." అని చెప్పి ఉద్రేకంగా ఆ గది వదిలి వచ్చేశాను. బహుశా నన్ను తన చేతుల్లోకి తీసుకొనేలా అమ్రిక్‌కు నేనే ఆస్కారం కలిగించానేమో! ఒక్క క్షణం ఆయన అస్తిత్వం ఒక మెట్టు పెరిగింది. నేను కుంచించుకు పోయాను. రాజేందర్‌పై కోపం వచ్చింది. నన్ను అతను అమ్రిక్ బారిన పడేశాడు.

అమ్రిక్ ఎవరు? రాజేందర్ ఎవరు?

నాలో గుర్తులు చెరిగిపోతున్నాయి. సంతకాలు చెయ్యవలసిన కాగితాలన్నీ నా ముందు పడివున్నాయి. ఎప్పటిలాగే 11 గంటలకు ప్యూను నా కోసం టీ తెచ్చాడు. అదిప్పుడు చల్లారిపోయింది. టెలిఫోన్ మోగింది.

"హలో!" నా గొంతు పీలగా పలికింది.

"నేను సోనాల్‌ని డియర్! నిద్రపోతున్నావా? ఏమైంది గొంతుకు. సముద్రాన్ని దాటి వచ్చినట్లున్నావు. వింటున్నావా! యునెస్కో ఆఫీస్ నుంచి నాకు కాల్ వచ్చింది. కొత్త పుస్తకాలు వచ్చాయట. నువ్వు లంచ్ టైంలో అక్కడికి చేరుకోగలవా? నేను కూడా వచ్చేస్తాను. జనం వచ్చేలోగా కొన్ని మంచి పుస్తకాల్ని ఎంపిక చేసుకుందాం."

"సరే! నేను వచ్చేస్తాను"

"మన మిద్దరం క్వాలిటీలో కలిసే లంచ్ చేద్దాం. గంట పర్మిషన్ తీసుకో. నా స్నేహితుడు కూడా మనతో పాటు వుంటాడు."

"ఈ రోజు ఎందుకో లంచ్‌కు బయటికి వెళ్ళడానికి మూడే లేదు సోనాల్."

"నా స్నేహితుడు నిన్నేమీ మింగేయడులే. నువు తప్పకుండా రావాలి. అర్థమైందా?" సోనాల్ ఈ మాట చెప్పి ఫోన్ పెట్టేసింది. నా ఆలోచనలు పుస్తకాలపై మళ్ళాయి. ఒకప్పుడు నేను రోజువారీ పనులు ముగించుకొని మంచమ్మీదకు చేరుకొని పుస్తకం పట్టుకునేదాన్ని. పుస్తకం చదువుతూ ఓ కొత్త ప్రపంచంలోకి వెళ్ళేదాన్ని. వర్షించే మేఘాలు, వికసించి పరిమళించే పుష్పాలు, హాయిగా ఆ పరిమళాలను ఆఘ్రాణించే మనుషులుండే అందమైన ప్రపంచంలో

విహరించే దాన్ని. ఈ మధ్య చాలాకాలంగా ఏదీ చదవలేక పోయాను. పుస్తకాలు మనసును ఉత్తేజ పరుస్తాయి. కాని ఈ లోకం సున్నితమైన మనసును గాయ పరిస్తే ఎక్కడో హృదయపులోతుల్లో కత్తితో పొడిచినట్లుటుంది. పుస్తక ప్రపంచంలో హాయిగా సంచరించిన మనుషులు ఒక్కసారి వాస్తవ ప్రపంచంలోకి రావడమంటే మళ్ళీ జనారణ్యంలోకి వచ్చి పడ్డట్లే.

సాధారణ స్త్రీలను భర్తలు అనుమానించినప్పుడు వారు ఏడ్చి కాళ్ళా వేళ్ళాపడి రాజీకి ప్రయత్నిస్తారు. పెద్ద మనుషుల జోక్యంతో సర్దుకుంటుంది. కాని నేనలా చేయలేదు. కొంత మంది స్త్రీలు నిజంగా అక్రమ సంబంధాలు పెట్టుకొన్నా వారు మాత్రం తాము ఏ తప్పు చేయనట్లుంటారు. నేను తెలివి మాలినదాన్ని. భర్తల కోసం సర్వం త్యాగం చేసిన పూర్వకాలపు స్త్రీనీ కాదు. ఎవరినీ లెక్కచెయ్యక ధైర్యంగా తిరిగే నేటి స్త్రీగానూ ఉండలేక పోయాను.

సోనాల్ ఫ్రెండ్‌తో కలిసి లంచ్‌కి వెళ్ళాలని లేదు. కాని వెళ్ళాలి.

రెస్టారెంట్‌లో కూర్చుని వున్నాం. మంద్రస్థాయిలో పాటేదో వినిపిస్తోంది– "కించపడాల్సిన పనిలేదు. ఎవరికీ తలవంచాల్సిన పని అసల్లేదు."

లంచి తీసుకున్నాం. తర్వాత ఒక పూట సెలవు పెట్టాను కాబట్టి హాస్టల్‌కు తిరిగి వచ్చాను. పుస్తకాల షాపుకు వెళ్ళేపని రేపటికి వాయిదా వేసుకున్నాం.

"కించపడాల్సిన పనిలేదు.... ఎవరికీ తలవంచాల్సిన పని అసల్లేదు." అన్న పాటలోని పంక్తులు నా మనసులో ప్రతిధ్వనిస్తున్నాయి.

కుర్చీలో కూర్చున్నా ఏ పనీ చేయబుద్ధి కావడం లేదు. ఈ ఆలోచనల నుంచి బయపడడానికి నా డాక్టర్‌కు ఫోన్ చేసి అప్పాయింట్‌మెంట్ అడిగాను.

ఇప్పుడు ఖాళీగానే వున్నానని, వెంటనే రమ్మని డాక్టర్ సమాధానం. వెళ్ళాను. ఆమె పరీక్షలు చేశారు. నా అనుమానాన్నే బలపరుస్తూ నేను గర్భవతి ననే విషయం తేల్చింది డాక్టర్.

"నీకెంతమంది పిల్లలున్నారు?" డాక్టర్ అడిగింది. "లేరు. నా భర్త నాకు విడాకులివ్వాలనుకుంటున్నాడు." టకీమని సమాధానమిచ్చాను.

"అయితే నువ్వు ఎట్టి పరిస్థితిలోనూ అబార్షన్ చేయించుకో కూడదు. కొన్నిసార్లు పిల్లలు విడిపోయిన తల్లిదండ్రుల్ని కలుపుతారు. ఒకవేళ నీవు వేరుగా జీవించాలనుకున్నా కూడా తోడు కావాలి." డాక్టర్ విజ్ఞతతో సలహా ఇచ్చింది.

నేను మౌనంగా ఉండడం చూసి "పాత జీవితాన్ని వదిలేసి కొత్త జీవితాన్ని ప్రారంభించాలంటే అది వేరే విషయం. ఏమైనా మీరు చాలా జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి. మగవాళ్ళంతా ఒకటే."

ఆమెకు ఏ సమాధానమూ ఇవ్వకుండానే విటమిన్లు తీసుకోవాలని రాసిన మందుల చీటి తీసుకుని బయటికి నడిచాను.

హాస్టల్‌కు వెళ్ళకుండా నేరుగా ఇంటికి వెళ్ళి రాజేందర్‌కు అన్ని వివరాలూ చెప్పాలని ఒకసారి అనిపించింది. కాని ఆ ప్రయత్నాన్ని విరమించుకుని హాస్టల్‌కు తిరిగివచ్చాను.

విషయం తెలిసిన సోనాల్ ఫోన్‌లో గట్టిగా నవ్వుతోంది. మనుషులు ఇలా నవ్వుతారేమిటి?

నా గదికి వచ్చిన సోనాల్ చాలా సంతోషంగా వుంది. "నా స్నేహితురాలిని వెంట తీసుకొస్తే క్వాలిటీ రెస్టారెంట్‌లో ఇద్దరికీ లంచ్ హోస్ట్ చేస్తానన్నాడు నా బాయ్ ఫ్రెండ్. నీవేమంటావ్?" నవ్వుతూ అడిగింది.

"లంచ్ కోసమే వస్తానని చెప్పమంటావా!" నేనడిగాను.

"ప్రతిరోజూ మనిషికి రెండు పూటలా కడుపునిండా భోజనం కావాలి. అలాంటిది నీకు ఒక పూట మంచి భోజనం ఉచితంగా వస్తుంటే ఇంకా ఏం కావాలి?"

"ఇలా ఎన్నాళ్ళు పెడతారు?"

"నీకు ఎన్నాళ్ళు కావాలంటె అన్నాళ్ళు"

"నిజం చెప్పాలంటే సోనాల్! నాకు ఆకలేసినప్పుడే భోజనం చేస్తాను. లేదంటే అన్నంవైపు దృష్టే వెళ్ళదు. కాబట్టి నా ఉద్దేశంలో అన్నమంటే కేవలం అన్నమే. ఆకలిని చల్లార్చుకోవడానికే అన్నం."

"హర్‌జిత్! ఆహారం నుంచి కళ వరకూ అన్నింట్లోనూ అభిరుచి ఉండాలి."

"సోనాల్ ఆహారం, కళ అవసరమే గాని అవే సర్వస్వం కాదు"

"ఈ పడికట్టు మాటలు జనాన్ని తప్పు దోవ పట్టిస్తాయి. అవసరం, సర్వస్వం అన్నావే. అవి రెండు వేరు వేరు మాటలు కావు. ఒకటి ప్రారంభం, రెండోది ముగింపు. రెండూ ఒక దాని కిందకే వస్తాయి. మన జీవితమే మనకు ముఖ్యం. అంతకంటే ఏదీ ముఖ్యం కాదు."

"ఇది మరొక స్థాయి ఆలోచనలే సోనాల్"

"కొందరు జీవితాన్ని గురించి దీర్ఘంగా ఆలోచించడంలో లీనమవుతారు కానీ అసలు జీవితం దగ్గరికి వచ్చేసరికి విఫలమవుతారు. ఆలోచనలతో కాలయాపన చేసి జీవించడం దగ్గరికి వచ్చి చూసుకొనేలోగా అది ముగిసి పోతుంది. ప్రతి మనిషీ ఏదో రోజున మరణించక తప్పదు అన్న విషయం మరువరాదు.

"సోనాల్ నేను తల్లిని కాబోతున్నాను" టక్కున అనేశాను.

"రబ్బిష్! అబార్షన్ చేయించుకో. ఎవడివల్లనయితే ఈ బిడ్డ నీ కడుపున పడిందో వాడే కాదన్నాక చూస్తూ చూస్తూ నువ్వు ఈ లంపటంలో పడిపోతా వెందుకు?"

"అలా చేయను సోనాల్. అలా చేయలేను" నేను ఆవేదనగా అన్నాను.

"అయితే నీ కర్మ" అంటూ సోనాల్ గదిలోంచి వెళ్ళిపోయింది. ఇవాళ నేను నిద్రమాత్రలు వేసుకోలేదు. అవి వేసుకుంటే కడుపులోని బిడ్డకు హాని చేస్తుందని తెలుసు.

రాత్రంతా నిద్రలేకుండా గడిపాను

ఆలోచిస్తుంటే.... ఇంకా ఈ లోకంలోకి రాని, కళ్ళతో ఇంకా లోకాన్ని చూడని ఆ బిడ్డంటే మనసంతా ప్రేమతో నిండిపోయింది. ప్రేమతో పాటే ఎన్నో భయాలు కూడ కలిగాయి.

తమ పిల్లలకు ప్రేమను అందించలేనప్పుడు వారినీ లోకంలోకి తెచ్చే హక్కు ఆ తల్లిదండ్రులకు లేదు.

"ఆ బిడ్డకు తండ్రి లోటు ఎలా తీర్చగలను?"

"మీరెందుకు విడిపోయారని ఎప్పుడైనా అడిగితే ఏం చెప్పాలి?"

"దీనికి ఎవర్ని తప్పుపట్టాలి. తండ్రినా, నన్నా?"

చిన్న హృదయం ఆ భారాన్ని ఎలామోయగలుగుతుంది?

ఒక వేళ బిడ్డ వద్దనుకుంటే నేనెలా బతకాలి, ఎవరికోసం బతకాలి?

బిడ్డకోసం దేవుడ్ని అనేక విధాలుగా వేడుకున్నాను.

ఎంతో మంది స్త్రీలు తమ భర్తల్ని కోల్పోతున్నారు. వారి భార్యలుగానే, వారి జ్ఞాపకాలతోనే జీవితాన్ని గడుపుతారు. చాలా మంది తిండికోసమైనా

మళ్ళీ పెళ్ళి చేసుకొంటారు.?

కేవలం తిండికోసమేనా?

అలాంటి వారికి ఆహారం మాత్రమే సరిపోదు.

నాలో నేనే మాట్లాడుకుంటున్నాను. ఒక్కసారి మృదువుగా నా కడుపు మీద చేయి వేసుకున్నాను. ఏదో తెలియని తృప్తితో నా మనసు నిండిపోయింది. రాజేందర్‌ను ఓడించేశానన్న తృప్తి. అతని నిధిని నాతో తెచ్చుకున్నానన్న తృప్తి.

"నేను అబార్షన్ చేసుకోను" నాకు నేను చెప్పుకున్నాను.

ఒక్కసారి గడియారం కేసి చూశాను. అర్ధరాత్రి దాటింది.

# XI

అబార్షన్ చేసుకొమ్మని సోనాల్ నాకెలా చెప్పగలిగిందో అనుకుంటున్నాను. నాలో నేను. ఆమెలో స్త్రీకి ఉండవలసిన ప్రేమ, దయ కొడిగట్టుకుపోయాయా!

అబార్షన్ అంటే పువ్వు కన్నా మృదువైన బిడ్డను చేతులారా చంపడమే కదూ! నిన్ను తన తల్లిగా ఎంచుకోవడం తప్ప ఏ పాపమెరుగని ఆ బిడ్డను ఎలా చంపుకుంటావు? పంచ భూతాత్మకమైన ఈ సృష్టిలో ఇంకా కన్ను తెరవని కన్నులారా చూడని శిశివును వధించడమే అవుతుంది కదా! ఈ శిశువు రేపు పుట్టి పెరిగి ఏమవుతుందో ఎవరికెరుక. కవి, కళాకారుడు, శాస్త్రవేత్త.... ఏమైనా కావచ్చు. అన్నిటికీ మించి మంచి మనిషి కావచ్చు. ఏమయ్యేది ఇప్పుడే తెలీదు కదా!

కళ్ళు తెరిచి లోకాన్ని చూడకుండానే కన్నుమూస్తే ఆ బిడ్డను ఏ తల్లి అయినా ఎలా చూడగలుగుతుంది?

ఒక జీవికి జన్మనివ్వడం ఎంత ఉదాత్తమైంది. ఒక మహా సృష్టికి రూపం కల్పించే యజ్ఞంలో భాగస్వామి కావడం ఎంతో గొప్ప అనుభవం. కాని నిన్నవమానించినవాడి బిడ్డను పెంచి పోషించాల్సిన అవసరం లేదంటుంది సోనాల్.

సోనాల్! నువ్వు సున్నితత్వాన్నీ కోల్పోయావు. తల్లి కావడం అంటే ఏమిటో నీవు గ్రహించలేవు. నీ బిడ్డ ప్రపంచంతో నీ అనుబంధాన్ని గట్టి పరుస్తుందని, ఎవరో చెప్పిన మాట సత్యం. అవును. నీకూ, ఈలోకానికీ మధ్య అనుబంధం

పెనవేసుకొనేది నీబిడ్డ ద్వారానే. బిడ్డల వల్లనే నీవు జీవిస్తావు. నీ కొనసాగింపే నీ బిడ్డలు. అలాంటి నిన్ను, నీ కడుపులో వున్న నిన్ను నీవు అంత సులువుగా ఎలా తుడిచి పారెయ్యగలవు? సోనాల్... నేను పోయాక కూడా నాలో కొంత భాగం ఈ బిడ్డ రూపంలో జీవిస్తుంది.

మన ధర్మశాస్త్రాల్లో పేర్కొన్న పితౄణం అంటే మరేమిటో కాదు. మనల్ని కనిపెంచి జీవితాన్ని ప్రసాదించిన తల్లిదండ్రుల ఋణాన్ని తీర్చుకోవడం. వారి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్ళడం ద్వారా ఆ ఋణాన్ని తీర్చుకోవడం. లేకపోతే వారికి శ్రాద్ధ కర్మలను ఆచరించి ఆత్మలకు శాంతిని కలిగించేదెవరు? ఇవన్నీ అర్థం లేనివిగా కనిపించవచ్చు. కడుపులో పెరిగే బిడ్డ ప్రపంచంతో నీ అనుబంధాన్ని మార్చివేయగలదు. నీవెరుగని ఆనోటితో నీచనుబాలు తాగే అనుభవం నీకు లభించడం. అంతకు మించిన అద్భుతం మరేముంటుంది?

ఆడదానికి తల్లి అయ్యాకే తనకెంత సహనం, దయ వున్నాయో, తానెలా భూదేవితో సమానురాలో తెలుస్తుంది.

తాను తండ్రిననే కారణంతో బిడ్డను తల్లి నుంచి లాక్కుపోగలడని, అందువల్లనే స్త్రీ అతను చెప్పినట్లు నడచుకోవాల్సి వస్తోందని పత్రికల్లో చదివి సోనాల్ భయపడినట్లుంది. అవును అదీ నిజమే.

చట్టప్రకారం బిడ్డ తల్లికికాక తండ్రికి చెందుతుందని నిర్ణయించడమే అందుకు కారణమా?

ముమ్మాటికీ అది తప్పు, వంచన, అన్యాయం.

కొన్నిసార్లు బిడ్డ ప్రేమ తండ్రిని తిరిగి తెస్తుందని, అలాకాక భర్త నుంచి విడిపోవలసి వచ్చినా బిడ్డ తల్లికి ఆధారంగా నిలుస్తుందని డాక్టర్ చెప్తోంది. వాడే నీ దగ్గర లేనప్పుడు వాడి వల్ల కలిగిన బిడ్డను కావాలనుకుని ఇబ్బందుల్ని నీవుగా ఎందుకు కొనితెచ్చుకుంటావని సోనాల్ అంటోంది.

ఏమిటిది? బిడ్డ నాతో వుంటే ఏ మగాడూ నన్ను అంగీకరించడని ఇప్పుడు అబార్షన్ చేయించుకోనా! మగవాని అంగీకారం పొందడమే స్త్రీకి ఏకైక జీవిత లక్ష్యమా? నాకు నేనుగా సంపాదించే శక్తి వుండీ, ఒక్క దాన్నే బిడ్డను పెంచి పెద్దచేసే శక్తి వుండీ ఎవరికోసమో ఎందుకు దేబిరించాలి?

నిన్న నాకోకల వచ్చింది. కొంతమంది పిల్లలు చిన్న రెక్కలతో ఆకాశంలో

మేఘాల్లా ఎగురుతూ కనిపించారు. ఆ ఎగిరే చిన్నారుల్లో నా బిడ్డను గుర్తుపట్టే ప్రయత్నం చేశాను. కాని అందరూ ఒకేలా అనిపించారు. గుర్తుపట్టే విషయం ఆలోచించడం మానేశాను. బిడ్డ తన తల్లిని తనంతట తానే గుర్తుపడుతుందిలే అనుకున్నాను. అంతలో వర్షం రావడంతో నాకు మెలకువ వచ్చింది. కల చెదిరిపోయింది.

ఒకసారి నా కడుపు తడుముకున్నాను చేత్తో. నా బిడ్డ కడుపులో భద్రంగా వుంది.

నన్ను తన తల్లిగా ఎన్నుకున్న శిశువు నేను తన తల్లినని ఎలా తెలుసు కుంటుంది? నన్నెలా గుర్తు పడుతుంది? నా బిడ్డ ఎనిమిదేళ్ళొచ్చాక "అమ్మా! మనతో నాన్నలేకపోయినా ఫరవాలేదు. నేనే నాన్ననవుతాను. నీకు నేనే అండగా ఉంటాను" అని నన్ను ఓదార్చినట్లు ఊహ కలిగింది.

నా కళ్ళనిండా నీళ్ళు.

ఈరోజు ఎలాగైనా సోనాల్‌తో కలిసి మార్కెట్‌కు వెళ్ళాలి. పాపకు కావలిసిన బుల్లి బుల్లి బట్టలు కొనాలి. బుజ్జి బుజ్జి ఉలెన్ స్వెట్టర్లు, సాక్సులు ఎంపిక చేసుకోవాలి. డాక్టర్‌కు ఫోన్ చేసి పిల్లలను చూసుకొనే విషయాలతో కూడిన మంచి పుస్తకాన్ని సూచించమని అడగాలి.

నా బిడ్డ పెరిగి పెద్దవుతూ బడికి వెళుతూ వస్తున్నప్పుడు ఒక వేళ రాజేందర్ కలిస్తే గుర్తు పడతాడా?

నా బిడ్డకు ఏం పేరు పెడతాను? 'రాహుల్' బావుంటుంది కదూ!

పెళ్ళయ్యాక నన్ను చూడడానికి వచ్చిన పురోహితురాలు జాసో మీ వంశాభివృద్ధి జరుగుతుంది అని దీవించారు. నాటి ఆశీస్సులకు అర్థం ఇదా అని ఈనాడు తెలుస్తుంది.

పిల్లలు కలగకపోతే వచ్చిపోయే జ్యోతిషులను సంప్రదించడం, దేవుళ్ళు, దేవతల దగ్గరికి పరుగెత్తి పూజలు, పునస్కారాలు, చేయడం; వ్రతాలు, నోములు నోచడం చేస్తారు. వైద్యులను సంప్రదించడం, మాయలు మంత్రాలను నమ్ము కోవడం ఇలా పడరాని పాట్లు పడతారు. ఇలా కడుపున ఒక కాయగాస్తే ఇంట ఎంత ఆనందం పండుతుంది? రోజూ పండగలా గడుస్తుంది. మనుషులంతా ఎంతో ప్రేమాస్పదుల్లాగే కనిపిస్తారు. నా మట్టుకు నాకు పూలతో, కొమ్మలతో,

పక్షులతో మాట్లాడాలనిపిస్తుంది. చివరికి పిల్లులు, కుక్కలతో కూడా. సోనాల్ మాత్రం నన్ను అబార్షన్ చేయించు కొమ్మంటుంది. పిచ్చిది కదూ! స్త్రీ ఎప్పుడూ తన ఒక్కదాని కోసమే బతకదు అని ఎందుకంటారో నాకిప్పుడు తెలుస్తోంది. మాయల ఫకీరు చిలక మాదిరి, ఆమె ప్రాణాలు మరెక్కడో వుంటాయి.

రాజేందర్‌కు ఈ విషయం తెలిస్తే ఏమంటాడు? అంతా మరచిపోయి పరుగెత్తుకు వస్తాడా? పద మన ఇంటికి వెళదాం, ఈ సారి ఎలాగైనా బిడ్డను, కాపాడుకుందాం. అంటాడా!

ఏకంగా ఒక యేడాది సెలవు పెట్టి డాక్టరు చెప్పింది తు.చ. తప్పకుండా పాటించమంటాడా!

తనకు అమ్మాయే కావాలి. పేరు గీత అని పెట్టుకుంటాను. అంటాడేమో! కాదు. అబ్బాయే పుడతాడని నేను. రాహుల్ అనే పేరు పెడతానంటాను. సోనాల్ కూడా మా ఇంటికి వస్తూ వుంటుంది.

సోనాల్‌కు మంచి భర్తను వెతకమని రాజేందర్‌కు చెప్తాను. అది వట్టి తెలివి తక్కువది.

ఏమిటి? ఈ రోజు నేనిలా ఆలోచిస్తున్నాను?

నాకు తెలీకుండానే ఏవో ఆలోచనలు నన్ను ముసురుకుంటున్నాయి. నిజానికి నేనేమీ ఆలోచించడం లేదు. రేపటి కోసమే వేచి చూస్తున్నాను. ఆఫీసుకు వెళ్ళగానే రాజేందర్‌కు ఫోన్ చేసి ఈ వార్త చెప్తాను.

## XII

అనుకున్నట్లే వాళ్ళ ఆఫీసుకు ఫోన్ చేశాను. రాజేందర్‌తో నేను గర్భవతిని అన్న విషయం చెప్పాను. సాయంత్రం హాస్టల్‌కు వచ్చి కలుస్తాను అన్నాడు. నా మనసులో ఏవేవో ఆలోచనలు.

అతని గొంతులో సంతోషం ధ్వనించలేదు. కోపంగానూ అనిపించలేదు. అతని వాలకం నాకర్థం కాలేదు. ఎప్పుడైనా... నేనెప్పుడైనా నిజంగా తప్పు చేస్తే అతనితో మనసువిప్పి చెప్పడం, అతను నన్ను క్షమించేసెయ్యడం జరిగేది.

ఈసారి ... నాకతను పరిచయమే లేదన్నట్లు అనిపించింది. "ఈ రోజు

గనక తను ఇంటికి వెళదాం రమ్మంటే నేను రానని చెప్పు" అంది సోనాల్.

నాకు మరో వ్యక్తి పట్ల ఆసక్తి వున్న సంగతి కేవలం అనుమానం కాదు. యథార్థం అనుకుందాం. అయితే ఏమిటి?

అంత సంకుచిత మనస్తత్వం వున్నవాళ్ళు తమ భార్యల్ని బయటికి ఉద్యోగాలకు పంపించడమెందుకు?

బయట పనిచేస్తున్న స్త్రీకి అనివార్యంగా స్త్రీకి వుండాల్సిన లక్షణాలుండాలి. నిత్యం ఎంతో మందితో కలిసిపనిచేస్తుంది. తను కొందర్ని ఆకర్షిస్తుంది. కొందరి చేత ఆకర్షించబడుతుంది. స్త్రీ లక్షణాలు త్యజిస్తే, ఆమె పరిపూర్ణ మహిళగా వుండలేదు. తన భర్తకు కూడా ఒక సంపూర్ణమైన స్త్రీగా మిగలదు. ఆమెలో స్త్రీకి ఉండవలసిన లాలిత్యం పోతే అది భర్త భరించలేడు.

స్త్రీ కాలు బయటపెట్టగానే మరుక్షణంలో డాక్టర్ గానో, నర్సు గానో, టీచర్ గానో, గుమస్తా గానో... ఏ ఉద్యోగం చేస్తే ఆ రకమైన మనిషిగానో మారేందుకు, తిరిగి యింటికి రాగానే భార్యగా, తల్లిగా, గృహిణిగా మారేందుకు ఆమె దగ్గర ~ ్రదండ మేదీ లేదు.

అమ్రిక్‌కు కూడా ఫోన్ చేసి రాజేందర్ బదిలీ రద్దు చేయించమని చెప్పాను.

"అయితే మీ మధ్య గొడవ సర్దుబాటు చేసుకున్నారన్నమాట" ఆయన నవ్వారు.

"లేదు. కాని ఈ బదిలీ మీరే చేయించారని ఆయనకు తెలిసింది."

"అయితే ఏమిటి? నేను అతని శ్రేయోభిలాషిని."

"కాని ఆయనకు ఇది అర్థం కాదు."

"అలాగా?"

"అవును."

"క్షమించండి, నా వల్ల మీరు ఇబ్బంది పడ్డారు" అమ్రిక్ అన్నాడు.

ఒక్క క్షణం సంకోచించి ఆయనే అన్నారు. "మీ కోసం ఏం చెయ్యాలో చెప్పండి తప్పక చేస్తాను. మీరంటే ఎంతో గౌరవం వుంది నాకు."

నాకు చిర్రెత్తు కొచ్చింది. ఏమిటీ మనుషులు తనకు అంతగా తెలియని స్త్రీతో ఇలాంటి మాటలు ఎలా మాట్లాడతారు?

"ఏం చేస్తారు నాకు. ఆయన విడాకులిస్తే మీరు పెళ్ళి చేసుకుంటారా?" అననైతే అనేశాను గాని ఈ మాట ఎలా అన్నానో నాకే ఆశ్చర్యంగా వుంది.

కొద్దిసేపు అమ్రిక్ మారు మాట్లాడలేదు.

"ఇదండీ పురుషుల నిజస్వరూపం" పళ్ళు నూరుతూ అనుకున్నాను! చూడండి! నేను మిమ్మల్ని తప్పక పెళ్ళాడగలను. కాని విషయం విడాకులదాకా రానివ్వకండి. బహుశా మీ భర్త మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నారేమో! అందువల్లే అంతగా అప్‌సెట్ అయివుంటారు. మీరు కూడా అతడ్ని అంతగా ప్రేమిస్తుండి వుంటారు" చాలా సాదాసీదాగా అన్నారు.

"నేను మంచి దాన్నికానని ఆయన అనుమానం. మీకంతా తెలుసు. బహుశా ఆయన చెప్పేది కూడా నిజమేనేమో. అయినా మీరు నన్ను పెళ్ళి చేసుకుంటారా?" తీవ్రంగానే అన్నాను.

"నా కిద్దరు కొడుకులు. ఒకడు అమెరికాలో స్థిరపడ్డాడు. రెండవ అబ్బాయి కాలేజిలో చదువుతున్నాడు. నా భార్య నాలుగేళ్ళ కిందట చనిపోయింది. నేను... మళ్ళీ మీ లాంటి వారిని పెళ్ళి చేసుకోవడానికి ఇది సరైన వయస్సా? సరైనా సమయమా?నన్ను నేను ప్రశ్నించుకోవాలి. నాలో నేనే ఎంతో బాధపడుతున్నాను. మిమ్మల్ని... మిమ్మల్ని నేను నిజంగా... కాని మీ కాపురం కూలిపోవాలని మాత్రం ఎన్నడూ కోరు కోలేదు. అంతే కాదు. అలా జరక్కూడదని దేవుని ప్రార్థిస్తున్నాను". ఆయన గొంతు వణికింది.

"నేనడుగుతున్నాను. మీరు నన్ను పెళ్ళిచేసుకుంటారా?" ఖండితంగా రెట్టించాను.

"చేసుకుంటాను" ఆయనీమాట చెప్పడంతో కంగారు పడిపోయాను. నా ఉద్దేశం అది కానేకాదు. నేనిక ఫోన్ పెట్టేయ బోతుండగా... "మీ భర్తతో మీరు మళ్ళీ కలవాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తున్నాను" అమ్రిక్ అన్నారు. ఆ వెంటనే ఫోన్ పెట్టేశాను. ఈ రోజు సాయంత్రం రాజేందర్ రావాల్సివుంది.

నేనెందు కింతగా అప్‌సెట్ అయ్యాను? బహుశా ఆయనే నిర్ణయం తీసుకుంటాడో నాకేమాత్రం తెలియదు. ఆ తుది నిర్ణయమేదో నేనే ఎందుకు. తీసుకోకూడదు? ఈ నిర్ణయం తీసుకునే బాధ్యతను, లేదా భారాన్ని వేరెవరి మీదకు ఎందుకు నెట్టివేయాలనుకుంటున్నాను? ఇంత బలహీన మనస్కురాలిగా, పిరికిదానిగా నేనెందుకున్నాను? నేనెందుకు భయపడుతున్నాను? మహా అయితే అతను నన్నేం చేయగలడు?

నన్ను పెళ్ళి చేసుకుంటారా? అని అమ్రిక్‌ను నేనెందుకడిగాను? ఒక మగాడు నన్ను తిరస్కరించాడని, మరొకరు నన్ను ప్రేమిస్తున్నారు చూశావా? అని నన్ను నేను ఓదార్చుకోడానికడిగానా?

"నిన్ను నీవు చాలా ఉన్నతంగా ఊహించుకుంటున్నావు" అని సోనాల్ అన్నమాట కరెక్టే. 'నీకు ఆత్మగౌరవం కూడా చాలా అల్పస్థాయిలో వుంది.' నువ్వు నిజంగానే అమ్రిక్‌ను పెళ్ళాడగలవా? లేకపోతే ఆయనను ఎందుకు అడిగావు?

అన్యాయం పాలైన జీవితం వదిలేసి మరోదారి తొక్కే ధైర్యం నీకుందా!

నువ్వు ఒక బాధితురాలిగా మాత్రమే మిగిలిపోవాలనుకుంటున్నావు. కదూ? ఇలాంటి ప్రశ్నలతో నా అంతరంగం నన్ను వేధిస్తోంది. ఏదో తెలియని ఆవేదన నాలో నివురుగప్పిన నిప్పులా వున్నట్లు అనిపిస్తోంది. సోనాల్ తన గది లోనే వుంది. ఈరోజు తన ఒంట్లో బాగా లేదు. ఇప్పుడు ఎలా వుందని అడగడానికి వెళ్ళాను.

"సోనాల్ నీకోసం ఏదైనా మందుగానీ, ఇంకేమైనా తీసుకురానా?" అని అడిగాను. "నా కోసం విస్కీ తెచ్చిపెట్టగలవా?" ఆమె అడిగింది.

"నేనెప్పుడూ వైన్ షాప్‌కు వెళ్ళలేదు. ఫ్యాన్‌ను పంపుతాను."

సోనాల్ నవ్వి హాస్యానికి అన్నాను. ఎవరైనా చూస్తారనే భయంతో నువు వెళ్ళాల్సిన అవసరం లేదు. రాత్రి పూట నువ్వు వేసుకునే నిద్రమాత్రలు మత్తు పదార్థం కాదా?"

"సోనాల్ నేనిప్పటికే టెన్షన్‌లో వున్నాను. మిస్టర్ రాజేందర్ వస్తున్నాడు నన్ను కలవడానికి" అదేమిటి? "మిస్టర్ రాజేందర్" మామూలుగా రాజేందర్ వస్తున్నాడని చెప్పు. అతను నీకు విడాకులు ఇస్తున్నాడు. అతడ్ని ఏకవచనంతో పిలవ్వచ్చుగా!" సోనాల్ నన్ను ఆట పట్టిస్తున్నట్లు అంది.

"సోనాల్ అతనేమంటాడో నాకు ఇదమిత్థంగా తెలీదు."

"ఏం చెబుతాడనుకుంటున్నావు?"

"నీ కడుపులో బిడ్డ నాది కాదు" అనంటాడేమో!"

"అయితే ఏమిటి? ఇది నీ శరీరం. నీక్కావలసిన వారెవరి వల్లనైనా గర్భం ఎందుకు ధరించ కూడదు?"

"సోనాల్, నీ మాటలు వింతగా వున్నాయి. సామాజిక, నైతిక విలువలు

కూడా కొన్ని కట్టుబాట్లు విధించాయి."

"హర్‌జిత్! నైతిక విలువలు, కట్టుబాట్లు స్త్రీల కోసమేగాని పురుషుల కోసం కాదా?"

"సోనాల్! నువ్వు పిచ్చిదాన్లా మాట్లాడుతున్నావు?"

"నిజమే! నేను ఆదరిస్తాను కాబట్టి"

"అయితే నేను ఆలోచించనా సోనాల్?"

"లేదు. నీకు సమాజం, నైతిక విలువలే కావాలి. నీ యిష్టంతో ప్రమేయం లేకుండా అవి తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాయి."

"సోనాల్..!"

"రాజేందర్ అంటే ఎందుకింత భయపడతావు? మహా అయితే నీకు విడాకులిస్తాడు. నీవంటే నమ్మకంలేని వ్యక్తితో కలిసి జీవించాలనుకునే బదులు ఆ మనిషికి దూరంగా వుండడం మంచిది. ఇంకా చెప్పాలంటే ఆత్మహత్య చేసుకోవడం మంచిది."

"అది పాపం సోనాల్"

"అలా అయితే నిన్ను నీవు అవమాన పరచుకోవడం పాపం కాదూ? శారీరకంగా, మానసికంగా బానిసగా బతకడం పాపం కాదూ? అతడ్ని సేవించుకొనేందుకు సిద్ధంగా వుండడం పాపం కాదూ? నీ జీవితాన్ని వృథా చేసుకోవడం పాపం కాదూ? పిరికి దానిలా బతకడం పాపం కాదూ?"

"సోనాల్! నీకసలే బాగాలేదు. అందుకని...."

"ఓ పిచ్చి హర్‌జిత్! వాస్తవాన్ని ఎదుర్కొనే ధైర్యం నీకు లేదు."

"నన్నేం చెయ్యమంటావ్?" తీవ్ర నిరాశతో అడిగాను సోనాల్‌ను.

"అన్నిటికంటే ముందు నేనిప్పుడు ఏం చెయ్యాలి? అని ఎవర్నీ అడక్కు. అంతకన్నా నీకేం కావాలో నిన్ను నీవు ప్రశ్నించుకో. నీ నిర్ణయాల్ని గౌరవించడం నేర్చుకో హర్‌జిత్! నువ్వో పరిపూర్ణమైన వ్యక్తివి. ఈ నిజాన్ని గౌరవించు."

సోనాల్ అంది.

ఇంక నాకు మాట్లాడే ఓపిక, శక్తీ లేవు.

తీవ్ర మనోవేదనతో నా గదికి తిరిగి వచ్చాను.

"నాకేం కావాలి?" కుర్చీలో కూలబడ్డాను.

ఏమీ అర్థం కావడం లేదు.

నేనో వట్టి పిరికి దాన్ని. తనకేం కావాలో చెప్పే ధైర్యం లేని దాన్ని. నాకు తెలిసిందల్లా ఎలా తలవంచాలి అనేది. అదే నేను సాధించిన విజయం కూడా. సోనాల్ చెప్పింది. నిజం నేను ఆత్మహత్య చేసుకోవడం మంచిది.

తీవ్రమైన తలపోటు వచ్చేసింది.

టీ చేసుకుని పెయిన్ కిల్లర్ ఒకటి తీసుకున్నాను. ఇక లాభం లేదని మరో రెండు నిద్రమాత్రలు వేసుకుని బట్టలు కూడా మార్చుకోకుండానే మంచంపైన వాలిపోయాను. చాలా సేపటికి గానీ నిద్రపట్టలేదు. ప్యూన్‌వచ్చి తలుపు తడుతూ "మేడమ్! ఎవరో ఒకాయన మీ కోసం వచ్చారు" అన్నాడు. అప్పటికి గాఢ నిద్రలో వున్నాను.

"గెస్ట్ రూంలో కూర్చోబెట్టు నేను వస్తున్నాను. క్యాంటీన్‌లో టీ చెప్పు?" మంచం మీద నుంచి లేస్తూ ప్యూన్‌కు చెప్పాను.

లోపలికి వెళ్ళి ముఖం కడుక్కున్నాను. తయారవుతూ నాలో నేనే అనుకున్నాను. ఎవరి కోసం అందంగా కనిపించడానికి తయారవుతున్నాను. మెరుపులా ఒక ఆలోచన తాకింది.

జుట్టు సవరించుకుని గెస్ట్‌రూం వైపు వెళ్ళాను. చలి వేస్తున్నట్లనిపించింది. శాలువా గదిలో వదిలివచ్చాను. దాన్ని తెచ్చుకుందామని వెనక్కి వెళ్ళాను.

ఆఫీసు నుంచి తిరిగి వచ్చేటప్పుడు బాదం పప్పుతో చేసిన స్వీట్స్ తెచ్చానన్న విషయం గుర్తొచ్చింది. ఈ స్వీట్లంటే రాజేందర్‌కు చాలా కిష్టం. ఆ బాక్స్ వెంట తీసుకున్నాను.

నా వేపు అతను చాలా ఏహ్య భావంతో చూస్తున్నాడు. నా అడుగులు తడబడ్డాయి.

"నేను పోట్లాట పెట్టుకోవడానికి రాలేదు. అంత పాలిపోయినట్లున్నా వెందుకు?" అతనన్నాడు. ఒక మాట కూడా మాట్లాడకుండా.... కుర్చీలో కూర్చొనే ముందే స్వీట్స్ ముందు పెట్టాను.

"వద్దు. ఇందులో విషం కలిపావేమో ఎవరికి తెలుసు" నన్ను బాధిస్తూ అతనన్న మాటలకు నేను దిగ్భ్రాంతి చెందాను. నన్ను ఇంత దారుణంగా అనుమానించే వరకూ పరిస్థితులు విషమించాయన్నమాట?

"నీవు ఫోన్ చేసినప్పటి నుంచి నీ గురించే ఆలోచిస్తున్నాను."

"థ్యాంక్స్"

"హర్‌జిత్! నిన్ను ప్రేమించిన రోజులు, పెళ్ళి చేసుకున్న రోజులు, నీతో కలిసి గడిపిన మంచి రోజులు ఉన్నాయి."

"అయితే?" నేను అన్నాను.

"ఇప్పుడు కూడా నేను నీ శత్రువును కాను. అందుకని నీ కడుపులో బిడ్డ తండ్రిని పెళ్ళాడడం మంచిది. కాని నాకు విడాకులిచ్చిన తర్వాతే అది సాధ్యం. న్యాయ ప్రక్రియ చాలా సమయం తీసుకొంటుంది. నువ్వు, నేను పరస్పరం ఇష్టపడి విడాకులకు దరఖాస్తు చేసుకుంటే చాలా త్వరగా వస్తుంది. లాయర్ ద్వారా పేపర్స్ సిద్ధం చేయించి పట్టుకొచ్చాను. నువ్వు సంతకం చేస్తే చాలు." రాజేందర్ ఈ మాటలనడంతో నేను నిలువెల్లా స్థాణువై పోయాను.

"ఈ బిడ్డకు తండ్రి మీరేనని నేనంటే? అప్పుడు..." మాటలు కూడదీసుకుని అన్నాను.

"ఇక మనం ఒకరితోనొకరం అబద్ధాలు చెప్పుకోవడం మానేద్దాం."

"ఇది నిజమేనంటే?"

"అయినా సరే, నీ ద్వారా నాకు బిడ్డ అవసరం లేదు" కోపంగా అన్నాడు.

"కాని నాక్కావాలి" చాలా ప్రశాంతంగా చెప్పాను.

"నో, అది అసాధ్యం" అతను రెచ్చిపోయాడు.

"జరుగుతుంది. నాక్కావల్సిన విధంగానే జరుగుతుంది."

"ఈ బిడ్డ నాది కాదని కోర్టులో రుజువు చేసేందుకు నాపై వొత్తిడి తేకు"

"అయితే రుజువు చెయి. నీకు చేతనైతే" ముఖం మీద అనేసి ఇక లేచాను.

"దీనికంతటికీ వెనుక ఎవరున్నారో నేను వాడిసంగతీ చూస్తాను." నేను ద్వారం దాటుతుండగా అతననడం వినిపించింది. నా గదికి తిరిగి వెళ్ళిపోయాను.... జరిగిందంతా తలచుకుని మనసు బాధగా మూలిగింది.

దైవ సృష్టికి తాను సైతం అన్నట్లు కడుపున బిడ్డను మోస్తున్న తల్లికి అందరూ గౌరవంగా ఉత్సవాలు జరుపుతూ ఉత్సాహంగా ఉంటుంటే ఇక్కడ నా విషయంలో మాత్రం అందుకు విరుద్ధంగా రాజేందర్ నా మీద నిందలు వేస్తుంటే ఈ ఆవేదనను ఎలా ఎవరితో చెప్పుకోను?

ఎన్నడూ దేవాలయాలకు వెళ్ళినదాన్నికాను. కాని ఇవాళ నన్ను కాపాడండి! నాకు మంచి మార్గం చూపించండి! అని దేవుళ్ళు దేవతలందరికీ మొక్కాను.

రాత్రికి అకస్మాత్తుగా భయంతో చాలాసార్లు వణికిపోయాను.

అర్ధరాత్రి సోనాల్ గదికి వెళ్ళి తలుపు కొట్టాను.

"సోనాల్! నీ గదిలో పడుకోనా! నా గుండెలో బాధగా వుంది." తలుపు తెరచిన సోనాల్‌ను అడిగాను.

# XIII

ఈ మధ్య చాలా అనారోగ్యంగా వుంటోంది.

ఆఫీసుకు వెళుతూ మధ్యలో డాక్టర్‌ని కలిశాను. అమ్రిక్ ప్యూన్ కలిసి నమస్కారం పెట్టాడు. "ఓ, రామ్‌చంద్ అంతా క్షేమమేనా?" మామూలుగా అడిగాను.

"దేవునిదయవల్ల అంతా క్షేమమేనమ్మా! కాని మా సారు వెళ్ళిపోతున్నారు. ఆ వచ్చే ఆయన ఎలాంటి వారో!"

"ఎక్కడికి వెళ్తున్నారు?"

"నాకు సరిగా తెలియదు. కాని మాత్రం ఆయన ఇక్కడ్నించి బదిలీ కోసం ప్రయత్నిస్తున్నారు.

"నీకెలా తెలుసు?"

"ఆయనే స్వయంగా నిన్న చెప్తున్నారు"

"రామ్‌చంద్! వెళ్ళొద్దని ఆయనకు చెబుదాం". నేను నవ్వాను.

"అవును మేడమ్! మీరు ఎలాగైనా ఆపాలి. మీరంటే ఆయనకు చాలా గౌరవం."

"ఎలాంటి గౌరవం?" మరిన్ని వివరాలకోసం అన్నట్లు ప్రశ్నించాను. కాని రాంచంద్ ఏమీ చెప్పలేకపోయాడు. బహుశా అతడు వాళ్ళ సారు అంతరంగాన్ని గ్రహించాడేమో! కాని ఆ గౌరవం ఎలాంటిదో మాత్రం చెప్పలేక పోయాడు.

నేను గబగబా నడిచి ప్యూన్ కంటే ముందుగా నా గదికి చేరుకున్నాను. నా గదిదాటి అమ్రిక్ గదిలోకి వెళ్ళాను. ద్వారానికివున్న తెర తొలగించి లోపలికి

వెళ్ళాను. ఆయన ఉలిక్కిపడి.... "రండి, రండి" అన్నారు. అయోమయంగా ఆయన కెదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాను. రాస్తున్న పెన్నును పక్కన పేపర్లపై పెట్టారు. కళ్ళద్దాలు తీసి నా వైపు చూశారు.

"ఇక్కడ్నుంచి బదిలీ చేయించుకోవాలనుకుంటున్నారా?"

"మీ భర్త బదిలీ రద్దయ్యింది." ఆయన సమాధానం.

"మీరు బదిలీ కోరుకుంటున్నారా!" మళ్ళీ అడిగాను.

"మీ సమస్యలకు నేను కారకుడ్ని కాదలచుకు లేదు. అందుకే ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోవాలనుకుంటున్నాను. నిజంగా నేను ఇక్కడ డిస్టర్బ్ అయ్యాను."

"నేనొక్కమాట చెప్పడానికి వచ్చాను. దయచేసి ఇక్కడ్నుంచి వెళ్ళకండి." ఆయన నిశ్శబ్దంగా విన్నారు.

"మీరు వెళ్ళిపోతే నేను పూర్తిగా ఒంటరిదాన్నై పోతాను. అండ కోల్పోతాను" అనుకోకుండా అంతా అనేశాను. ఆయన కళ్ళలో నీటిపొర. అక్కడ్నించి లేచాను. వెలుపలికి వచ్చి చూద్దును కదా! రాజేందర్ బయట నిలబడి వున్నాడు.

నా గుండె బేజారై పోయింది. నేను అమ్రిక్ గదిలోంచి రావడం చూశాడేమో! తెర తొలగించి నా గదిలోకి ప్రవేశించాను. గుండె గట్టిగా కొట్టుకుంటోంది.

చాలా సేపటివరకు నేను తలుపువైపే చూస్తుండి పోయాను. తలుపు కొడతారేమోనని 12 గంటలవుతోంది. ఇక వెనక్కి వెళ్ళిపోయి వుంటాడు. కొన్నాళ్ళుగా పేరుకుపోయిన ఆఫీసు పని పూర్తిచేసి బయట పడ్డాను.

సాయంత్రం అమ్రిక్ తన గదిలోంచి ఇవతలికి రావడానికి పది నిముషాలు ముందుగా గదిలోంచి బయట పడ్డాను.

హాస్టల్‌కు వెళ్ళకుండా.... పెద్దగా కొనేదేమీ లేకపోయినా మార్కెట్‌కి వెళ్ళాను. బహుశా కాస్త జనంలోకి రావాలనిపించిందేమో!.

అక్కడ సత్వంత్ అనే మా పొరుగింటావిడ కనిపించింది. ఆమె దృష్టిలో పడకుండా తప్పించుకుందామనుకున్నాను. కాని నా చేయి గట్టిగా పట్టేసుకుంది.

"ఎలా వున్నారు? చాలా చిక్కిపోయారు. మీ గురించి ఎప్పుడూ మాట్లాడు కుంటాం. ఏదో దురదృష్టం కొద్దీ అభిప్రాయ భేదాలొచ్చాయిగాని మీరిద్దరూ మంచి విద్యావంతులు, జ్ఞానవంతులు" ఆమె అంది.

"పిల్లలెలా వున్నారు?" విషయం మార్చడానికా అన్నట్లు అడిగాను.

"చిన్నపిల్ల మిమ్మల్ని చాలా మిస్ అవుతోంది. ఎప్పుడూ ఆంటీ దగ్గరికి వెళ్ళి స్వీట్స్ తెచ్చుకొని తినడం దానికి చాలా ఇష్టంగా వుండేది. ఇప్పటికీ అప్పుడప్పుడూ వెళ్ళి చూసొస్తుంది. అంకుల్ ఇంట్లో లేరని చెప్తూ వుంటుంది. ఆ లావాటి పనిమనిషికి పిల్లలంటే అస్సలిష్టం వుండదు. అటువైపు వెళ్ళే పిల్లల్ని గట్టిగా కేకలేస్తూ వుంటుంది. కోపతాపాలన్నీ మరచిపోయి ఇంటికి వచ్చేయండీ! అనవసరంగా మీ ఫామిలీ లైఫ్‌ని పాడు చేసుకోవద్దని చెప్తున్నాను. అదీగాక మీ భర్త మీదే ద్వేషం పెంచుకుంటే వచ్చేది ఏముంటుంది. చెప్పండి?"

ఆమె చాలా చాలా చెప్తూంది. నేను వట్టి పిచ్చిదానిలా వింటున్నాను. ఈ రోజు ఈమె కూడా నాకు నీతులు చెప్పే పరిస్థితి వచ్చింది.

"లేదంటే ఒకరోజు మా దగ్గరికి రండి. ఇలా మీరు బిర్ర బిగుసుకు కూర్చో కూడదు. నేను మీ అడ్రస్ కనుక్కొని మిమ్మల్ని వచ్చి కలవాలని కూడా అనుకుంటున్నాను. ఎక్కడ ఉంటున్నారు? ఇంటిపనుల్లో సతమతమై పోతున్నాను. తీరికే చిక్కడం లేదు." ఆమె అంది.

ఆమె చెప్పిన వాటికి దేనికీ సమాధానమివ్వలేదు.

"మిమ్మల్ని ఇంటికి తిరిగి రమ్మని రాజేందర్ ఎప్పుడూ అడగలేదా? మా ఆయన కూడా ఊరికే కోప్పడే రకం. తాత్కాలికంగా నేను మౌనం వహిస్తాను. తర్వాత ఇద్దరి మధ్య సంధి కుదిర్చేందుకు ఆయనే చొరవ తీసుకుంటారు. భార్యా భర్తలన్నాక అభిప్రాయ భేదాలు వస్తాయి. రాకుండా ఉండవు. అందరికీ ఉంటాయి. అంతమాత్రాన ఇంటి నుంచి బయటికి వచ్చేస్తారా?" అంది.

"ఇంకో రోజున నేవస్తాను. ఈరోజు ఏదో హడావిడిలో వున్నాను."

ఆమెను వదిలించుకోవడం కోసం అటుగా వెళ్ళాను. ఆమె వెనక్కి వచ్చి నా చెయ్యి పట్టుకుంది. "ఏమండీ! ఒక విషయం మరచానండోయ్. ఆ ప్యూను, అతని భార్య అదే మీ ఆయన ఇంట్లో తెచ్చి పెట్టుకున్న వారు మంచి వారు కారు. ఏదో ఒక రోజు వారు నీ ఇంటిని ఆక్రమించేస్తారు. వచ్చి ముందు వాళ్ళని బయటికి పంపేయండి. లేదంటే మీరు చాలా పశ్చాత్తాపపడాల్సి వస్తుంది. అలాంటి స్త్రీలు డబ్బున్న వారిని మాయచేయడంలో చతురులు. ఆమె భర్త ఓ తెలివి తక్కువ వాడు. అలాంటి స్త్రీ వాడ్ని మింగేయగలదు. మీకు లాగా చదువుకున్న వారు అన్నీ అర్థం చేసుకోగలరు. మీ ఇల్లు ఇలా భ్రష్టుపట్టకుండా

చూసుకోండి." నా సంసారం విషయంలో ఆమెకు నాకంటే ఎక్కువ విచారం వున్నట్లుంది. ఇలాంటి సలహాలన్నీ ఇస్తోంది.

నేనేమీ మాట్లాడకుండా అక్కడ్నించి కదిలాను. రాజేందర్ ఎక్కువ మటుకు ఇంటికి రావడం లేదన్నమాట ఒక్కటి నాకు బాగా అర్థమైంది. ఎక్కడికి వెళుతున్నాడు? ఏం చేస్తున్నాడు?

అస్తమానం క్లబ్బులో కూర్చుంటూ బాగా తాగుతున్నాడా?

నేను వేసుకొనే నిద్రమాత్రలు కూడా మత్తుపదార్థమేనని సోనాల్ చెప్పిన మాట గుర్తొస్తోంది.

ఓ...ఫ్... ఈ రోజు కూడా కారు నన్ను గుద్దేసేదే. రోడ్డు దాటుతూ వుండగా అటుగా వస్తున్న కారు నా మీదకు దూసుకు వచ్చింది. డ్రైవరు బలంగా బ్రేకులు వేయడంతో తృటిలో ప్రమాదం తప్పింది. జనం కళ్ళు మూసుకుని నడుస్తారు అని అతను గుడ్లురిమాడు.

నేను హాస్టల్‌కి తిరిగొచ్చాను. గదిలోకి వెళ్లేముందు నేను మెయిల్ చూస్తాను. సాధారణంగా నాకు ఉత్తరాలేమీ రాకపోయినా రోజూ చూడడం అలవాటు. ఈ మధ్య బహుశా నాకు తెలియకుండానే రాజేందర్ నుంచి ఉత్తరం ఏమైనా వస్తుందేమోనని ఎదురు చూస్తున్నానేమో!

ఈ రోజు కూడా సోనాల్ తన గదిలోనే వుంది.

ఎలా వుందో చూద్దామని అటుగా వెళ్ళాను.

"ఏమిటిలా వున్నావ్ సోనాల్? ఒంట్లో బాలేదా? పాలిపోయిన ఆమె ముఖం చూస్తూ అడిగాను.

"చూశావా ఈ చాదస్తపు పాత కాలపు వెధవలు మనకెలా సమస్యల్ని సృష్టిస్తారో" నవలను తలగడ మీద పెడుతూ అంది.

"ఏమైంది?"

"నా స్నేహితుడొకడు తెలివి మాలిన వాడు నేను పెళ్ళి చేసుకోకపోతే చస్తానని బెదిరిస్తున్నాడు."

"నీకేమిటి అభ్యంతరం?"

"వాడికి లేనిపోని ఇంపార్టెన్స్ ఇవ్వడానికి నేనేమీ తెలివితక్కువ దాన్ని కాను. వాడు రేపు నాపై పెత్తనం చేస్తూ నన్ను బానిసగా చూస్తాడు"

"అందరూ అలాగే వుంటారా?"

"ఇలాంటి సంఘటనలు జరగనిదెక్కడో... చెప్పు."

"అది కాదు. ఎవరో ఒకర్నయితే చేసుకోవాల్సిందేగా?"

"ఏం అంత అవసరమా?"

"లేకపోతే జీవితమంతా ఎలా గడిపేస్తావ్?

"ఇవన్నీ పనికిమాలిన ఆలోచనలు. ఇలాంటివే నిజమని నమ్ముతాం. స్త్రీ ఒకతే బతకలేదా?"

"అలాంటప్పుడు అతనితో కలసి మెలసి తిరిగి వుండాల్సింది కాదు."

"ఇందులో నా తప్పేం లేదు. వాడో పిచ్చివాడు. నన్నేం చెయ్యమంటావ్?"

"నీ కోసం నువు బతకాలి. నా కోసం కాదని వాడితో చెప్పాను. ఆత్మహత్య చేసుకోవాలనుకుంటే నీ ఇష్టం." అన్నాను. కాని... వాడు నిజంగా ఆత్మహత్య చేసుకున్నాడు.

"అతను నిజంగా చనిపోయాడా?" అన్నాను దిగ్భ్రాంతిగా.

"అవును" సోనాల్ చెప్పింది. నేను ఆశ్చర్యంగా తనవైపే చూస్తూ ఉండి పోయాను.

"అందుకే నీ మనసు బాగాలేదు." అన్నాను.

"వాడు చచ్చాడని కాదు. కాని ఆ సెంటిమెంటల్ ఫూల్‌ని నా స్నేహితుడని నమ్మాను. అందుకే..."

"డాక్టర్ దగ్గరికెళ్ళి నీకోసం మందులేమైనా తీసుకురానా?"

"అక్కర్లేదు. నాకేమందులూ వద్దు. కాని అంతశ్శక్తి, మనోబలం ఉన్నాయి."

"సోనాల్ కొన్నిసార్లు నిన్ను నేను అర్థం చేసుకోలేక పోతున్నాను."

"నీకు నువ్వు అర్థమయ్యావా అసలు?"

"ఏం చదువుతున్నావు .... నవలా?"

"కాదు. ఇది ఒక నటి ఆత్మకథ." అని చెప్తూ ఆ పుస్తకాన్ని నా ముందుకు తోసింది. నటి ఆత్మకథలో నీకేం కనిపిస్తుంది. నువ్వు మంచి పుస్తకాల్ని చదవాలి?" నేనన్నాను.

"చూడగలిగే దృష్టివుండాలి గాని... ప్రతి మనిషికీ తనదైన పూర్తి ప్రపంచమే ఉంటుంది".

"నీ ఆత్మకథనే నువ్వెందుకు రాయకూడదు? చాలా ఆసక్తికరంగా వుంటుంది." ఆమెను కాస్త ఆటపట్టిస్తున్నట్లుగా అన్నాను.

"బహుశా నేనురాస్తాను. అయితే నీలాంటి పాఠకులు నా ఆత్మకథ చదవ డానికి తగినవారు కారనిపిస్తుంది".

"వాళ్ళు తగిన అర్హత సంపాదించు కునేటప్పటికి నువ్వుండకపోతే! అప్పుడేం చేస్తావ్?"

"నేనుండక పోవచ్చు. నాలాంటి సోనాల్‌లు ఎంతో మంది ఉంటారు."

"నువ్వు పెళ్ళంటూ చేసుకోకపోతే మరో సోనాల్ ఎక్కడ్నించి వస్తుంది?" హాస్యాని కన్నాను.

"చూడు! సోనాల్‌లు తల్లి కడుపున పుట్టరు. వాళ్ళు జీవితంలోని పీడన నుంచీ, కఠిన వాస్తవాలనుంచీ పుట్టుకొస్తారు. అదలా వుంచు పెళ్ళి చేసుకోనని నేనెప్పుడు చెప్పాను?"

"అలా అనిపిస్తోంది"

"ఆఫ్‌కోర్స్! ఆత్మ వంచనతో కూడిన జీవితాన్ని గడిపే సంప్రదాయపు వివాహాన్ని మాత్రం చేసుకోను."

"అలా అయితే ఈ బాయ్ ఫ్రెండ్‌ని చేసుకుంటే పోయేదిగా పాపం. అనవసరంగా వాడ్ని ఎందుకు చావనిచ్చావు?"

"కేవలం సానుభూతి కోసమా? సానుభూతి చూపడం, చూపించుకోవడం నాకసలే గిట్టదు."

"సరే. ఇవన్నీ వదిలెయ్ ఇప్పుడు చెప్పు, ఇప్పుడున్న పరిస్థితిలో నేనేం చెయ్యాలి?"

"నీకింతకు ముందే చెప్పాను. నువ్వేం చెయ్యాలో ఇతరులను అడగడం మొదట ఆపెయ్."

"ముందు కాస్త టీ తాగుదామా?" సంభాషణ ఆపే ప్రయత్నం చేస్తూ అన్నాను. సోనాల్ నవ్వింది. ఈలోగా ప్యూన్ వచ్చి సోనాల్ కోసం ఎవరో వచ్చారని చెప్పాడు.

"వెళ్ళి నాకు బాలేదని చెప్పు."

"వచ్చిందెవరో మొదట అడగవేమిటి?" ప్యూన్ వెళ్ళాక అన్నాను.

"ఎవరైనా కానీ, నా కంటే ఎవరూ ముఖ్యం కాదు."

"హీటర్‌ను ఆన్ చేద్దామా?" దాని వైపు వెళుతూ అన్నాను.

"నీకు చలేస్తోందా?"

"నా ఎముకలు వణుకుతున్నాయి."

"కొద్దిగా బ్రాందీ తీసుకో" అంది సోనాల్.

"వద్దు సోనాల్ నాకు బ్రాందీ వద్దు"

"బ్రాందీ తాగడం తప్పంటావా?"

"అవును"

"ఇలాంటి విషయాలను ఆలోచించి ఆలోచించి ఏదో ఒకనాడు నీకు మెదడు రక్తనాళాలు చిట్లిపోతాయి. నిజం చెప్తున్నాను. నీపేరు హర్‌జిత్ అని కాకుండా అహల్య అని పెట్టాల్సింది. ఎలాంటి తప్పు చెయ్యకపోయినా ఆమె దైవం, ఆమె భర్త ఆమెను శపించగా ఆమె శిలగా మారిపోయింది. నిజానికి ఆమె తప్పు చేయడం కాదు. ఆమె విషయంలో తప్పు జరిగింది. ఆ శ్రీరామచంద్రుని పాదస్పర్శతో తిరిగి సజీవురాలు కావడానికి వేల సంవత్సరాల పాటు ఎదురు చూడాల్సి వచ్చింది."

"ఆమె జీవించే హక్కు ఆమె వద్దలేదు. ఆమె భర్త వద్ద వుంది." సోనాల్ చెప్పుకుపోతోంది. "ఓహ్ హర్‌జిత్! ఒకవైపు చలి నీ ఎముకలు కొరికేస్తున్నా నువ్వు బ్రాందీ తాగవు."

## XIV

నాలుగు నెలలయింది హాస్టల్‌కు వచ్చి.

ఆ రోజు తర్వాత ఇక రాజేందర్‌ని ఎప్పుడూ కలవలేదు. అతను కోర్టులో విడాకుల కోసం దరఖాస్తు సమర్పించాడో, లేదో తెలీదు.

శాశ్వతంగా హాస్టల్‌లోనే ఉంటున్నట్లు కొన్ని సార్లు అనిపిస్తుంది.

నాకు ఎన్నటికీ ఇల్లు, భర్త లేరనిపిస్తుంది.

రోజూ పొద్దు పొడవటం, పొద్దు గుంకడం... నిరర్థకంగా సాగుతోంది. అమ్రిక్‌ను కూడా కలవలేదు. అతని గురించి ఆలోచించడం మానేశాను.

సముద్రంలో ఆటుపోట్లు వచ్చి పరిస్థితి సద్దు మణిగింది. చీర కట్టుకున్నా నా కడుపు పెరిగినట్లు కనిపిస్తోంది.

ప్రసవసమయంలో తల్లి మరణించే సందర్భాలున్నాయనే సంగతి తలచు కున్నప్పుడు నన్ను భయం ఆవరిస్తుంది. ఒకవేళ నేను ప్రసవంలో చనిపోతే రాజేందర్ బిడ్డను తీసుకుంటాడా? అమ్రిక్‌ని అడిగితే తప్పక తీసుకుంటాడు. కాని అమ్రిక్... తనది ఏ తప్పు లేకపోయినా ఆయన పిల్లలు ముందు... ఈ బిడ్డను తీసుకొమ్మనే హక్కు నాకెక్కడుంది.

వేల మంది స్త్రీలు పిల్లల్ని కని క్షేమంగా ఉంటున్నప్పుడు నేనెందుకు చని పోతాను?

బిడ్డ పేరు గురించి మళ్ళీ ఆలోచనలో పడ్డాను. మగబిడ్డయితే 'రాహుల్' అని కాదు 'మను' అని పెడతాను. మను అని ఎందుకు? నన్ను నేనే ప్రశ్నించు కున్నాను. మరోసారి మనుస్మృతిని ఆహ్వానిస్తున్నాను. మనుస్మృతి అంటే హిందూ ధర్మశాస్త్రం. ఇందులో స్త్రీకి అనేక మినహాయింపు లిచ్చారు.

నాకు నేనే జోక్ వేసుకున్నాను. ఆ రోజు ఆదివారం. తలారా స్నానం చేసి కూర్చున్నాను. సోనాల్ సినిమాకు వెళ్ళింది. ప్యూన్ వచ్చి ఎవరో వచ్చారని చెప్పాడు. ఆమె సుధ. రాజేందర్ చెల్లి. ఆమెను చూడగానే నా కళ్ళ నిండా నీళ్ళు నిండాయి. కాని తమాయించుకున్నాను. ఆమెను నా గదికి తీసుకు వచ్చాను.

"ఎప్పుడొచ్చావు సుధా?" ఆమెకు కుర్చీ చూపించాను.

"వచ్చి పది పన్నెండు రోజులైంది. అన్నయ్యకు ప్రమాదం జరిగింది."

"ప్రమాదమా?" షాక్ తిన్నాను.

"నీకు తెలీదా? అన్నయ్య స్కూటర్‌ను కారు గుద్దేసింది. తీవ్రంగా గాయ పడ్డాడు. ఇంకా ఆస్పత్రిలోనే వున్నాడు."

"ఇప్పుడెలా వున్నాడు?" కంగారుగా అడిగాను.

"ఫరవాలేదు. ఒక కాలికి, ఒక చేతికి ఇంకా కట్టు వుంది. రెండు పక్కటెముకలు విరిగాయి."

సుధకు టీ చేసిచ్చి బిస్కెట్లు అందించాను. ఆమె టీ తీసుకోలేదు. ఏడవడం ప్రారంభించింది. "నువ్విలా చేయకుండా ఉండాల్సింది వదినా? నువు ఇల్లు విడిచివెళ్ళాక అన్నయ్య బాగా తాగడం మొదలు పెట్టాడు. ఈ ప్రమాదం కూడా

బాగా తాగడం వల్లే జరిగింది.”

నేనేమీ మాట్లాడలేదు.

“ప్రతి కుటుంబంలోనూ ఏవో మనస్పర్థలున్నాయి. దానర్థం ఇల్లు విడిచి పోవాలని లేదు కదా!” అంటూ ఆమె మళ్ళీ ఏడుస్తూనేవుంది.

“సుధా! టీ తీసుకో” ఆమెకు మళ్ళీ టీ కప్పు చేతికందించాను.

“నువ్విలా చేయడం ఏం బాగాలేదు వదినా? ఎవరినీ లెక్కచెయ్యకుండా, మా అందరి ఇష్టానికి వ్యతిరేకంగా అన్నయ్య నిన్ను పెళ్ళి చేసుకున్నాడు.”

“ఆయనే నన్ను ఇంట్లోంచి వెళ్ళిపొమ్మన్నాడు. నాతో కలిసి జీవించడం ఆయనకు ఇష్టంలేదు.”

“కోపంలో చాలా అంటారు వదినా? ఇలా ప్రతి దాన్నీ సీరియస్‌గా తీసుకుంటారా? ఏమిటి?”

“ఆయన ఇంకా చాలా అన్నాడు సుధా!”

“నీ భర్తనే నువ్వు క్షమించలేవా వదినా!”

“నా శీలాన్నే శంకించాడు.”

“నువ్వు అన్ని అనుమానాల్ని నివృత్తి చేసి వుండాల్సింది.”

“ఎలా నివృత్తి చేయమంటావు, నా గుండెకోసి ఆయనకు చూపించమంటావా?

“ఆయన కోపాన్ని కాస్త భరించాల్సింది.”

“ఎందుకు? నా అవసరం లేని మనిషితో, నేనంటే నీచమైన అభిప్రాయం వున్న వ్యక్తితో, నన్ను ఇంట్లోంచి వెళ్ళిపో అన్న వ్యక్తితో పడివుండి ఇంకా అవమానాల్ని భరించడానికా?”

“వదినా నువ్వు నాకంటే పెద్ద దానివి. నాకంటే ఎక్కువగా తెలిసిందానివి. ఒక్కసారి ఆలోచించు. అన్నయ్య నిజంగా నిన్ను అసహ్యించుకునే వుంటే, నువ్వు చెడిపోయిందానివని అనే వుంటే నిన్ను ఇంతగా మిస్సయి వుండేవాడు కాదు కదా?”

“సుధా! ఆయన నాకు విడాకులిస్తున్నాడు. ఇప్పుడు మీరంతా కలిసి మీ ఇష్టమైన అమ్మాయిని చూసి పెళ్ళి చేయండి.” అంటూ ఉండగానే దుఃఖం పొంగు కొచ్చింది.

"వదినా! నిన్ను మళ్ళీ తీసుకెళ్ళడానికి వచ్చాను."

"నువ్వు వస్తున్నట్లు ఆయనకు తెలుసా?"

"లేదు."

"అయితే నేను రాలేను."

"కనీసం ఆయనకు చూడడానికైనా వెళ్ళవా?"

"చెప్పకుండా వచ్చినందుకు నిన్ను కూడా కోప్పడుతారు."

"నువ్వు సంపాదనపరురాలివి కాబట్టి ఆయన గురించిన బాధే నీకు లేదు. లేదా ఆయన ఇష్ట ప్రకారం జీవించే ఉద్దేశం లేదు." సుధ కోపంగా అంది. నేనామె కోపాన్ని అర్థం చేసుకోగలను. ఆమె కేవలం వాళ్ళన్నయ్య పక్షం నుంచే ఆలోచిస్తోంది.

"సుధా! అకారణంగా నేను అవమానించబడాలను కోవడం లేదు."

"నిన్ను ప్రేమించే మనిషికి నిన్ను అవమానించే హక్కు కూడా వుంది."

నేను జవాబివ్వలేదు.

నన్ను సుధ దగ్గరగా కళ్ళు విప్పార్చి చూసింది. చిన్నగా నవ్వుతూ "వదినా! ఏమైనా శుభవార్తా!" అని అడిగింది.

"అవును." చెప్పాను. "కాని ఇది తన బిడ్డ అని అంగీకరించేందుకు ఆయన సిద్ధంగా లేదు."

సుధ ముఖంపై నిరాశానీడలు కమ్ముకున్నాయి.

"అయితే ఇదన్నమాట విషయం?" అంటూ ఆమె ఆలోచనలో మునిగింది. "కాని వదినా!" అని కొన్ని క్షణాలు ఆలోచించి "ఎస్"? ఏదో తట్టినట్లు అని ప్రారంభించింది.

"బిడ్డకు తండ్రి ఎవరో తేల్చేందుకు ఒక రక్తపరీక్ష వుంది వదినా?" అన్నది.

"ఆ మనిషి నన్ను నమ్మలేనప్పుడు రక్త పరీక్ష చేసి నమ్మించాలనుకోవడం లేదు."

"ఎందుకలా?"

"ఇలా చేయడం నాకు అవమానకరం"

"ఒక్క దెబ్బకు ఒక్కటి కాదు, రెండు కాదు, మూడుప్రాణాల్ని బలి చేయాలనుకుంటున్నావు".

"ఎప్పుడూ స్త్రీయే దోషిగా వుంటోంది."

"వదినా! ఇక నీతో ఎక్కువ వాదించాలనుకోవడం లేదు. కాని నీ తప్పు ఒప్పుకుంటే ప్రమాదమేమీ లేదు."

"ఏం తప్పు చేశానని ఒప్పుకోవాలి? నేనో నీతి లేని స్త్రీని అనా?"

"అన్నయ్యకు ఈ అనుమానమెలా వచ్చింది?"

"నేనేం చెయ్యను? ఆయన ఆలోచనా విధానం అలా వుంది."

"ఎవరిని దృష్టిలో వుంచుకొని ఆయన అనుమానిస్తున్నాడు?"

"నా కొలీగ్‌ను"

"ఆ ఆఫీసు నుంచి ఎక్కడికైనా బదిలీ చేయించుకో. లేదా ఉద్యోగం వదిలెయ్. ఇదేం పెద్ద విషయం కాదు."

"నో. అది సాధ్యం కాదు."

"నిజానికి ఒక వ్యక్తి మరొకరిని అమితంగా ప్రేమిస్తే అనుమానించే అవకాశం కూడా వుంటుంది."

"సుధా! ఇప్పుడిక పరిస్థితులు కాస్త ప్రశాంతంగా వున్నాయి. ఇక నాకు ఓ-రాడే శక్తి కూడా లేదు." నా అలసటను ఆమె గమనించేలా అన్నాను.

"ఏ స్త్రీ కూడా తన కాపురాన్ని చేజేతులా కూల్చుకోలేదు. వివాహేతరమైన కారణాలుంటే తప్ప. నీ విషయంలో కూడా నిజమా?"

"సుధా వేరే ఏదైనా విషయం మాట్లాడుకుందాం."

"అన్నయ్య మునుపటి మనిషి కాదు. ఆయన గురించి తెలుసుకోవడానికి రావూ!"

"ఇక్కడికి వచ్చినందుకు నిన్ను తిట్టకుండా ఉంటాడా అని."

"తిట్టనీ!"

"సుధా?"

"వదినా! అన్ని సంబంధాలను ఎలా తెంచేసుకోగలుగుతున్నావు?"

"నేను తెంచేసుకోవడం లేదు. అవే చాలా సులువుగా తెగేలా వున్నాయి." నా గొంతు వణికింది. "లే వదినా, వెళదాం పద?" సుధ లేచి గదినంతా కలియ జూసింది. రాజేందర్‌ను పరామర్శించడానికి సుధతో కలిసి ఆస్పత్రికి వెళ్ళాను. అక్కడ కొన్ని నిముషాల పాటు కూర్చున్నాను.

ఆయన కనీసం నా వైపు చూడనైనా లేదు. "ఎలా వున్నారు?" అని నేనడిగిందానికీ మాటా పలుకూ లేదు. గాయాల తీవ్రత వల్లనో, చాలా నెలల తర్వాత చూడటానికి వచ్చాననో తెలియలేదు. కాని రాజేందర్ ముఖం పీక్కు పోయింది.

అతని ఒడిలో వాలిపోయి మనసారా ఏడ్వాలని, అంతా చెప్పుకోవాలని అనుకున్నాను. ఇద్దరూ మనసువిప్పి మాట్లాడుకోనీ అనుకుందేమో సుధ బాత్రూం లోకి వెళ్ళింది.

అయితే మాకు మాట్లాడుకోడానికేముంది?

పెరిగిన నా కడుపువైపు చూసిన ఆయన ముఖంలో కోపం కూడా పెరిగింది.

నిశ్శబ్దం భరించరానిదిగా తయారయింది.

"సరే.... ఇక నేను వెళతాను" లేచాను.

ఆయన నా వైపు చూడనూ లేదు. నోరు విప్పి మాట్లాడనూ లేదు.

"దయచేసి వెళ్ళవద్దు" సుధా అంది.

"నేను మళ్ళీ వస్తాను" ముభావంగా అన్నాను.

"అసలు వెళ్ళకపోవడం మంచిది, కదన్నయ్యా?"

సగం మాట నాకు చెబుతూ మరో సగం మాట వాళ్ళన్నయ్యతో అంది.

సుధ వైపు అతను తీవ్రంగా చూశాడు. ఆమె అర్థం చేసుకుందేమో! నేను మౌనంగా ఆగదిలో నుంచి వెలుపలికి వచ్చాను.

హాస్టల్ వైపు నడిచాను. కొద్ది దూరం వెళ్ళాక ఒక కారు నా పక్కన వచ్చి ఆగింది. నేను అటు తిరిగి చూశాను. అతను మొన్నామధ్య నాకు మార్కెట్‌లో తారసపడి సలహాలిచ్చిన మా పొరుగింటావిడ భర్త. ఆయన పేరు సోధీ.

"హలో, మిసెస్ రాజేందర్ ఎక్కడికి వెళుతున్నారు? రండి నేను డ్రాప్ చేస్తాను." అంటూ కారు డోర్ తీశాడు.

"అబ్బే వద్దండి... చాలా దగ్గర."

"రండి. మీరెక్కడికి వెళ్ళాలన్నా డ్రాప్ చేస్తాను. రండి" వొత్తిడి చేశాడు. అతను తెలిసిన కుటుంబానికి చెందిన వ్యక్తి. మాకు పొరుగునే వుండే వాడు. రాజేందర్‌కు కూడా పరిచితుడు. అయినా ఎక్కడానికి వెనక జాగు చేస్తున్నాను.

"ప్లీజ్ మీరు వెళ్ళిపోండి... నాకు చాలా దగ్గర."

"పోనీ అక్కడ డ్రాప్ చేస్తాను రండి." మళ్ళీ అన్నాడు.

అయిష్టంగానే ఎక్కాను.

"మీరు హాస్టల్‌లో ఉంటున్నారన్న మాట." తెలిసినా మళ్ళీ అడిగాడు.

"అవును" అన్నాను.

"మీ ధైర్యానికి జోహార్లు. జీవితంలో ఒకరు కలిసిరానప్పుడు విడిపోవడమే మంచిది లెండి! లేకపోతే ఏమిటి చెప్పండి! ఈ భారతీయ స్త్రీలు భర్తలకు జిగురులా అతుక్కునే వుంటారు."

నాకు మాట్లాడే మూడ్ లేదు.

"మీకేమైనా పనివుంటే చెప్పండి. అస్సలు వెనుకాడవద్దు. ఇదీ నా టెలిఫోన్ నెంబరు" కార్డు ఇస్తూ అన్నాడు.

"పదండి కలిసి టీ తాగుదాం" క్వాలిటీ దగ్గర కారు ఆపాడు.

"నాకు వద్దండీ! మీరు తీసుకోండి. నేను ఇక నడచి వెళతాను." అని చెప్పి కారు డోర్ తెరిచాను.

"ప్లీజ్ వెళ్ళవద్దు. టీ తాగకపోయినా ఫరవాలేదు. నేను మిమ్మల్ని డ్రాప్ చేస్తాను!" నా చేయి పట్టుకొని ఆపాడు. అంతే. విసురుగా అతని చేతిని తోసి వేసి తీవ్రంగా చూశాను. అతను నవ్వి "కోపగించుకోకు మిసెస్ రాజేందర్! నేను నీ అభిమానుల్లో ఒకడి. మిసెస్ రాజేందర్ అద్భుతమైన, అందమైన, తెలివైన స్త్రీ అనీ, ధైర్యవంతురాలనీ అందరూ అంటున్నారు."

"నీ ఉద్దేశమేమిటి?" నేను అడ్డుకున్నాను.

"మీ కోసం ఏమైనా చెయ్యడానికి నాకు అవకాశమివ్వండి."

"మిస్టర్ సాధీ, కారాపండి. నేను దిగిపోవాలి." ఆగ్రహంగా అన్నాను.
"నా ముందు మరీ అంత పతివ్రతలా నటించకు?" వ్యంగ్యంగా అన్నాడు.

"కారాపు?" అరిచాను. కుదుపుతో కారు ఆగింది. వాడు నా ఎదపై చేయి వేసి అదిమి పట్టుకున్నాడు. నేను చాలా గట్టిగా తోసి వేశాను. వాడి తల వెళ్ళి కారు విండో అద్దానికి కొట్టుకుంది. డోర్ తీసి కారు దిగేశాను.

కళ్ళలో నిప్పులు కురిపిస్తూ కోపంతో మిటమిటలాడిపోతున్నాడు. ముఖం మాత్రం ఓటమితో మాడిపోయింది. చుర్రమని చప్పుడు చేస్తూ కారు వెళ్ళి

పోయింది. దిగ్భ్రాంతి నుంచి తేరుకొని రిక్షా కుదుర్చుకుని ఎక్కాను. హాస్టల్‌కు చేరానన్నమాటే గాని ఆ అయోమయం నుంచీ, మానసిక వత్తిడి నుంచి ఇంకా తేరుకోలేదు. కళ్ళు తిరుగుతున్నాయి.

సోనాల్ గదికి వెళ్ళి ఒక్కసారి డాక్టర్‌కు ఫోన్ చేసి ఏం తీసుకోమంటారో అడగమన్నాను.

"ఏమైంది?" సోనాల్ అడిగింది.

"ఒక రాస్కెల్‌తో ఇప్పుడే ఘర్షణ పడ్డాను. వాడు కారులో లిఫ్ట్ ఇచ్చాడు."

"బుద్ధిలేని దానా కొత్తవాళ్ళ లిఫ్ట్ తీసుకోవద్దు."

"వాడు మా పొరుగింటివాడు. భార్యాపిల్లలున్న వాడు."

అలాంటి వాళ్ళే ఎక్కువ ప్రమాదకరం. స్త్రీలు ఏం చేసినా ఎవరికీ చెప్పుకో లేరని వాళ్ళకు తెలుసు. అలాంటి వాళ్ళను చెప్పుతో కొట్టి బుద్ధి చెప్పడమేసరైంది. చెప్పుతో కొట్టిన విషయాన్ని కూడా ఎవరితోనూ చెప్పుకోలేదు."

"కాని నేను చాలా మానసిక వత్తిడికి గురయ్యాను."

"అక్కడే తప్పు చేశావు. నువ్వు వాడికి భయపడ్డావనుకొనేలా చేయవద్దు."

"ఎంత నీచులు వీళ్ళు?"

"రేపే వెళ్ళి వాడి భార్యకు చెప్పు. పిల్లల ముందే నీ భర్త ఇలా ప్రవర్తించాడని ఎండగట్టు."

"దీని వల్ల నాకు చెడ్డ పేరు వస్తుంది."

"హర్‌జిత్ నువ్వేదో తప్పు చేసినట్లు మాట్లాడతావేంటి? జరిగిందాంట్లో నీ తప్పేముంది?"

"సోనాల్, జనం ఎవరికి తోచినట్లుగా వాళ్ళు వాళ్ళ దృష్టితో అర్థం చేసుకుంటారు."

"జనాలకు ఎందుకు భయపడతావు నువ్వు?"

"నాకు తెలీదు సోనాల్" అంటూ ఏడ్వడం ప్రారంభించాను.

"రేపు వాడి బాస్‌కి ఈ సంగతి చెబుదామా?"

"వద్దు. నేను మంచి దాన్ని కానని చెప్తాడు వాడు. ఇప్పటికే భర్తను వదిలేసిందాన్ని."

"అయితే మనసులోంచి తేలిగ్గా తీసిపారెయ్. ఏదీ పట్టించుకోకు." నేను

బదులు చెప్పలేదు.

సోనాల్ డాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ నేను చాలా అశాంతిగా వున్నానని చెప్పింది. ఆదారిన వెళుతున్న కారణంగా డాక్టర్ స్వయంగా వచ్చి చూసింది. రక్తపోటు చూసి కొన్ని టాబ్లెట్లు రాసింది.

"కొద్దిగా విస్కీ తీసుకో అంతా సద్దుకుంటుంది." సోనాల్ గ్లాసులో విస్కీపోసి నీళ్ళు కలుపుతూ అంది.

"సోనాల్ ?...."

"ఈ ప్రపంచాన్ని ఎదిరించే దమ్ము లేకపోతే గడపదాటి ఎందుకు బయటికి వెళతావు? నేను అటు పనీ చెయ్యలేను, ఇటు సంసార బాధల్ని భరించనూ లేను. దయచేసి మీ పాదాలవద్ద పడి వుండనివ్వండి? అని నీ పతిదేవుని ప్రార్థించి వుండాల్సింది." సొనాల్ వ్యంగ్యంగా అంది.

"సోనాల్!.." గ్లాసు తీసుకోవడానికి వెనుకడుగు వేశాను.

"చప్పుడు చెయ్యకుండా తాగు" సోనాల్ హెచ్చరించింది.

"సోనాల్! నాకు చాలా అలసటగా వుంది."

"సరే అంతా మరచిపో." సోనాల్ ఆ డ్రింకు తానే తీసుకుంది. తన బ్యాగు లోంచి రెండు నిద్రమాత్రలు తీసి నాకిచ్చింది. "డాక్టర్ ఇవి తీసుకొమ్మంది." అంది.

బిళ్ళలు వేసుకుని భోం చేశాను.

తన కోసం సోఫాలో బ్లాంకెట్ పరచుకొని పడుకుంటూ నాకు తన పడక ఇచ్చింది. బట్టలు మార్చుకోడానికి నా గదికి వెళ్ళాను.

"సోనాల్! నువ్వే గనుక తోడు లేకపోతే నేనేమై పోయేదాన్నో నాకే తెలీదు."

"దేవుని మీద నీకు నమ్మకం లేదా?" సోనాల్ అడిగింది. నేను జవాబివ్వ లేదు. చెయిరో రాసిన హస్త సాముద్రికం పుస్తకం తీసుకుని చదవడం మొదలు పెట్టాను. కాని కొద్ది సేపటికే నిద్ర ముంచుకొచ్చింది. నిద్రమాత్రలు పని చేస్తున్నాయి. అకస్మాత్తుగా నా కడుపులో ఏదో కదలిక ప్రారంభమైంది. పుస్తకాన్ని పక్కన పెట్టేసి రెండు చేతుల్ని కడుపు మీద వుంచి వొత్తుకున్నాను. నాకు కూతురు వద్దు కొడుకే పుట్టాలి. త్వరగా పెరుగుతాడు. అనుకుంటూ ఉండగానే ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు.

# XV

బిడ్డ కడుపులో వుండగా తల్లి ఏదైనా తిన్నా, చదివినా, ఆలోచించినా, విచారించినా ప్రతిదీ బిడ్డకు చేరుతుందని ఎక్కడో చదివానో, చెప్పగా విన్నానో అంతగా గుర్తులేదు. నా బిడ్డ కోసం అంతా సానుకూలంగా జరగాలని నేను కోరుకుంటున్నాను. ఎం.ఎస్. సుబ్బలక్ష్మి పాడిన భక్తిగీతాలు వినేదాన్ని. రాత్రి పొద్దు పోయాక శ్లోకాలు, మంత్రాలు పఠించే దాన్ని.

ఎప్పుడూ ప్రతికూలమైన ఆలోచనలు బిడ్డకు సోక కూడదని నా ఉద్దేశం. అందుకని బాధను, విచారాన్ని కలిగించే ఆలోచనలేమీ నా దగ్గరికి రానీయడం లేదు. రాజేందర్ గురించీ, అమ్రిక్ గురించీ ఆలోచించడం మానేశాను.

పొద్దున్నే లేచి తల్లి ఎవరి ముఖం చూస్తే పుట్టే బిడ్డకు ఆ పోలికలు వస్తాయని చెప్తారు. అందువల్ల నా గదిలో పెద్ద ఏసుక్రీస్తు బొమ్మ పెట్టాను. దీని అర్థం నాకు క్రైస్తవ మతం పైన విశ్వాసం వుందని కాదు. క్రీస్తు అంటే నాకు అమితమైన గౌరవం. క్రీస్తు చాలా అందంగా వుండడమేగాక దైవికమైన లక్షణాలు కూడా ఆయనలో గోచరిస్తాయి.

తెల్ల రంగు అంగీలు కొన్నాను. ఉయ్యాల, దోమతెర, తుడుచుకునే గుడ్డలు తెచ్చాను. పిల్లల్ని పెంచే విషయాలతో కూడిన చాలా పుస్తకాలను చదివాను.

ఏడవ నెల వచ్చింది. రోజుల్ని లెక్కపెడుతున్నాను.

సృష్టిలో నేనూ ఒక భాగస్వామి నయ్యాను. సృష్టి అనే వింత ఎప్పుడూ ఒక అద్భుత అనుభవంగా అనిపిస్తుంది. గర్భిణి ముఖంపై ఏదో తెలియని కొత్త కాంతి ప్రసరించడం ఇప్పుడు నాకు తెలుస్తోంది.

ఆలయం వద్ద కోనేటిలోని స్వచ్ఛమైన నీటిలో మునిగినట్లు, ఉదయించే సూర్యునికి నమస్కారాలు చేసినట్లు ఈ కక్షలు, ద్వేషాలు, అసూయలు అన్నీ వెనక్కి వెళ్ళాయి. అంతరంగంలోని జ్వలనం, నింగి, నేల, నీరు, నిప్పు, గాలులు కలిసి పోయి ఒకానొక అనుపమానమైన ఆకారం రూపొందినట్లుంది.

తల్లి పాలంటే ఏమిటో ఇప్పుడు నాకర్థమయింది. అమోఘమైన మాతృత్వ రూపం దగ్గరవుతోంది. స్త్రీగా వున్న నేను తల్లిగా మారుతున్నాను. కేవలం తల్లిగా కాదు నేను సైతం సృష్టికారుని సృజనక్రియలో భాగస్వామి నవబోతున్నాను.

ప్రపంచం నా ముందు సూక్ష్మస్థాయికి కుంచించుకు పోయింది. నేనెంతో ఎత్తుకు ఎదిగాను. ఈ బిడ్డ తండ్రిని నేను క్షమించేశాను. నన్ను నేనే క్షమించేసు కున్నాను. నా కోసం కొత్త బట్టలు కుట్టించుకున్నాను. పాతవి ఇప్పుడు నాకు పట్టవు కదా! అందుకే తప్పనిసరి అయింది. మెడలో వేసుకోవడానికి ఒకటి వెండిది, ఒకటి బంగారిది, ఒకటి ముత్యాలతో చేసింది, ఒకటి పగడాలది.... ఇలా రకరకాలైన గొలుసులు కొన్నాను.

గోడలకు, కిటికీలకు కొత్త తెరలు కొన్నాను. కొత్త డన్‌లప్ పరుపు, దాని పైన పరచే బట్టలు కొన్నాను.

జీవితం పై మమకారం గట్టిపడుతోంది.

అమ్రిక్ తన సర్వీసు పూర్తి కాకముందే పదవీ విరమణ చేస్తున్నాడని, అమెరికా వెళుతున్నాడని ఈ మధ్య ఎవరో అన్నారు. నా కది నచ్చలేదు. ఆయన అలా వెళ్ళిపోతే నాకు ఒక స్నేహపూర్వకమైన ముఖం శాశ్వతంగా కనుమరుగవుతుంది. నేనూ మరింత ఒంటరినైపోతాను. నాకు బాధ కలిగింది. అతని గది లోకి వెళ్ళాను. తాను కూర్చున్న వాడల్లే లేచి "రండి రండి!" అని ఆహ్వానించారు. సోఫాలో ఒక పక్క మౌనంగా కూర్చున్నాను. ఆయన కూడా తన కుర్చీలోంచి లేచి సోఫాలో కూర్చున్నారు.

"మీరు అమెరికా వెళుతున్నారా?" అభ్యర్థన ధ్వనించే స్వరంతో అడిగాను.

"నేనే వచ్చి మిమ్మల్ని కలవాలనుకున్నాను" అన్నారు నా ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండానే.

"మీరు ముందుగానే పదవీ విరమణ చేసి అమెరికా వెళుతున్నారా?" నా ప్రశ్న మళ్ళీ వేశాను.

"మా చిన్నబ్బాయి కూడా అక్కడే చదువుకోవాలనుకుంటున్నాడు."

"మీరు మీ కొడుకుల కోసం వెళుతున్నారా?"

"పిల్లలకు నేను అవసరం అని కాదు. కాని నాక్కాడ ఈ ప్రాంతం మీద పూర్తి నిరాసక్తత ఏర్పడింది."

నాకైనా ఇంకేముంది ఆయన్ని అడగడానికి. చెప్పడానికి కూడా ఏమీలేదు.

"మీరెలా వున్నారు?" ఆయనడిగారు.

"నేను బావున్నాను."

"మీ భర్తతో సంబంధాలు ఇప్పుడెలా వున్నాయి?"

"ఆయనకు ప్రమాదం జరిగింది. ఇప్పుడు బాగానే వున్నారు?"

"అతని గురించి మీరే మనుకుంటున్నారు?" నేరుగా అడిగారు.

"నేనేమీ ఆలోచించడం లేదు. అతని మీద కోపం మాత్రం వచ్చింది. కాని అతడ్ని ద్వేషించలేను."

"బిడ్డను అంగీకరించాడా?"

"నా బిడ్డను నేనే పెంచి పెద్ద చేస్తాను. పెద్దయ్యాక పై చదువుల కోసం మీ దగ్గరికి అమెరికా పంపిస్తాను" నవ్వుతూ అన్నాను.

"తప్పకుండా ఇదీ నా చిరునామా. మీకు ఎప్పుడు అవసరం వచ్చినా సంప్రదించండి." కాగితంపై అక్కడి చిరునామా రాసిచ్చారు.

అప్పుడే అవతల నా గది తలుపును ఎవరో తడుతున్నచప్పుడు. ఎవరైతేనేం కాస్త వెయిట్ చేస్తార్లే అనుకున్నాను.

"మీరు నిజంగానే వెళ్ళిపోతారా?" అర్థింపుగా అన్నాను. ఎందుకోగాని నా కళ్ళనిండా నీళ్ళు నిండాయి.

ఆయన లేచి నిలబడి నా తలపైన వణుకుతున్న చేతినుంచి "మీరు సంతోషంగా ఉండాలి: ఇదీ నా ఆకాంక్ష" అన్నారు–

అప్పుడు కర్టెన్ కదిలింది. అవతల కోపంగా రాజేందర్ నిలబడి వున్నాడు. "ఆఫీసులోనే ప్రేమాయణం సాగుతోందన్నమాట. యూ బ్లడీ రాస్కెల్! ఎంత ధైర్యం నీకు?" అంటూ పిస్టల్ తీశాడు.

"నో..నో..." నేను అడ్డుకునేలోపే అతను కాల్చాడు. నేను రాజేందర్ వైపు పరుగెత్తాను. నన్ను అవతలికి తోసివేసి మరోసారి కాల్చాడు.

అమ్రిక్‌కు గుళ్ళు తగిలి పక్కన పడిపోయాడు. రాజేందర్ పిస్టల్ తీసి, జేబులో పెట్టుకున్నాడు. ఎటు మాయమయ్యాడో తెలియలేదు. "ఏమైంది సార్! ఏమైంది?" ప్యూను పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"ఏమీలేదు నువు వెళ్ళు" భుజం మీద చేత్తో నొక్కుకుంటూ అన్నారు. భుజం పైన రెండు తూటాలూ దిగినట్లుంది. భుజాన్ని వొత్తుకుంటూనే అమ్రిక్ తన స్నేహితుడైన డాక్టర్ ఫోన్ నెంబర్ ఇచ్చి ఫోన్ చెయ్యమని నాకు చెప్పారు.

ఐదు నిముషాల్లోపే డాక్టర్ వచ్చారు.

నేను కూడా కారు ఆయనతో పాటే వెళ్ళాను. డాక్టర్ అమ్రిక్‌ను తన ప్రైవేట్ క్లినిక్‌కు తీసుకెళ్ళాడు. తూటాల్ని తొలగించి కుట్లు వేశాడు. రక్తం ఎక్కించాడు. కొన్ని ఇంజెక్షన్లు కూడా చేశాడు. కొంత సేపయ్యాక అమ్రిక్‌కు ఏ ప్రమాదమూ లేదని వెల్లడించాడు.

సంఘటన ఎలా జరిగిందని డాక్టర్ నన్ను పదే పదే అడుగుతూనే వున్నాడు. "ఎవరో ఆయన మీద కాల్పులు జరిపారు" ఆయనకు చెప్పాను.

"పోలీసులకు ఈ విషయం తెలియజెయ్యాలి" ఆయన అన్నాడు. నన్ను హాస్టల్ దగ్గర డ్రాప్ చెయ్యమని అమ్రిక్ డాక్టర్‌ను అభ్యర్థించాడు. నేను అక్కడ్నించి వచ్చేముందు ఈ ఘటన గురించి ఎవరికీ చెప్పవద్దన్నాడు.

ఆ రాత్రి నాకు నిద్రే పట్టలేదు. అశాంతిగా గడిపాను. రాజేందర్ ముఖంలో కోపం, అమ్రిక్ గాయపడడం నన్ను వెంటాడుతూనే వున్నాయి. రాత్రి పొద్దుపోయే వరకు సోనాల్ గదికి రాలేదు. ఆమె ఎక్కడికి వెళ్ళిందో తెలియదు. నా గదికి గొళ్ళాలు పెట్టి వున్నాయా? లేదా అని మళ్ళీ చూశాను. రాజేందర్ కాల్పులకు అమ్రిక్ చనిపోయివుంటే? అమ్రిక్ పోలీసులకు ఏమని చెప్తాడో? ఈ ఆలోచనలు నన్ను తీవ్రమైన కలతకు గురి చేశాయి. చాలా పొద్దు పోయాక సోనాల్ తిరిగి వచ్చింది. ఒక కారు హాస్టల్ దగ్గర తనను డ్రాప్ చేసి వెళ్ళింది. నాకు పురిటి నొప్పులు... మెల్లగా మొదలై తీవ్రమయ్యాయి. నా గదిలో లైటు వెలుగుతుండడం చూసి సోనాల్ తలుపు కొట్టింది. పాలిపోయిన నా ముఖంలోకి చూసి "అంతా సవ్యంగానే వుందా?" అనడిగింది. "నాకు ఒంట్లో బాగా లేదు సోనాల్!" చెప్పాను.

"డాక్టర్‌కు ఫోన్ చెయ్యనా?"

"వద్దు. మనమే వెళ్ళాలేమో!" అని నేను చెప్పగానే తాను ప్యూన్‌ను కేకేసి టాక్సీ పిలవమంది. వాచ్‌మెన్‌ను తోడు తీసుకుని నన్ను తాను లేడి డాక్టర్ క్లినిక్‌కు తీసుకెళ్ళింది. డాక్టర్ నాకు చెకప్ చేసి అడ్మిట్ చేసుకుంది.

నాకు నొప్పులు అధికమయ్యాయి అమ్మా!...అమ్మా...! నొప్పి భరించ లేకుండా వున్నాను. నొప్పుల తీవ్రత ... భూమి పగిలి పోతున్నట్లు, మెరుపులు ఉరుముతున్నట్లు, భూకంపం వస్తున్నట్లు... భయంగా వుంది. అమ్మను తలచు

కున్నాను. ఇంజెక్షన్ చేశాక... అపస్మారక స్థితిలో కూడా రాజేందర్ పేరు తలచానని సోనాల్ చెప్పింది. పొద్దునకల్లా నెలలు నిండని బాబుకు జన్మ నిచ్చాను. నొప్పుల వల్ల బాగా అలసిపోయాను. బిడ్డ గురించి ఏమీ ఆలోచించ లేక పోయాను. నా శరీరం స్వాధీనంలో లేదు.

సాయంత్రం నేను స్పృహలోకి వచ్చాను. పక్కన నర్స్ ఏదో ఫారం పూర్తి చేస్తూ కనిపించింది. "తండ్రి పేరు?" అని అడిగింది. ఆమె వైపు అదిరిపడ్డట్లు చూశాను. "నిజానికి ఈ ఫారం ముందే పూర్తిచెయ్యాలి. మీరు బాగాలేరు. పైగా మిమ్మల్ని వెంటనే ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్ళాల్సి వచ్చింది. అందుకని అప్పుడు పూర్తి చేయలేదు. బాబు తండ్రి పేరు చెప్పండి" ఆమె మళ్ళీ అడిగింది.

ఎంతో ప్రయత్నించి శక్తినంతా కూడదీసుకుని ఇంతమాత్రం చెప్పగలిగాను. "తల్లిపేరు మాత్రం రాయండి" అన్నాను.

"తండ్రి లేడా?" ఆమె అనుమానంగా అడిగింది.

"అయితే పేరు చెప్పండి" నర్సు రెట్టించి అడిగింది.

"తండ్రి లేకుండా ఏ శిశువు వైనా వుంటాడా అసలు?" సోనాల్ పరిహాసం

"శిశువు తండ్రికి కాకుండా తల్లికి స్వంతం కాకూడదా?" సోనాల్ ప్రశ్నించింది.

"బిడ్డ తల్లిదే కాని తండ్రిపేరుతో అందరికీ పరిచయమవుతాడు కదా!" నర్సు చెప్పింది.

"ఇది తల్లి హక్కును మరొకరు లాక్కు పోవడం కాదా?"

"మేం చట్టాల్ని చేయలేదు." నర్సు నిస్సహాయంగా చెప్తోంది.

"అవును. మనం చట్టాల్ని చేయలేదు. కాని కనీసం మార్చగలం కదా!" సోనాల్ మొండిగా వాదించింది. నర్సు ఇక తన సమయం వృథా చేసుకోదలచు కోలేదేమో. డాక్టర్ దగ్గరికి వెళ్ళింది. ఆమె దగ్గర మరో ఇద్దరు నర్సులున్నారు. ఈ నర్సు వెళ్ళి వాళ్ళకేం చెప్పిందో తెలీదు గాని వాళ్ళందరూ వెంటనే ఇటు తిరిగి నా వైపు చూస్తున్నారు. వాళ్ళ చూపుల్లో ఏదో తెలియని కొత్త అహంకారం కనిపించింది. బహుశా వాళ్ళకు నాకంటే మంచి స్త్రీలం అనే అహంకారమా! కావచ్చు. బహుశా ఇందాకటి నర్సు నాకు పుట్టిన బిడ్డ అక్రమ సంతానమని, అందుకే నేను తండ్రిపేరు చెప్పడం లేదని వాళ్ళకు చెప్పివుంటుంది.

# XVI

ఈ రోజు నన్ను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. పుట్టిన బాబు చనిపోయాడు. కొన్ని గంటలు మాత్రమే బతికాడు.

నాలో కొంత భాగం వాడితో పాటే చనిపోయింది. నా వెంట ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రివారే ఎక్కడో బాబును పాతి పెట్టారు.

వాడ్ని నేనే నా కడుపులోనే పాతి పెట్టానని అనిపించింది. ఏమైతేనేం. ఈ లోకంలో లేని వాడి గురించి మాట్లాడడం ఎందుకు? మరచిపోతాను. అమ్రిక్ అమెరికా వెళ్ళిపోయాడని విన్నాను. నేను హాస్టల్‌కి వచ్చేసరికి రాజేందర్ ఉత్తరం నాకోసం ఎదురు చూస్తోంది. అతనేం రాశాడని చూశాను. "హర్‌జిత్! నిజంగా నన్ను క్షమించు. అమ్రిక్ నిన్ను నిజంగానే ప్రేమించాడు. నీ వల్లనే నన్నతడు వదిలేశాడు. లేకపోతే అరెస్ట్ చేయించి వుండేవాడు. అమ్రిక్ అంత గొప్పవ్యక్తి ప్రేమించాడంటే నీలో ఏదో వుండే వుంటుంది. అతనితోనే జీవించాలని నీవు నిర్ణయించుకుంటే నేనేమీ అనను. నిన్ను తప్పు బట్టను. లేదూ నీవు గతాన్ని మరచి, నన్ను క్షమించగలిగితే మటుకు మనం కొత్త జీవితాన్ని మొదలు పెట్టవచ్చు. నీ సమాధానం కోసం ఎదురు చూస్తుంటాను.

... ఒకప్పటి నీ రాజేందర్."

ఉత్తరాన్ని బల్లపై పెట్టాను. మందులూ, గ్లాసులో నీళ్ళు బల్లమీద పెట్టి దుప్పటి పరచుకొని పడుకున్నాను. ఏదీ ఆలోచించాలని అనిపించడం లేదు. నాకు నేను మానసికంగా చనిపోయినట్లుంది. అందుకే నేనేమీ ఆలోచించడం లేదు. సోనాల్ వచ్చి.... నా ముఖంలోని భావాలన్నీ పసిగట్టింది. "నేను చదవనా?" అంటూ ఉత్తరాన్ని చేతుల్లోకి తీసుకుంది.

"చదువు" అన్నాను.

ఉత్తరం చదవడం పూర్తి చేశాక ఆమె మౌనం వహించింది. కొంతసేపటి తర్వాత "హర్‌జిత్! ఒక మంచి మనిషిని భరించడం ఎంత కష్టమో, చెడ్డమనిషిని భరించడం కూడా అంతే. ఇంతకూ ఏం నిర్ణయించుకున్నావ్?" అంది. "నేను చాలా అలసిపోయాను సోనాల్. ఆలోచించే శక్తి కూడా లేదు" ఆమెకు నిజం చెప్పాను.

"నేను కూడా నీకు అదే చెబుదామనుకుంటున్నాను. ఏదీ ఆలోచించకు విశ్రాంతి తీసుకో. అంతే."

"సోనాల్"!

"ఏమిటి హర్‌జీత్!"

"నువ్వు ఒంటరిగా ఎలా జీవిస్తున్నావు?"

"నేను ఒంటరినికాను. నాలోని నేను నాతో వున్నాను హర్‌జీత్!"

"నీలో వున్న నీ కోసం వేరెవరూ అక్కర్లేదా?" అలసిన గొంతుతో అడిగాను.

"ఎవరో ఒకర్ని నా మనుగడకు కారకుడ్ని చేసేంత గట్టి అవసరమేదీ నాకు లేదు."

"ఇన్ని విషయాలు ఎక్కడ తెలుసుకున్నావు?"

"నీలాంటి స్త్రీలను గమనించడం ద్వారా?" సోనాల్ నవ్వింది. నవ్వుతుంటే తను ఎంత అందంగా వుంటుంది?

"నన్ను చూస్తున్నావు కదా! ఏం తెలుసుకున్నావు?"

"చీకూ చింతా లేకుండా హాయిగా బతికేసే వారి జీవితం చివరలో ఏమవుతుందో."

"అంటే!"

"జీవితాన్ని అప్రమత్తంగా, చైతన్యవంతంగా గడపలేక పోవడ మన్నమాట."

"అది సరే నువ్వే గనుక నా స్థానంలో వుండివుంటే ఏ నిర్ణయం తీసుకునే దానివి సోనాల్?" "మొట్ట మొదట నా స్థానంలో వుంటే నువ్వేం నిర్ణయం తీసుకుంటావనే మాటే అడక్కపోయేదాన్ని"

"బహుశా నువు చాలా వివేకవంతురాలివి సోనాల్."

"హర్‌జీత్! నీ బాధలన్నిటికీ మూలం నువ్వు అతి మంచి దానివి కావడమే. రెండవది నువ్వు చాలా మంచిదానివని నీకు తెలీదు. రాజేందర్‌ని, అమ్రిక్‌ని ఇద్దర్నీ నీ జీవితంలోంచి అవతలికి విసిరి పారెయ్. వాళ్ళిద్దరికీ నీవంటే యిష్టం అయితే తమ సంతోషం తమ స్వంత అవసరాలే చూసుకుంటారు. నీ సంతోషం, నీ అవసరాలు వారికి అక్కర్లేదు."

"సోనాల్...!"

"స్త్రీ దృష్టిపెడితే బోలెడు విషయాలున్నాయి. సంగీతం, సాహిత్యం,

చిత్రలేఖనం, ఇంకా మతం, రాజకీయాలు, సమాజ సేవ... ఎన్నో ఎన్నో వున్నాయి. ఈవిడ పనికి మాలింది అని అనిపించుకోకుండా తనను తాను నిలబెట్టుకోనేందుకు ప్రయత్నించాలి. ఏదో వ్యాపకం పెట్టుకోవాలి. ఒక్క మనిషిని సంతోషపెట్టడం ఘనకార్యం కాదు హర్‌జిత్. స్త్రీ తనకోసం నిర్దేశించుకున్న లక్ష్యాల్ని అధిగమించి నిలవగలదు. ఈ మార్గాలను గురించి నువు ఇకనైనా ఆలోచించు. ఈ దిశగా కనీసం ఒక్క అడుగు ముందుకు వెయ్యి. నీ శక్తి నీకే తెలియదు. ఒక రాజేందర్ గురించీ, ఒక అమ్రిక్ గురించీ మర్చిపో. గట్టిగా గుర్తు పెట్టుకో, ఒక హర్‌జిత్ వుందని. సరే, నువు విశ్రాంతి తీసుకో. ఈ విషయాల్ని మనం తర్వాత చర్చించుకుందాం. నీకు తినడానికేమైనా తెస్తాను." సోనాల్ హాస్టల్ మెస్ వైపు నడచింది.

"నీ ఉనికిని విస్మరిస్తున్నావు. జీవితంలో ఇప్పటికి సగభాగం మాత్రమే నడిచిన ఒక హర్‌జిత్ అనేది ఉందని తెలుసుకో. ఆమె ఆర్థిక స్వాతంత్ర్యాన్ని మాత్రమే సంపాదించుకుంది. మానసిక స్వాతంత్ర్యాన్ని ఇంకా సాధించవలసి వుందనీ, ఇతరుల గురించి కాక తన గురించి, విశ్వమంతటిని గురించీ ఆలోచించ వలసి వుందనీ తెలుసుకో. మానసిక స్వేచ్ఛ మాత్రమే గాక మనోస్థైర్యాన్ని కూడా ఆమె సాధించాలి. వాటి వల్ల ఆమెకు అపారమైన భావ పరిణతి లభిస్తుంది. అప్పుడు మాత్రమే స్త్రీ ఎవర్నీ బ్లాక్‌మెయిల్ చెయ్యదు. తను కూడా ఎవరిచేతా బ్లాక్‌మెయిల్‌కు గురికాదు. అప్పుడు మాత్రమే పరిపూర్ణమైన వ్యక్తిగా జీవించ గలుగుతుంది. జనం నీ గురించి ఏమంటున్నదనేది అస్సలు పట్టించుకోకు. వాళ్ళను దాటి ముందుకు నడువు. నీ గురించి నువ్వు ఆలోచించు. నీ కోసం నువ్వు ఆలోచించు.... ఆలోచించు...." సోనాల్ మాటలు మంత్రాలై నా హృదయంలో ప్రతిధ్వనించాయి.

జరిగిందంతా గుర్తు చేసుకునే ప్రయత్నం చేశాను. కాని నేనేదీ ఆలోచించ లేక పోతున్నాను. సోనాల్ కోసం ఎదురు చూడడం ప్రారంభించాను. మరునాటి సాయంత్రం సోనాల్ నా గదికి వచ్చింది. ఇంతకు ముందెప్పుడూ లేనంత ఉల్లాసంగా వుంది. తన చేతిలో కొన్ని ప్యాకెట్లు వున్నాయి.

"ఎలా వున్నావు డియర్!" నన్ను సంతోషంగా అడిగింది.

"నాకు తెలీదు నేనెలా వున్నానో" అలసట నిండిన స్వరంతో చెప్పాను.

"రేపు నువ్వు నాతో కలిసి కోర్టుకు రావాలి" నన్ను ఆదేశించింది.

"కోర్టుకా?" నేను ఆశ్చర్యంగా అడిగాను.

"రేపు...మా పెళ్ళి"

"ఎవరా ఫూల్ నిన్ను పెళ్ళి చేసుకోబోయేవాడు?"

"అతనే... నీతో నీ ఫ్రెండ్‌ను కూడా తీసుకురా! క్వాలిటీ రెస్టారెంట్‌లో లంచ్ ఇస్తాననేవాడు..."

"అంతా తెలిసీ......?"

"నేనేమిటో తెలిసే అతను అంగీకరించాడు. అతనేమిటో తెలిసే నేను ఆమోదించాను."

"వాళ్ళ కుటుంబం మీ సంబంధాన్ని ఆమోదించిందా?"

"మేం సమాజం కోసం పెళ్ళి చేసుకోవడం లేదు. మేం మా కోసం చేసుకుంటున్నాం."

"ఒక చోట కలిసి మరొక చోట విడిపోయేందుకు స్వార్థమే ప్రధానమనే ఈ వాదనను అతను నీకు వ్యతిరేకంగానే వాడుకోవచ్చు కదా! విడిచి పెట్టే విషయంలో ఎందుకు హర్‌జిత్ అంత భయపడతావు అతనికి నా అవసరం లేకపోతే, నాకూ అతని అవసరం వుండదు. రెంటిలో ఏదైనా జరగచ్చు."

"భార్యను వదిలేసే మగాడికి ఏ ఇబ్బందీ రాదు. కాని మోస పోయే స్త్రీ సంగతేమిటి సోనాల్?" అన్నాను బాధగా.

"ఆమె మోసపోయేది ఎందుకు? అతనికి తన శరీరాన్నే కాదు తన మనసును కూడా అర్పించడం వల్లనే కదా! తన తనువు, మనసులను అర్పించి తన కోసం తాను కాకుండా పురుషుడే నిర్ణయాలు తీసుకోవాలనుకుంటుంది. పరాధీన అయిన స్త్రీ పురుషుడు ఎల్లప్పుడూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకునేందుకు ప్రయత్నిస్తాడు కదా! లేకపోతే ఈమె 'వదిలివేయబడ్డ స్త్రీ' అన్న ముద్ర ఒక్క స్త్రీకే ఎందుకుంటుంది.?"

"సోనాల్! స్త్రీలు ఎందరో తిరుగుబాటు చేశారని చరిత్ర ధ్రువీకరిస్తోంది. అలాంటప్పుడు ఆమెను పరాధీనురాలని ఎలా అంటాం? ఇందుకు ఉదాహరణగా నిలిచే జానపద గాథల్లోని నాయికల మూలాలు ఈ నేలలోని సంప్రదాయాల్లోనే వున్నాయి."

"ఓ హర్‌జిత్! స్త్రీ తిరగబడింది నిజమే గాని ఆ తిరుగుబాటు ఒక పురుషుని కోసమే కావడం బాధాకరం కాదూ! స్త్రీ తనకోసం తాను తిరగబడిన ఉదంతం ఒక్కటైనా చరిత్ర చూపిస్తుందా? ఎక్కడో గార్గి వంటి కొందరు ధైర్యం చేసినా అలాంటి వాళ్ళ ప్రస్తావన ఈ చరిత్ర, ఈ సాహిత్య పుటల్లో ఎక్కడా కనిపించదు కదా!

"స్త్రీ విషయానికి వస్తే ఈ చరిత్ర, సాహిత్యం అంతా బూటకమేననా నీ ఉద్దేశం!"

"ఇదంతా పురుషుని కోణం నుంచి, అతని దృష్టితో రచించింది. స్త్రీ రాసుకున్నప్పుడే ఏది నిజమో ఏది కాదో మనకు తెలుస్తుంది."

"ఈనాడు స్త్రీలు రాస్తున్నదంతా పూర్తి సత్యమా?" ఇప్పటి వరకైతే స్త్రీలకు తమ సత్యంపై ఇంకా విశ్వాసం ఏర్పడలేదు. నేటికీ ప్రతి రచయిత్రీ తన రచనల ద్వారా సమర్థించుకునే యత్నం చేస్తోంది. స్త్రీ మనుగడను, చిన్న చిన్న ప్రేమ వ్యవహారాలను రచనల్లో సమర్థిస్తోంది. కొన్ని సార్లు జరుగుతున్న వాటన్నిటికీ సమాజాన్ని బాధ్యురాలుగా చూపిస్తోంది. లేదా ఆమె చేసింది, చేయబోయేది, చేయాలని నిర్ణయించుకున్నది చెప్పడానికి జ్యోతిషగ్రంథాలను ఆధారంగా చూపుతున్నది. ఈ విధంగా ఇతరులముందు, స్వయంగా తన దృష్టిలో ఇదే తన విజయంగా చూపిస్తోంది. అంతేగాని ఇవి స్త్రీ దృఢత్వాన్ని చూపించేవికావు."

"నీ దృష్టిలో ఏరకమైన స్త్రీ శక్తిమంతురాలు?"

"జీవితానికి అర్థం తెలిసినవారు, జీవితాన్ని అర్థవంతంగా గడపగలిగిన స్త్రీలు శక్తిమంతురాళ్ళు."

"నీ దృష్టిలో నేటి స్త్రీ నిరుపయోగంగా జీవిస్తున్నదా?"

"నేటి స్త్రీ ముందు ఒకే ఒక ఆదర్శం వుంది. ఆ ఆదర్శం పేరే 'భార్య'. ఆమె ఇంటి నుంచి బయట పాదం మోపిందంటే ఇక ఆమెను వ్యభిచారిణుల, వేశ్యల కోవలో చేరుస్తున్నారు. ఈ కారణంగా అన్నిటినీ సహిస్తున్నదే తప్ప ఆ గీత దాటలేకపోతోంది. గృహిణిగా వున్న స్త్రీకి ఉన్న మహోన్నతమైన ఆశయమల్లా ఆ ఇల్లు తన స్వంతమైతే చాలు."

"మగవాడు మాత్రం భార్యను వదిలి వేశ్యల తలుపు తడున్నాడు!"

"అందువల్ల స్త్రీ శక్తి వేశ్యను అనుకరించడంతోనే సరిపోతోంది..ప్రతి స్త్రీ

తన భర్తకు వేశ్యనే."

"వేశ్యనా?" నా మనసు చెదిరిపోయింది.

అవును పారితోశికం పొందని వేశ్య.

అలాకాకుంటే మగాడికి స్త్రీ పై గౌరవమేవుంటే ఈ తిట్టడం, లెంపకాయ కొట్టడం చేస్తాడా? ఆమె బిడ్డను లాక్కుంటాడా?, ఆమెను బయటికి గెంటేస్తాడా?"

"నీ వాదన నిజమే గాని అంతా అలాగే వుంటారని నమ్మడం కష్టం సోనాల్"

"మానసికంగా, శారీరకంగా శతాబ్దాలుగా బానిసగా చూడబడుతూ ఉన్నందుకు స్త్రీ స్వేచ్ఛగా ఆలోచించే శక్తి గంగపాలవుతోంది. ఆఖరికి ఆమె సాటి స్త్రీ స్వేచ్ఛాయుత ఆలోచనా విధానాన్ని కూడా స్వాగతించలేకపోతోంది."

"పెళ్ళి చేసుకోవడం, విడిపోవడం అనేవి విచ్చల విడిగావున్న పాశ్చాత్య సమాజంలోని స్త్రీల సంగతేమిటి సోనాల్?"

"పాశ్చాత్య వనిత పెళ్ళి చేసుకునేదే మంచి భర్తకోసం, మంచి కాపురం కోసం. విడిపోయిందంటే కూడా మంచి భర్తను, కాపురాన్ని అన్వేషించడం కోసమే. అసలు పాశ్చాత్య స్త్రీ జీవితానికి స్ఫూర్తి ప్రదాతలెవరూ లేరు."

"నీ స్ఫూర్తి ప్రదాత ఎవరు సోనాల్?" ఆమె మాటలకు నేను విసుక్కుంటూ అన్నాను.

"కనీసం నేనొక ఆదర్శంకోసం అన్వేషిస్తున్నాను."

"నీవు పెళ్ళాడబోయే ఆయనకు ఇదంతా తెలుసా?"

"అతనికి ఇప్పుడు తెలియకపోతే అతి త్వరలో తెలుసుకుంటాడు."

"అతను దీన్ని అంగీకరించకపోతే!"

"అంగీకరించపోతే నన్ను కోల్పోతాడు".

"ఏ పురుషునికీ ఏ స్త్రీ కూడా ముఖ్యం కాదు సోనాల్!"

"పురుషునికి స్త్రీ ముఖ్యం కాకపోయినప్పుడు స్త్రీకి పురుషుడు ఎందుకంత ముఖ్యం కావాలి?"

"పెళ్ళి తర్వాత నువ్వు ఇదంతా అర్థం చేసుకుంటావు?"

"నీ లాగా నేను పిరికిదాన్ని కాను హర్‌జిత్!" సోనాల్ నవ్వుతూ వుంది.

నేనొక పిరికిదాన్నేనా? నేను రాజేందర్ గురించి చాలాకాలంగా ఆలోచిస్తూ

ఉన్నాను. ఆ ఇంటిని గురించి ఆలోచిస్తున్నాను. నాక్కూడా కాస్తో కూస్తో ఉందనుకున్న మా భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నాను. నేను చాలా అలసి పోయాను. ఏమీ ఆలోచించకుండా జీవించడం ఎంత సులభం.

నేను సోనాల్ గురించి దిగులుపడుతున్నాను. ఆమెను ఎవరు చేపడతారు? నేను అమ్రిక్‌ను గురించి ఆలోచిస్తున్నాను.

ఆఫీసులో అతని గది నా గది పక్క పక్కనే వుండేవి. అయినా ఆ గది ఇటు రాలేకపోయింది. ఈ గది అటు వెళ్ళ లేకపోయింది. రెండింటికీ సరిహద్దులు ఉండిపోయాయి. రెంటికీ మధ్య గోడ నిలిచివుంది.

కాంక్రీటు, సిమెంటు గోడలోంచి కూడా నేను చూడగలనని భావించిన రోజులున్నాయి. అందువల్లనే ఒకనాడు ఆయన పనిచేయకుండా ఉన్నాడనో, కొన్నిసార్లు పై కప్పుకేసి చూస్తూ వున్నాడనో, కొన్నిసార్లు చేతులు నలుపు కుంటున్నాడనో, కొన్నిసార్లు, ఫైళ్ళు తెరిచాడనో, మూశాడనో, కొన్నిసార్లు కాళ్ళకు షూస్ విప్పాడనో, మళ్ళీ వేసుకున్నాడనో నాకు తెలిసేది. కొన్నిసార్లు ంంగా ఉంటూ, పేపర్‌వెయిట్ చేతిలోకి తీసుకుని తిప్పుతూ, సన్నగా ఈల వేస్తూ, కుర్చీలో కూర్చుంటూ గోడ చరుస్తూ కాళ్ళతో నేలను తడుతూ ఉండేవాడు.

అలాంటి సందర్భాల్లో ఏ చప్పుడు చేస్తే అతను ఉలిక్కిపడతాడోనని ఎంతో జాగ్రత్తగా ఉండేదాన్ని ఆ రోజుల్లో.... ఓ పందేళ్ళకిందట ఆ గదిలో ఎవరుండేవారు, లేదా వందేళ్ళ తర్వాత అతని గదిలో, నా గదిలో ఎవరుంటారు? ఆక్రమిస్తారు? ఇంత మాత్రానికి జనం ఎందుకు పుడతారు? ఎందుకు చస్తారు? అంటూ ఏవో పిచ్చి పిచ్చి ఆలోచనలు వచ్చేవి.

ఇవాళ వందేళ్ళు గడవనే లేదు. కనీసం అందులో సగం కూడా గడవలేదు. ఆఖరుకు ఐదేళ్ళు కూడా కాలేదు. కాని ఇప్పుడు పక్కగది అమ్రిక్‌ది కాదు. వేరెవరో కూర్చుంటున్నారందులో. అంతెందుకు నా గదిలో నేనే కూర్చుంటున్నా ఇది ఇప్పుడు నాది కాదనిపిస్తోంది.

* * *

# వజ్రపు ముక్కుపుడక

కిరణ్ తన స్నేహితురాలి వివాహానికి వెళ్ళేందుకు డ్రస్ చేసుకోవడానికి వెళ్ళింది. ఆమె లేత గులాబీ రంగు డ్రస్ వేసుకొని, మ్యాచింగ్ రంగు లిప్‌స్టిక్ రాసుకుని, బంగారు అంచు చున్‌రీ, వజ్రపు ముక్కుపుడక, ముత్యాల చెవి రింగులు వేసుకుంది. పూజగదిలోకి వెళ్ళి అగరువత్తులు వెలిగించి వచ్చిన కిరణ్ అందంగా నవయువతిలా ముస్తాబై రావడం చూసి ఆమె తల్లి కాస్త కంగారు పడింది. తన మనస్సులోని భావాలను ఎలా చెప్పాలో ఆమెకు తెలియలేదు.

కారులో కూర్చున్న కిరణ్ పర్సులోంచి చిన్న అద్దాన్ని తీసి కర్చీఫ్ అంచుతో ఒకసారి కళ్ళ కాటుకను అద్దుకుంది. అద్దంలో తనను తాను చూసుకున్న కిరణ్‌కు తన ముఖం మసకగా కనిపించింది. వెళ్లేది శరణ్‌జిత్ పెళ్ళి ఆ రోజు గురుగ్రంథ్ సాహిబ్ ముందు ఒక సైనికాధికారి తన పల్లా (పెళ్ళి సమయం వధువు కొనకొంగు)ను పట్టుకోవడం, ఆ రోజు తనూ నాలుగుసార్లు అతనితో కలిసి ప్రదక్షిణ చేయడం గుర్తొచ్చింది. తన జీవిత పర్యంతం తోడుగా నిలుస్తానని ప్రమాణం చేశాడు. కాని నేడు ఆ దృశ్యం కరిగిపోయిన కలలా వుంది.

ఆ రోజు తన పెళ్ళికి చాలా మంది వచ్చారు. పెద్ద ఎత్తున ఆటపాటలతో సంబరంగా జరిగింది. అప్పగింతలప్పుడు ఆమె తాతయ్య ఎంతో ప్రేమగా తల మీద చేయివుంచి కన్నీళ్ళు కార్చాడు. తాతయ్య ఏడ్వడం అంతకు ముందెప్పుడూ ఆమె చూడలేదు. ఆ రోజు కారులో అత్తవారింటికి వెళ్ళేప్పుడు కూడా కిరణ్ తలవంచుకొనే కూర్చుంది. అలా మెడ నొప్పి పెట్టే దాకా వంచుకొనే వుంది. ఎప్పుడైనా తలెత్తితే తన భర్త – సైనికాధికారి తన వైపే చూస్తుంటాడు. ఆయన చూపు తట్టుకోలేక పోయింది తను.

మార్గ మధ్యంలో టీ తాగేందుకు ఆగారు. భిక్షగత్తె వచ్చి దీవెనలందిస్తూ ఏవో చెప్తోంది. ఆయన పది రూపాయల నోటు ఇచ్చారు. ఆ భిక్షగత్తె ఆశ్చర్యానికి అంతే లేదు. "మీరిద్దరూ చల్లగా వుండండి. మీ కాపురంలో పాలు పొంగాలి.

శీఘ్రమే దేవుడు కుమారుడ్ని ప్రసాదించాలి" అంటూ మళ్ళీ దీవిస్తూ వెళ్ళి పోయింది.

లుధియానా వంతెనపై కారు మళ్ళీ ఆగింది. అటుగా ఒక శవయాత్ర సాగుతుండడం వల్ల ఆ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. కారులో తనకు తోడుగా వస్తున్న మంగలావిడ ఇటు తన వైపు కూర్చుంది. ఆయన కజిన్ ముందు సీట్లో కూర్చున్నారు. ఆ సైనికాధికారి కిరణ్‌జిత్ భుజాల మీదనుంచి చేయి వేసి ఆమెను తనవైపు అదుముకున్నాడు.

కిరణ్‌కు ఇంకా బాగా గుర్తుంది. ఆరోజు తక్కువ వ్యవధిలో చాలా ఎక్కువ దూరం ప్రయాణించారు. పెళ్లి బృందం అధికారి ఇంటికి చేరేటప్పటికి అప్పటికే అంతలో యుద్ధం మొదలైంది. వెంటనే విధుల్లో చేరాలని సైనికాధికారికి తంతి వచ్చింది.

ఆ రాత్రి తేజ్‌వంత్‌సింగ్ హుటాహుటిన తయారై రాత్రి తొమ్మిదిన్నర రైలుకు బయలుదేరి వెళ్ళాడు. అతని బంధువులు, స్నేహితులు, నవవధువు స్టేషన్ వరకూ వెళ్ళి వీడుకోలు పలికారు. తల్లి కుమారుడ్ని హత్తుకొని కన్నీరు కార్చింది. తండ్రి కూడా కుమారుడ్ని భుజం తట్టి కరచాలనం చేశాడు. స్నేహితులందరితోనూ కరచాలనం చేశాక ఆయన కిరణ్‌జిత్ వద్దకు వచ్చాడు. "నేను త్వరగానే తిరిగివస్తాను" అంటూ ఆమె రెండు భుజాలపై చేతులుంచాడు.

త్వరగా తిరిగి వస్తానన్నవాడు ఎన్నటికీ తిరిగిరాని లోకాలకు తరలి పోయాడు. యుద్ధరంగంలో అమరుడయ్యాడు. దాంతో రాత్రికి రాత్రే పరిస్థితి మారింది. ఆటపాటలు, కేరింతలు, ఉత్సవాలు, ఉత్సాహాల స్థానంలో ఏడుపులు, గుండెలు బాదుకోవడాలు చోటు చేసుకున్నాయి.

కిరణ్‌జిత్ పెళ్ళి, దాంతో పాటే భర్త మరణం ఒక పీడకలగా గడిచింది. ఆమె తన గాజులు పగలకొట్టుకో లేదు. ముక్కుకున్న ముక్కుపుడకనూ అలాగే వుంచేసుకుంది. వాటిని తీసెయ్యమని వారు ఆమెను అడిగిందీ లేదు. కిరణ్‌కు బాధ కలిగించిన విషయమల్లా తండ్రి ఇప్పుడు చేతికర్ర సహాయంతో ఉదయం నడకకు వెళుతున్నారు.

"అమ్మా! శరణ్‌జిత్ అన్న ఆమెకు అమెరికానుంచి చాలా మంచి చీరలు తెచ్చాడు. నేను కూడా ఆయనకు డబ్బులిచ్చి అక్కడికి వెళ్ళాక నాక్కూడా చీరలు

పంపమని చెప్తాను." అంటూనే కిరణ్ తల్లికి దువ్వెనను అందించి ఆమె ముందు కూర్చుంది తల దువ్వించుకోడానికన్నట్లుగా.

తల్లి మౌనంగా ఉండిపోయింది.

పక్షుల గుంపు ఆకాశంలో గిరికీలు కొడుతోంది. నలుపు తెలుపు రంగులు కలిగిన ఒక పక్షి ఎగురుతూ వచ్చి కిటికీపై వాలింది. రెండు కాళ్ళూ ఆనించి పరిస్థితి చూద్దానికి నిలుచుందా అనిపించింది. "అమ్మా ఈ పక్షిని కిరణ్ అని పిలుస్తానమ్మా" కిరణ్ నవ్వింది.

"నువ్వీ సువాసన తైలం వాడకూడదమ్మా" ఆమె తల్లి చెప్పింది, తల దువ్వుతూ

"పోమ్మా! నువ్వు బొత్తిగా వెనుకటి మనిషిలా మాట్లాడుతున్నావు. నువ్వు సువాసన అంటే నాకొకటి గుర్తొచ్చింది. ఈసారి ఆంటీని చూడడానికి నువ్వు లక్నో వెళ్ళినప్పుడు మల్లెపూల పరిమళం కలిగిన పర్‌ఫ్యూమ్ తీసుకురావడం మరచిపోకు. అక్కడ అద్భుతమైన పర్‌ఫ్యూమ్‌లు తయారవుతాయట."

"చాల్లే వేళాకోళం. నువ్వు చెప్పేది, చేసేదీ జాగ్రత్తగా ఆలోచించి ఏది చెయ్యాలో ఏది చెయ్యకూడదో నిర్ణయించుకో" అంటూ మోకాళ్ళ వరకు వేళ్ళాడుతున్న జుట్టును నేర్పుగా ఒడిసిపట్టి జడఅల్లుతూ అంది అమ్మ.

"పూర్వజన్మలో నువ్వెవరివో తెలుసా అమ్మా! నెమరువేస్తూ దూడకు పాలిచ్చే గోమాతవు అలా అంటే నీకిష్టమేనా?"

"నువ్వు అన్నది నిజమే. కాని ఒక్క పొరపాటు దొర్లింది. నువ్వు చెప్పిన ఆ గోమాత నేను కాదు. బామ్మ."

జడ వేయడం పూర్తి చేసి దువ్వెన తిరిగి కిరణ్ చేతిలో పెట్టింది అమ్మ.

"నీకూ బామ్మకు పోలికే లేదు. ఆమెకు 60 ఏళ్ళు దాటినా తాతయ్య ఆమె చుట్టే తిరుగుతుంటారు. ఈ వయసులో కూడా అందమైన నగిషీ చెప్పులే వేసుకుంటుంది. ప్రతిరోజు రాత్రి స్నానం చేస్తుంది. పడుకునే ముందు బట్టలు మార్చుకుంటుంది."

ఇంతలో "ఆంటీ, లోపలికి రావచ్చా?" పొరుగింటి చిన్నబ్బాయి బింటూ తలుపుతోసుకుని వచ్చాడు.

"నువ్వా బింటూ! రా లోపలికి" కిరణ్‌జిత్ ఆదరంగా పిలిచింది.

"నీకోసం పువ్వు తీసుకొచ్చాను" బింటూ పెద్ద గులాబీని అందించాడు.

"థాంక్‌యూ! ఓ థాంక్‌యూ!" కిరణ్‌జిత్ అబ్బాయి తలమీద చేయి వేసింది. "నీ తల్లో పెట్టుకో" బింటూ అన్నాడు.

కిరణ్‌జిత్ పువ్వును తల్లో పెట్టుకుంది. అది చూసిన తల్లి కనుబొమలు పైకి వెళ్ళాయి. కాని ఏమీ అనలేదు.

"ఆంటీ దాగుడు మూతలాడుకుందామా!" బింటూ అడిగాడు.

మరుక్షణం మొదలు పెట్టారు. నవ్వుతూ, కేరింతలు కొడుతూ ఒకరి నొకరు వెంటాడుతూ ఇంట్లో స్తంభాలు, బల్లలు, కుర్చీల చుట్టూ తిరుగుతూ మధ్యలో పరుగెడుతూ ఆడారు.

"ఈ పిల్ల వైనం అంతుపట్టడం లేదు." అంటూ కిరణ్ వాళ్ళమ్మ బియ్యం కడుగుతూ కూర్చుంది.

వాళ్ళ నాన్న దూరంగా కూర్చుని పేపరు చదువుతూ తలయెత్తి చూశారు. ఆయన హావభావాలు చూసి ఇంతకూ ఆయన వాళ్ళమ్మాయి చేష్టల్ని చూసి ఆనందిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా అన్నది మాత్రం తెలుసుకోవడం చాలా కష్టం.

అవతల గోడపై కాకి కావు కావుమని అరుస్తోంది. సీజన్ మారుతోంది. వేసవి తీవ్ర ప్రభావాన్ని చూపి తన ప్రతాపాన్ని మెల్లగా తగ్గిస్తోంది.

కిరణ్‌జిత్‌కు ఢిల్లీ నుంచి ఆధికారిక లేఖ వచ్చింది. అక్కడ జరిగే కార్యక్రమంలో ఆమెకు పతకం ప్రదానం చేయనున్నట్లు తెలియజేస్తూ అక్కడికి ఆమెను ఆహ్వానించారు.

"తెల్లటి చీర కట్టుకుని వెళ్ళు" అంది కిరణ్ వాళ్ళమ్మ. కాని ఆమెకు తెల్ల చీర లేదు.

"కొత్తది కొనుక్కో" అమ్మ సలహా ఇచ్చింది.

"నాకు అలాంటి కపట నాటకాలపై విశ్వాసం లేదు."

"ఇది కపట నాటకం కాదు. దేవుడు, ఈ లోకులు చూస్తున్నారని మరచిపోకు" అంది.

ఆమూలాగ్రం మీ కుటుంబం సంగతి తెలుసు. ఛాందసానికి పెట్టింది పేరు అంది.

ఆమె తల్లి కోపగించుకుంటూ కారపు పచ్చడి తయారు చేసే పనిలో నిమగ్నమైంది.

కిరణ్‌జిత్ తన కాళ్ళు శుభ్రం చేసుకుంది. పాదాలకు క్రీము రాసుకుని గోళ్ళకు నేచురల్ నెయిల్ పాలిష్ వేసింది. నీలిరంగు చీర కట్టుకుంది. నీలిరంగు అనంతత్వానికి ప్రతీక. దానికి తోడు వజ్రపు ముక్కుపుడక చూడచక్కగా అమరింది.

కిరణ్ ఢిల్లీ బయలు దేరింది. నాన్న ఆమె వెంట బయలుదేరారు. మరణానంతరం పతకాలు, ఆర్థిక సహాయాలు, కుట్టమిషన్లు వంటివి అందుకోవలసిన వారి భార్యలు కూర్చున్న వరుసలో కిరణ్ ఆసీనురాలైంది. ఆమె పేరు పిలిచారు "శ్రీమతి కిరణ్‌జిత్ తేజ్‌వంత్ సింగ్ గిల్!" అని.

ఆమె తన సీట్లోంచి లేవలేదు. రెండుసార్లు పిలిచారు. ఇక అది చివరిసారి "శ్రీమతి కిరణ్‌జిత్ తేజ్‌వంత్ సింగ్ గిల్!"

ఆమె చటుక్కున లేచి వేదికపైకి వెళ్ళి పతకాన్ని అందుకుంది. పతకాన్ని అందుకుంటున్నప్పుడు ఇతర స్త్రీలలా ఆమె ఏడవలేదు.

రాష్ట్రపతి ఆ విషయాన్ని తను ప్రసంగంలో ప్రస్తావించారు. "మన సైనికులు తమ దేశంకోసం రక్తతర్పణం చేశారు. వారు మరణించలేదు. అమరజీవులయ్యారు. వారికోసం మనం దుఃఖించకూడదు. శ్రీమతి తేజ్‌వంత్ సింగ్ దుఃఖించకుండా మనకు ఆదర్శప్రాయంగా నిలిచింది" అన్నారు.

కిరణ్ మనసులో అనుకుంది అది నిజం కాదని. వేదికమీద ఫ్యాన్‌గాలికి ఎగిరిన రాష్ట్రపతి జుట్టు దీనికి తార్కాణంగా నిలుస్తోంది. ముఖం కప్పుకుని పతకం స్వీకరించేందుకు ఒక మహిళ రాష్ట్రపతి వైపు వెళుతోంది. ఆమె పైజామా బొందు కంపిస్తోంది అదృశ్యం చూసిన కిరణ్ అతి కష్టంమీద నవ్వు ఆపుకుంది.

రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్న పతకాన్ని కిరణ్ కొడుకుని తలచుకొని ఏడుస్తున్న తేజ్‌వంత్ అమ్మగారికి అందజేసింది.

పన్నెండో తరగతి తప్పిన తేజ్‌వంత్ తమ్ముడు తల్లి దగ్గరున్నాడు. కిరణ్ అతని వైపు చూసింది. ఈ అబ్బాయికి అన్నీ తేజ్‌వంత్ పోలికలే. అన్నీ అన్న హావభావాలే.

"పెళ్ళికి నువ్వు తప్పక రావాలి" తేజ్‌వంత్ తల్లి కిరణ్‌జిత్ వైపు చూస్తుంది.

ఇటు వేపు తిరిగి కొడుకు వేపు చూస్తూ, "గుర్‌బచన్ పెళ్ళి బడ్డోవల్ కుటుంబంతో ఖాయం చేశాం." అంది. ఆ మాటలకు కిరణ్ జవాబివ్వలేదు. అత్తగారు ఇదంతా తనకు ఎందుకు చెబుతున్నదో తెలుసు.

"వెళదాం పదమ్మా!" అని తండ్రి అనడంతో కిరణ్ పతకాల ప్రదానోత్సవ ప్రాంగణం నుంచి ఇవతలికి నడిచింది. అత్తగారు నిలబడే వుంది. కనుమరుగు అయ్యేదాకా ఆమెనే చూస్తోంది.

ఈ కార్యక్రమం జరిగి మూడురోజులయింది. కిరణ్ తన జాకెట్ కుట్టుకోవడంతో నిమగ్నమై వుండగా బామ్మ అప్పుడే గుర్రపు బండి దిగి ఇంట్లోకి అడుగు పెడుతోంది. ఆమె వెంట బండివాడు తలమీద రేకు పెట్టె స్వీట్లడబ్బా మోసుకుంటూ వచ్చాడు.

కిరణ్ తలపై చేయివేసి ఆశీస్సులందించింది. అమ్మ బామ్మ కాళ్ళకు నమస్కరించింది.

నీ ఫోటో పత్రికలో చూశాను. మీ తాతయ్య మలావుత్ నుంచి పత్రిక తీసుకొచ్చాడు. నీవు పతకాన్ని అందుకున్నావని ఆయన చెప్పారు. వాళ్ళు కొంత డబ్బేమన్నా ఇచ్చారా? మన వూళ్ళో బచనా భార్యకు 500 రూపాయ లిచ్చారు. మనిషే పోయాక డబ్బెంతిస్తే ఏముందిలే! లక్షరూపాయలు ఇచ్చినా ప్రాణాన్ని వెనక్కి తేలేం కదా! అయినా మంచి కోసం ప్రాణాలివ్వడం మంచి సంగతే కదా!" అంది బామ్మ .

"ఏ బచనూ? నిహాల్ కౌర్ కొడుకేనా?" కిరణ్‌జిత్ తల్లి అడిగింది.

"అవును అతనే". బామ్మ సమాధానం. అతను రెండేళ్ళ కిందటే పెళ్ళి చేసుకున్నాడు. వాళ్ళకు పిల్లలు కలగలేదు. జాట్ కుమార్తె సిబో అందాన్ని చూసి ముచ్చట పడ్డాడు. గత శీతాకాలంలో సెలవుపై వచ్చినప్పుడు ఆస్తిలో తన వాటా పంచుకున్నాడు. అలా వచ్చిన ఆస్తిని సిబో పేరు మీద చేశాడు. తన అన్న ఇందర్ భార్య ధన్‌కౌర్ నుంచి ఇబ్బందులు వస్తాయని ఊహించాడు. సిబోతో కొట్లాటకు దిగి, పీడించి ఆమెకు కష్టాలు కలిగిస్తుందని భావించాడు. అదే నిజమైంది. సిబో బాధలు చూడలేని పరిస్థితి ఏర్పడింది."

"ఆమె తండ్రి ఆమెను ఇంకెక్కడో పెట్టవచ్చుకదా!" కిరణ్‌జిత్ తల్లి అంది.

"బచనా కూడా ధనాశ చూపే సిబోను పెళ్ళి చేసుకున్నాడు" అని కూడా

వెల్లడించింది.

"అదే సిబో కున్న దిగులు. ఇందర్ భార్య కయ్యానికి సిద్ధమవుతుంది. చెల్లీ! మనం కలిసుందాం. కష్టా సుఖాలు పంచుకుందాం అని సిబోతో అనొచ్చు కదా! అబ్బే ఎందుకంటుంది? ఇందర్‌నుబుట్టలో చేసుకుంటుందని భయం పీడిస్తోందే! నీకు కొడుకులు, కూతుళ్ళు వున్నారు. ఇంకేం కావాలి? ప్రశాంతంగా దైవాన్ని తలచుకొంటూ వుండొచ్చుగదా! అని బామ్మ అంది. అని తన భర్తను మరో స్త్రీ ఎగరేసుకు పోవడానికి ఎందుకొప్పుకుంటుంది? కిరణ్ ప్రశ్న.

"సిబోను మెచ్చుకోవాలి. ఇందర్ తన గడపతొక్కడానికి వీల్లేదని గట్టిగా అంది. తానూ వాళ్ళింట్లో అడుగుపెట్టనని చెప్పింది. ధన్‌కౌర్ తనను ఊరి నుంచి పంపించేయకుండా అడ్డుకోవాలన్నది సిబో ఉద్దేశం. తన కొడుకుల్లో ఒకర్నిస్తే తాను ఆ బిడ్డను పెంచి పెద్ద చేస్తుందని, ఆ బిడ్డ తనకు వృద్ధాప్యంలో ఆధారంగా నిలుస్తాడని ఆశించింది. తన బిడ్డను సిబోకు ఇస్తే తనకు ముందు ముందు కలగబోయే లాభాలను తలబిరుసు ధన్‌కౌర్ గ్రహించలేకపోయింది. సిబో ఎలాగైన ఊరువిడిచి వెళ్ళిపోవాలని పట్టుదల. ఎక్కడికి వెళుతుందో, తనకు సంబంధం లేదంటుంది."

బామ్మ చెప్పేది తదేకంగా వింటున్న కిరణ్‌జిత్ కుట్టులో తడబడింది.

"మీ అత్తామామలు ఢిల్లీ వెళ్లారా?" బామ్మ కిరణ్‌ను అడిగింది.

కిరణ్ జవాబివ్వలేదు.

"ఇచ్చే నగదు ఎక్కువ కాదు కాని ఆ సత్కారం చాలా గొప్ప గౌరవం" బామ్మ అంది.

"ఇంతకూ బచనా భార్య ఏమైంది?" కిరణ్ అడిగింది.

"ఏముంది. అది దురదృష్టవంతురాలు తండ్రి. ఆమెను వేరెవరికో వెయ్యి రూపాయలకు అమ్మేశాడు. దాంతో నెలవారీ పింఛను 15 రూపాయలు కూడా ఆగిపోయింది. ఆమె ఊరు విడిచి వెళ్ళిపోయిందని గ్రామ పెద్ద ప్రభుత్వానికి సమాచారం పంపాడు. అతను ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇవ్వలేదు కదా!"

"కొద్దిగా టీ తీసుకోండి" కిరణ్ వాళ్ళమ్మ కప్పులో టీ పోసుకొచ్చి బామ్మ చేతికి అందించింది.

"బామ్మ కప్పు చేతికి అందుకుంటూ కిరణ్‌కు కూడా టీ ఇవ్వు?" అంది
"నాకు వద్దు" కిరణ్ వారించింది.

"బామ్మా! పంచమి నాటి పుణ్యస్నానానికి వచ్చావా?" అడిగింది.

"లేదు...లేదు... అవునూ, మీ తాతయ్య కూడా ఇదే సలహా ఇచ్చారు. మీరు మీ పిన్ని చిన్నబ్బాయిని దత్తత చేసుకోవాలని ఆయన ఉద్దేశ్యం. భవిష్యత్తులో అబ్బాయి మీకు ఆసరాగా వుంటాడు. అబ్బాయి ముందు ముందు బాగా పనికివచ్చేవాడు. ఎంతయినా మన కండ మన రక్తం కదా అన్నారు. కాని మీ రసలు వినిపించుకోవడం లేదు కదా!"

పెద్దావిడ టీ తాగుతూనే కిరణ్ వాళ్ళమ్మ ఎవర్నయినా దత్తత చేసుకొనే విషయంలో ఎన్ని అవకాశాలు వచ్చినా వినియోగించుకోలేక పోయిందని అంది. ఇప్పటికైనా మించి పోయింది లేదు. ఆమె తన ఇష్టప్రకారం తన అన్నతమ్ముళ్ళ పిల్లల్లో ఒకర్ని దత్తత తీసుకోవచ్చు ఎప్పుడైనా అంది.

"అయినా నేనింకా బతికేవున్నాను" గొంతులో కాఠిన్యం ధ్వనింపజేయకుండానే అంది కిరణ్ "నేను చచ్చిపోవడానికి ఇంకా సమయం ఉంది."

"నువ్వు బతికి వున్నా లేనట్లే లెక్క. దేవుని సంకల్పం కూడా ఇదే. కాకులు, కుక్కల నుంచి నిన్ను రక్షించాల్సి వుంటుంది కదా!

"ఇంకేదైనా మాట్లాడుకుందాం. తీజ్ పండగ వచ్చేస్తోంది. నాకేం కానుక ఇవ్వబోతున్నావు?" కిరణ్ నవ్వింది.

"అడుగు. వస్తాయి. కాని ఏమడుగుతావు? జీవితంలో అన్ని శుభాలను ఆ దేవుడే నీకు లేకుండా చేశాడు. దైవ ఘటనను కాదనేవారెవరు?"

"నేనడిగే వస్తువులకు దేవునితో సంబంధంలేదు. నా కుర్తా కోసం ఒక బంగారు గొలుసు కొనివ్వండి" కిరణ్ తాను కుట్టిన జాకెట్‌ను మడత పెట్టింది. బామ్మ గట్టిగా నిట్టూర్పు విడుస్తూ చాలాసేపటి వరకు కిరణ్ వైపే చూస్తుండి పోయింది. తర్వాత తన నశ్యండబ్బి తీసి రెండు వేళ్ళలో నశ్యం తీసుకుని పీల్చుకుంది.

తనకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛను మొత్తాన్ని కిరణ్ తన భర్త తల్లిదండ్రులకే దఖలు పరచింది. తాను ఏదో విధంగా జీవించగలదు.

పాఠశాలలు, కళాశాలల్ని వేసవి సెలవుల కోసం మూసి వేశారు. గత

వేసవి సెలవుల్లోనే తన పెళ్ళి జరిగింది. అదే సెలవుల్లో భర్త చనిపోయాడు.

ఈ వేసవి సెలవుల తర్వాత కిరణ్ తిరిగి పుస్తకాలు చంకన బెట్టుకొని కళాశాలకు వెళుతోంది. కళాశాలలో కూడా గోడలకు రంగువేయడం తప్ప పెద్ద మార్పులేవీ రాలేదు. మెయిన్ గేటుకున్న కర్రవూచల్ని తీసివేసి ఇనుప వూచల్ని బిగించారు.

కిరణ్ తోటి విద్యార్థులు ఇప్పుడు ఆమె కంటే ఒక ఏడాది ముందుకు వెళ్ళారు. కాని కిరణ్‌కు మాత్రం తాను ఎన్నో ఏళ్ళు వెనుకబడ్డాననిపిస్తోంది. తన స్నేహితులు గాని, పరిచితులుగాని తన పెళ్ళి సందర్భంగా శుభాకాంక్ష లందించడానికీ, తేజ్‌వంత్ మరణించాక సాంత్వన వచనాలు పలకడానికి ఎవరూ ముందుకు రాలేదు. దానర్థం కిరణ్‌కు ఏంజరిగిందీ వాళ్ళకు తెలియదని కాదు.

ముక్కుపుడక ఆమె ముక్కుకు ఎంతో అందంగా కనిపిస్తోంది. రెండేళ్ళు గడిచాయి.

కిరణ్‌జిత్ ఎం.ఎ. పూర్తి చేసి తన పాత కళాశాలలోనే బోధన చేస్తోంది ఒకరోజు తన ఆదాయపన్ను పత్రాలు పూర్తి చేస్తుండగా అందులో వివాహితా, అవివాహితా, పిల్లలెందరనే వివరాల్ని రాయవలసి వచ్చింది. కిరణ్ వివాహిత అనే రాసింది. మళ్ళీ కొట్టివేసింది. అలా చేయడం తప్పుడు సమాచారం ఇచ్చినట్లవుతుందని భావించింది.

"ఏమని రాయను?" తన సహాధ్యాపకుడు ప్రొఫెసర్ అవతార్‌ను సలహా అడిగింది. ఆయన ఒకప్పుడు ఆమెకు అధ్యాపకుడు కూడా.

"నువ్వు ఏదైనా వేరే దేశానికి వలసపోవడం మంచిది" అవతార్ సలహా.

"ముక్కోటి దేవతలున్న ఈ నేలలో నా ఒక్కదానికే స్థానం లేదా?"

"దేవతల నేలలో ఏమనిషైనా తన అవకాశం కోసం వేచి వుండడం కష్టం"

ఇక ఈ అంశాన్ని కిరణ్ కొనసాగించలేదు.

"నీ ముఖంలోకి చూస్తే నాకు భయమేసింది. ఇక్కడి స్త్రీ వధ్యశిలపై నిలుచుని తనను తాను బలి ఇవ్వడానికి సిద్ధంగా వున్నట్లనిపిస్తుంది నాకు."

కిరణ్‌జిత్ మౌనంగానే వుంది. భారీగా, ఎత్తుగావున్న అవతార్‌ను చూస్తుంటే నానక్‌సింగ్ నవల్లోని పాత్ర నడచివచ్చి తన పక్కన కూర్చుందా అన్నట్లుంది.

"మీరు పెళ్ళెందుకు చేసుకోరు?"

"అవును. అదో ప్రశ్న. పెళ్ళెవర్ని చేసుకోవాలి? ఇది చెప్పుకోవడానికి మంచి విషయమేమీ కాదు. కాని భూకంపం వచ్చి నా పిల్లల్ని నా భార్యనీ, అందర్నీ చంపేస్తుందని కొన్నిసార్లనిపిస్తుంది."

కిరణ్‌జిత్ నవ్వింది.

పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ కలియా ఆ దారిన వెళుతూ కిరణ్‌జిత్ దృష్టిలో పడకుండా అవతార్‌ని మాత్రం చూసి అర్థవంతంగా నవ్వుతూ వెళ్ళిపోయాడు.

అంతలో కాలేజ్ ప్యూన్ వచ్చి "మేమ్‌సాబ్, మిమ్మల్ని ప్రిన్స్‌పాల్ గారు పిలుస్తున్నారు" అన్నాడు.

స్టాఫ్‌రూములో ఆ చివర్న కూర్చున్న సంస్కృతం ప్రొఫెసర్ ఏదో చదువుతున్నట్లు నటిస్తూ ఇటువైపు వాళ్ళ మాటలు వింటోంది.

"కాశ్మీర్ యాత్రకోసం వెళ్ళుతున్న విద్యార్థులు తమ వెంట తోడుగా ఉండాలని కోరుతున్నారు. మీరేమైనా వెళ్ళగలరా. ఈ విషయం అడగడానికే మిమ్మల్ని పిలిచాను." ప్రిన్స్‌పాల్ అన్నారు.

"మీరు వెళ్ళమంటే వెళతాను."

"ఈ బృందంలో కొందరు విద్యార్థినులున్నారు. ప్రొఫెసర్ అవతార్ అందర్నీ చక్కగా తీసుకెళ్ళగలరు. కాని అమ్మాయిలవెంట ఒక లేడీ ప్రొఫెసర్ వుంటే బావుంటుందని అనుకుంటున్నాం."

కాశ్మీర్‌లో కిరణ్ మేడమ్ కాశ్మీర్ ప్రాంత దుస్తులు వేసుకొని వాళ్ళలో అందంగా కనిపించిందని టూరు నుంచి తిరిగి వచ్చిన తర్వాత విద్యార్థినులు తమ స్నేహితులతో చెప్పారు. జీలం నదిలో హౌస్‌బోట్‌లో రైడ్‌కు వెళ్ళినప్పుడు మేడమ్ పాట పాడిందని కూడా చెప్పారు. ఆంగ్లేయ పర్యాటకుడు ఆ బృందంలో కిరణ్ వున్న కారణంగా ముగ్ధుడై ఆమెతో లెక్కలేనన్ని ఫోటోలు తీసుకున్నాడనీ మంచి పుస్తకాన్ని కానుకగా ఇచ్చాడనీ చెప్పారు.

ప్రొఫెసర్ అవతార్ పాటియాలా నుంచి లూధియానా కాలేజీకి బదిలీ కోరారు.

ఒక రోజు మధ్యాహ్నం, కిరణ్ వాళ్ళింటి ముందున్న బంగ్లాలోకి తన ముగ్గురు పిల్లలు, వాళ్ళ అవ్వతో సహా ఒకాయన దిగారు. ఆయన బొంగురు

గొంతుతో మాట్లాడారు.

ఏదైనా సహాయం కావాల్సివస్తే అడగడానికి మొహమాట పడవద్దని పొరుగువారు కదా అన్న మర్యాదతో కిరణ్ వాళ్ళ నాన్న ఆ కొత్తగా వచ్చిన వారికి నౌకరుతో చెప్పి పంపారు.

మరునాడు ఉదయం వాళ్ళ పని మనిషి వచ్చి అగిపెట్టె అడిగాడు. "మా యజమాని సంపన్నుడు" అని కిరణ్ నౌకరుతో చెప్పాడు. చండీఘర్‌లో ఆయనకు స్వంత బంగళా వుందని, నెలనెలా ఎనిమిది వందల రూపాయల అద్దె వస్తుందని చెప్పాడు. కులూలో పెద్ద యాపిల్ పండ్ల తోట వుందని, ఆయన భార్య ఏదో జబ్బుపడి మంచంమీద నుంచి కదలని స్థితిలో కొంతకాలం వుండి చనిపోయారని వివరించాడు. "మా సారు మరో పెళ్ళి చేసుకోవాలను కుంటున్నారు" అన్నాడు.

సాయంత్రం ఆ ఇంటాయన చిన్న కుమార్తె బింటూతో కలిసి కిరణ్ వాళ్ళింటికి వచ్చింది.

ఆ పిల్లను తీసుకెళ్ళడానికి వచ్చిన తండ్రి కిరణ్ నాన్న దగ్గర చాలాసేపు గడిపి, ఏవేవో విషయాలు మాట్లాడాడు. కొన్నాళ్ళ తర్వాత కులూ నుంచి తెచ్చిన యాపిల్ పండ్ల పెట్టె కిరణ్‌జిత్ వాళ్ళింటికి పంపించారాయన.

యాపిల్స్ పంపించారు కదా అన్న మర్యాదకు వాళ్ళను డిన్నర్‌కు పిలుద్దామా అంది కిరణ్ వాళ్ళమ్మ. "మనం పిలవక పోతే మన గురించి వాళ్ళేమను కుంటారు?" అంటూ.

ఆరోజు భోజనం చేసే సమయంలో కిరణ్ తండ్రి ఎక్కువగా కిరణ్ గురించే చెప్పారు. ఆమె పెళ్ళి, తేజ్‌వంత్ మరణం సైన్యంలో జీవితం, ప్రత్యేకించి కిరణ్‌జిత్ చిన్న వయసు ఇలాంటి వన్నీ చెప్పారు. సానుభూతి పొందే ప్రయత్నం ఆయన మాటల్లో కనిపించింది.

"మా అమ్మాయి చాలా ధైర్యం కలది" కిరణ్‌జిత్ నాన్న చెప్పాడు.

"ఆమెకు రాష్ట్రపతి 'వీరచక్ర' ప్రదానం చేస్తూ సైన్యంలోని వారి భార్యలంతా తనను ఆదర్శంగా తీసుకోవాలని ప్రశంసించారు" అన్నాడు.

"ఎంతో నిజమేనండీ! కాని జీవితం ముందుంది."

"అది దేవుని సంకల్పం. ఎదిరించడానికి మనమెవరం చెప్పండి? తేజ్‌వంత్

సింగ్‌ను గురించి చెప్పాలంటే అతనిలాంటి అందమైన, సాహసవంతులైన యువకులు చాలా అరుదుగా వుంటారు."

"కాని పోయిన వారితో మనమూ పోలేం కదా! మరీ కిరణ్ భవిష్యత్తు గురించి చాలా సీరియస్‌గా ఆలోచించాలి." అన్నారు. కిరణ్ వాళ్ళనాన్న ఈ విషయాన్ని రాత్రి పొద్దుపోయే వరకూ ఆలోచిస్తూనే వున్నారు.

నెలరోజులు తిరక్కుండానే ఎదురింట్లో అద్దెకుండే ఆయన కిరణ్ పట్ల సానుభూతితో ఆమెను పెళ్ళిచేసుకోవడానికి తనకేమీ అభ్యంతరం లేదని చెప్పి పంపారు. ఈ విషయం విన్న కిరణ్ కు నవ్వాగలేదు.

"అతనంత తీసెయ్యదగ్గవాడేమీ కాదే" వాళ్ళమ్మ అంది కిరణ్ మనసులో ఏముందో తెలుసుకుందామన్న ప్రయత్నంలో.

"అమ్మా! నువ్వు అట్టె కలగజేసుకోకు. ఈ ప్రతిపాదన తెచ్చి నాన్న సంసారాన్ని ముక్కలు చెయ్యొద్దు?" కిరణ్ నవ్వుతూనే అంది. ఈ వయసులో తక్కువ వయసున్న యువతిని ఆయన కోరుకోలేదు. నీవే కావాలనుకుంటున్నా రేమో! పుస్తకాలు చంకనబెట్టుకుని బయలు దేరింది కాలేజీకి.

గార్డెన్ గేటు తెరచుకొని ఆమె రోడ్డు పైకి వచ్చింది. కొత్తగా వచ్చిన అద్దె కుండే పొరుగింటాయన, అదే ముగ్గురు పిల్లల తండ్రి తనకోసం కాచుకుని కూచున్నట్లున్నాడు. సర్రుమని కారులో వచ్చి కాలేజికి కార్లో వెళదాం రమ్మన్నాడు.

"థ్యాంక్స్ అంకుల్! థాంక్‌యు వెరీమచ్. మా కారు కూడా రెడీగా వుంది. కాని నడవడం నాకిష్టం" వెనక్కి తిరిగి చూడకుండా ముందుకుసాగింది. సీటుకు అతుక్కుపోయినట్లు కూర్చున్న ఆయన ఆమె వెళ్ళిన వేపే చూస్తూ వుండి పోయాడు.

చుక్కల రాత్రి దూరంగా రైలు వెళుతున్న చప్పుడు. రైలు కూత వినవస్తున్న చప్పుడును బట్టి ఇప్పుడిప్పుడే స్టేషన్ దాటి వడివడిగా వెళ్తున్నట్లుంది. కిరణ్‌జిత్ కూర్చుని తండ్రి కోసం స్వెట్టర్ అల్లుతోంది. రేడియోలో బడేగులాం అలీఖాన్ పాట వినవస్తూ ఆమెను మరోలోకంలోకి తీసుకువెళుతోంది.

"పడుకునే ముందు పాలు తాగడం మరచి పోకండి" కిరణ్ తల్లి భర్తకు చెప్పింది.

"అలాగే!" న్యూస్ పేపర్‌లోంచి తల తిప్పకుండానే అన్నారాయన.

"నాన్నా! మా కాలేజీలో కొత్తగా ఒక ఫిలాసఫీ ప్రొఫెసర్ చేరారు. ఏం మనిషి అనుకున్నారు? దేవుడు తనకు తీరిక వేళలో ఎంతో పొందికగా ఈయన శరీరాన్ని మలచాడనిపిస్తుంది. చాలా మంచివాడు. మర్యాదస్తుడు" కింద పడిన అల్లిక పుల్లను చాలా జాగ్రత్తగా తీసుకుంటూ అంది కిరణ్.

"నిజమా!" అంటూ వాళ్ళ నాన్న చదువుతున్న పేపర్‌ను పక్కన పడేశారు. తల్లి నుదురు బాదుకుంది. "నీకెన్నిసార్లు చెప్పానో గ్రంథ సాహిబ్ పఠించమని" అని మజ్జిగ చిలకడంలో నిమగ్నమైంది.

"అమ్మా! దేవుడితో అకౌంట్ సెటిల్ చేసుకోవడానికి ఇంకా టైముంది లేవే" సితార్ తీగలు సవరిస్తూ అంది కిరణ్.

"నువ్వు జాగ్రత్తగా వుండడం నేర్చుకో. నాన్నంటే పట్టణంలో అందరూ ఎంతో గౌరవిస్తారు...."

"సరే మహామాతా! ఇక చాలు ఉపన్యాసం. నాన్నా! అవునూ నేనిప్పుడు చెప్పానే ప్రొఫెసర్‌ను గురించి నేను ఆయనతో ఉడాయిస్తే ఎలా వుంటుంది?" కిరణ్ నవ్వుతూ అంది.

"ఉడాయించడం ఎందుకు? నడిచి వెళ్ళొచ్చు గదా!" చిరునవ్వుతో అన్నాడు. "తండ్రీ కూతుళ్ళకు పిచ్చిగాని పట్టిందా? కిరణ్ తల్లి మండిపడింది."
"ఏ తండ్రి అయినా కూతురితో ఇంత సీరియస్ విషయాన్ని ఇంత తేలిగ్గా హాస్యమాడుతున్నట్లుంటారా?"

"హాస్యమాడుతున్నదెవరో?" కిరణ్ అంది.

"మీరే" అంది తల్లి.

ఒకనాడు ఫిలాసఫీ ప్రొఫెసర్ నుంచి ఆమెకు ఉత్తరం వచ్చింది. ఆ క్షణంలో ఆమె రెండు కళ్ళల్లో దీపాలు వెలిగాయి.

ఒక రోజు ఆ ప్రొఫెసర్ కిరణ్‌జిత్‌ను సినిమాకు ఆహ్వానించాడు. "మీకు తెలుసా నేనెవర్నో?" కిరణ్‌జిత్ అంది ఆయన మనసు తెలుసుకోవడానికన్నట్లు.

"చనిపోయిన వారికి బతికున్నవారిపై పెద్ద హక్కువుంటుందా?" కిరణ్‌కు సమాధానంగా ప్రొఫెసర్ వేసిన ప్రశ్న. కిరణ్ తన చేతిని కుర్చీ హాండ్‌రెస్ట్‌పై వుంచింది. ఆయన తన చేతిని కిరణ్ చేయిపై వేశాడు. కిరణ్ కళ్ళు వెలుగును విరజిమ్మాయి. ఆమె సినిమా చూడడం లేదు. దాని మీద ఆమె మనసు లగ్నం

కావడమే లేదు. సినిమాహాలు నుంచి బయటికి వచ్చారిద్దరు. నడుస్తున్నారు. తన పక్కన నడవడానికి ప్రొఫెసర్ జంకుతూ వున్నట్లు గమనించింది కిరణ్. తనతో కలిసి నడుస్తుంటే చూసిన వాళ్ళేమనుకుంటారోనని అనుకుంటున్నాడా? అతని తీరు ఆమెకు నచ్చలేదు. కాని ఇప్పుడే ఏ నిర్ణయానికీ రావడం సరికా దనుకుంది.

ఆమె నాన్న ఏదో పనిపై కాలేజికి వచ్చినప్పుడు ఆ ప్రొఫెసర్‌ను చూశాడు.

ఒకనాడు ఆగ్రా వెళ్ళొద్దాం రమ్మని ఆహ్వానించాడు. అప్పుడు రెండు రోజులు దీపావళి సెలవులున్నాయి. వెళ్ళే వీలుంది కాని కిరణ్ వెనకముందా డింది. ఇంకోసారి వెళ్ళవచ్చునంది.

ఆరోజు దీపావళి. వేల సంవత్సరాల కిందట శ్రీరాముడు వనవాసాన్ని పూర్తి చేసుకొని రావణుని సంహరించి అయోధ్యకు తిరిగి వచ్చిన రోజు ఇది. "అతడు"కూడా అలాగే తిరిగి రావాలని కిరణ్ కోరుకుంది. అందరూ తమ ఇళ్ళను అందంగా అలంకరించుకున్నారు. తీపి పదార్థాలను పరస్పరం పంచుకున్నారు. వ్యాపారస్థులు తమ దుకాణాల్లో వ్యాపారాన్ని పెంచి, సంపదను ప్రసాదిస్తున్న ల... దేవికి పూజలు చేశారు. పిల్లలు వీధివీధినా మతాబుల్ని వెలిగించారు. ట...కాయలు కాల్చారు.

కిరణ్‌కూడా తమ ఇంటిని అందంగా అలంకరించింది. కాని అర్ధరాత్రి కాకముందే పిల్లలు తమ కేరింతలు ఆపి నిద్రలోకి జారుకున్నారు. దీపాలు ఆరిపోయాయి. యథాప్రకారం రాత్రిని చీకటి ఆవరించింది.

ప్రొఫెసర్ దీపావళి పోయిన మూడ్రోజుల తర్వాత తిరిగివచ్చాడు. అతనికేమైనా జబ్బు చేసిందేమోనని కిరణ్ ఆందోళన చెందింది.

అతని చేతికి బంగారు కడియం కొత్తగా చేరింది.

అతను మాట్లాడుతున్నా, నవ్వుతున్నా ఏదో అతిశయం కనిపిస్తోంది. సంస్కారం కలిగిన అటువంటి వ్యక్తి అలా ప్రవర్తించడం ఎలాగో అనిపిస్తోంది. "ఓ అవును కదూ చెప్పడం మరిచిపోయాను. ఈసారి నేను ఇంటికి వెళ్ళానా! మావాళ్ళు పట్టుబట్టి నా నిశ్చితార్థం నిర్ణయించారు. అమ్మాయి ఓ జడ్జి కూతురు. మెట్రిక్యులేషన్ మాత్రమే చదివింది. బాగానే వుంటుంది. అయినా ఈ అనవసర విషయాలెందుకు చెప్తున్నాను ఇంతకూ నాతో ఆగ్రా ఎప్పుడు వస్తారు?"

కిరణ్ కళ్ళల్లో దీపాల్ని ఎవరో ఆకస్మికంగా ఆర్పేశారు. తడబడుతున్న

అడుగులతో ఎలాగో ఇల్లు చేరింది.

ఆ రోజు అన్ని రోజుల్లాగే ఎలాంటి మార్పులేదు.

కిరణ్ వాళ్ళ నాన్న ఢిల్లీ నుంచి కారులో తిరిగివస్తున్నారు. డ్రైవర్ కునికి పాట్లు పడుతూ నడపడం వల్ల కారు ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొంది. నాన్న, డ్రైవర్ ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు.

కిరణ్ తల్లిశోకం వర్ణించనలవిగాకుండా వుంది. ఆమె గాజులు పగులగొట్టుకుంది. ముక్కు పుడక తీసేసింది.

కిరణ్ తన చేతులకున్న గాజుల్ని ఒకసారి చూసుకుంది. తర్వాత చేయి ముక్కుపుడక వైపు వెళ్ళింది. దుఃఖించడానికి ఆమెకు కన్నీళ్ళే లేవు.

జనం ఇంటి పెద్దను కోల్పోయిన తల్లీ బిడ్డలను పరామర్శించారు. సంతాపాలు వెలిబుచ్చారు. స్త్రీలు చాలా దుఃఖించారు. ముఖ్యంగా కిరణ్ తల్లి మీద కంటె కిరణ్ మీద ఎక్కువ సానుభూతి వ్యక్తం చేశారు. రెండు మోకాళ్ళమధ్య తలపెట్టి కూర్చున్న కిరణ్ దారుశిల్పంలా వుంది. ఒకామె కిరణ్‌ను గట్టిగా అదుము కొని ఏడ్వనారంభించింది. కిరణ్‌కు కోపంవచ్చి తోసి వేసింది.

ఏడుపులు, పెడబొబ్బలు, అనంతర కర్మలు ఇవన్నీ పూర్తయ్యేసరికి పది రోజులు పట్టింది. చివర్న సిక్కుల పవిత్ర గ్రంథం గురుగ్రంథ సాహిబ్ పఠనం జరిగింది. దాంతో అన్నీ ముగిశాయి. పోయిన తండ్రి జ్ఞాపకాలే మిగిలాయి.

కిరణ్‌జిత్ తన తండ్రి స్వెట్టర్ అల్లడం ప్రారంభించి ఆయన కన్నుమూసే నాటికి సగం మాత్రమే పూర్తి చేసింది. ఇప్పటికీ దాన్ని అల్లడం పూర్తి చేయలేదు. మనిషి నాది నాది అని ఇంతగా పాకులాడతాడు. మరుక్షణం ఏమి కానుందో తెలియదు. మరో స్త్రీకి వేదాంత ధోరణితో నానమ్మ చెప్తున్న మాటలు తన చెవిన పడ్డాయి. "అయినా కూడా ఇది నాదీ అన్న భావన లేకపోతే మనిషి ఒక్కక్షణం కూడా జీవించజాలడు" అని ఈ వాదనకు అమ్మ ముగింపు పలికింది.

"చూడమ్మాయి. ఇప్పటిదాకా అంతా నీ ఇష్టప్రకారం సాగింది." అని కిరణ్‌జిత్ నాన్నమ్మ అమ్మతో అంటోంది. "ఇక నుంచి మాత్రం అందరిలాగా ప్రవర్తించాలి. నువ్వు వచ్చి మాతో పాటు అయినా వుండాలి. లేదూ మీ వారి సోదరుని కుమారుడ్ని తోడు తెచ్చుకొని ఇక్కడే అయినా వుండాలి. అబ్బాయి ఎనిమిదో తరగతే చదువుతున్నా ఏపనైనా చేస్తాడు. రోజులసలే బాగోలేవు.

ఈ పరిస్థితుల్లో ఒంటరిగా ఉండడం మంచిది కాదు."

"మా సంగతి మేం చూసుకుంటాంలేవే!" కిరణ్ వాళ్ళమ్మ సమాధానం. "నేను ఇతరుల పిల్లలు బాధ్యత తీసుకోలేను. వాళ్ళు ఎప్పుడూ ఒకలా ఉంటారను కోవద్దు."

"ఇది ఎలా మాట్లాడుతోందో చూడండి!" నానమ్మ మండిపడింది.

"ఈ నష్టజాతకురాలు నా కుటుంబాన్ని నాశనం చేసింది. నా ఇంట్లో దీపం పెట్టడం కూడా దీనికి ఇష్టం లేదు. ఒక పిల్లవాడ్ని అదీ అల్లుడి వరసయ్యే బంధువుల పిల్లవాడ్ని తనతో పెట్టుకోలేదా. కర్రపట్టుకొని ద్వారం దగ్గరే వుండి వాడొక వేళ వస్తే తరిమేస్తానన్నట్లు మాట్లాడుతోంది చూడండి! ఎంత అన్యాయం. ఎంత అన్యాయం. ఈ ముదనష్టపుది మనందరి చావు కళ్ళజూసేలా వుంది?" తాతయ్యకు ఏడుస్తూ చెప్తోంది. అమ్మను తిట్టడం మాత్రం ఆపడం లేదు.

కిరణ్‌జిత్ మాత్రం నాన్నమ్మ ముఖంలోకి చూస్తూవుంది. ఆమె తన కొడుకు మరణానికి దుఃఖిస్తున్నదో, ఆయన ఆస్తినెవరో ఎత్తుకు పోతున్నారని బాధపడు తున్నదో తెలియడంలేదు. "లేదు. మాకిష్టం లేకుండా ఎవర్నీ మా మీద రుద్దలేరు!" మా అమ్మ రుద్ధమైన కంఠంతో అంది. "నేను చావలేదు. ఇంకా ప్రాణం కొట్టుకుంటూనే వుంది...!"

నానమ్మ తలబాదుకుంటూ బిగ్గరగా అరుస్తూ తిడుతూ శాపనార్థాలు పెడుతూ ఈ ఇంట్లో ఉంచాలనుకున్న తన మనవడ్ని చేయిపట్టి లాక్కుని బయటికి వెళ్ళిపోయింది. వాళ్ళ ఊరిబాట పట్టింది.

కిరణ్‌జిత్ తాతయ్యకు ఏం చెయ్యాలో పాలు పోవడం లేదు. ఆ ఇంట్లో ఉండాలో భార్య వెంట వెళ్ళాలో తేల్చుకోలేకుండా వున్నారు.

రోజులు భారంగా గడుస్తున్నాయి. ప్రొఫెసర్ అవతార్ పాటియాలలో ఏదో పని వుండి వచ్చారు. చూసి పోదామని కిరణ్ వాళ్ళింటికి వచ్చారు.

కిరణ్‌వాళ్ళ నాన్న పోవడం గురించి మాట్లాడుకున్నారు. తన విచారాన్ని వ్యక్తం చేశాడు. ప్రమాదం ఎలాజరిగింది? ఎక్కడ జరిగింది.? ఆయనకు గాయాలెక్కడ తగిలాయి? ట్రక్కు డ్రైవర్ పట్టుబడ్డాడా? వంటివి ప్రశ్నలు అడిగాడు. కిరణ్ వైపే చూస్తూ కూర్చున్నాడు.

"టీ తీసుకుంటారా?"

"ఫరవాలేదు"

లోపలికి వెళ్ళి టీ తయారు చెయ్యమని అమ్మతో చెప్పి తిరిగి వచ్చిన కిరణ్‌ను ఆసరాగా ప్రొఫెసర్ అవతార్ తన కుడిచేయి చాచాడు. కిరణ్ ఆశ్చర్య పోయి అతనికి కాస్త దూరంగా కూర్చుంది.

"నేనొక విషయం చెప్పనా? ఈ ఆదర్శాలు 15 వ శతాబ్దానికి చెందినవి. గతించిపోయిన కాలపు అవశేషాలు. వీటివల్ల నీకేం ఒరిగేదేమీ లేదు. జీవితం మళ్ళీ తిరిగిరాదు. ఎందుకు వృథా చేసుకుంటావు. నా మాట విను"

కిరణ్‌జిత్ ఏమీ మాట్లాడలేదు.

"నువ్వు ఆకలితో, దాహంతో బాధపడుతుంటే దాని వల్ల మీకు ప్రయోజన మేమిటి? ఒకవేళ నీకు నువ్వేమయినా చేసుకుంటే ఇతరులెందుకు పట్టించు కుంటారు? అలాగే వాళ్ళ గురించి నువ్వెందుకు పట్టించుకోవాలి?

కిరణ్ మౌనంగానే అతను చెప్పేది శ్రద్ధగా వింటున్నది.

"నువ్వు ధనవంతురాలివే అనుకో. ఈ సంపదంతా ఏంచేసుకుంటావు? అంతా మరొకరి చేతుల్లోకి వెళ్ళేదేకదా! అందుకే నా మాట విను. అప్పుడప్పుడూ సాయంత్రాల్లో కాస్త విదేశీ వైన్ తీసుకో. కారు నడపడం నేర్చుకో. కాస్సేపు నిన్ను నువ్వు మరచిపో. హాయిగా గడుపు. అలా కాదంటే... రెండు మూడేళ్ళు పోయాక ఈ కాస్త యౌవనం కరిగిపోతే మిగిలేది పశ్చాత్తాపమే. జరిగిన కాలం తిరిగి రాదు. ఇంగ్లండువెళ్ళు. ఆంగ్లేయుడ్ని పెళ్ళాడి, అతని వల్ల ఒక కొడుకును కను. తిరిగిరా. ముందు హాయిగా జీవించడం నేర్చుకో."

"నిజం చెబుతున్నాను నువు ఈ నాలుగు గోడల మధ్యే ఉండిపోతే నిన్నెవరూ గుర్తించరు. ధైర్యంగా జీవించడ మెలాగో ముందు తెలుసుకో. నా సంగతి అటుంచు నీకిష్టమైన వ్యక్తితో కలిసి ఏ ముంబాయికో, కోల్‌కత్తాకో విహార యాత్రకు వెళ్ళు. ఎవరో కలల రాకుమారుడు రెక్కల గుర్రం మీద వచ్చి నిన్ను ఏ సుందర తీరాలకో తీసుకెళతాడని అనుకుంటే మాత్రం పప్పులో కాలేసినట్లే. భారతీయులం చాలా వరకు గతంలో జీవిస్తాం. ఎప్పుడో గతంలో ఏదో జరిగిందని ఎవరు చూడొచ్చారు? అయినా మేలు కోడానికింకా సమయం మించిపోలేదు."

"మంచిది!" కిరణ్‌జిత్ అనాసక్తంగా అంది.

వాళ్ళమ్మ టీ పంపింది. కిరణ్ కప్పులో పోసి అవతార్‌కు అందించింది. మరో కప్పు తయారు చేసుకుని తాను తీసుకుని తలవంచుకునే తాగింది.

"నా భార్య నెలరోజుల కోసం వాళ్ళమ్మగారింటికి వెళ్ళింది. నేను ఒక్కడ్నే లూధియానాలో వుంటున్నాను. సి–13 మోడల్ టౌన్ అదే నా చిరునామా. అవునూ, ఆ ఫిలాసఫీ ప్రొఫెసర్‌తో నువ్వు చాలా సన్నిహితంగా వుంటున్నావని విన్నాను."

కిరణ్‌జిత్ సమాధానం చెప్పలేదు.

"సరే... ఇకనేను వెళ్ళాలి. చాలా మందిని కలుసుకోవాలి." అవతార్ ఖాళీకప్పును కిందపెట్టి లేచాడు.

కిరణ్‌జిత్ అవతార్‌ను సాగనంపుతూ చేతులూ జోడించి నమస్కరించింది. అతని మాటల్ని ఎలా అర్థం చేసుకోవాలో ఆమెకు తెలియలేదు. ఆ మాటలు నిజమో, అబద్ధమో అంతుపట్టలేదు.

రోజులు దొర్లిపోతున్నాయి. అక్టోబర్ వచ్చేసింది. పెద్దలకు శ్రాద్ధం పెట్టే మాసమది. ప్రజలు మూకుమ్మడిగా పహేవాకు తరలిపోయి తమ పెద్దలకు అక్కడ శ్రాద్ధ కర్మలు చేస్తారు.

"అమావాస్యరోజు మనం పహేవా వెళ్ళాలి" కిరణ్‌జిత్ వాళ్ళమ్మ చెప్పింది. కిరణ్‌కు కాదనడానికేమీ లేదు. ఈ మధ్య తల్లి మాటే నెగ్గుతోంది. అనుకున్న రోజు రాత్రి 2 గంటలకే లేచింది. 'ఖీర్' 'హల్వా', 'ఆలుగడ్డ కూర', వంకాయ 'భర్తా' వంటివి తయారు చేసింది.

తెల్లవారగానే పహేవా వెళ్ళే బస్సు పట్టుకున్నారు. బస్కెక్కగానే కిరణ్‌జిత్ వాళ్ళమ్మ ఐదు పైసల బిళ్ళను నేలపై వేసింది. కిరణ్‌వాళ్ళ నాన్న ఆత్మ కూడా వాళ్ళతో పాటే పహేవా వస్తుందని నమ్మకం. గమ్యం చేరేవరకూ ఆమె గురుగ్రంథ సాహిబ్ పఠిస్తూనే వుంది. కిరణ్ మాత్రం బస్సులో తమతో పాటే పెద్దలకు శ్రాద్ధకర్మలు ఆచరించడానికి వస్తున్న వారినే చూస్తోంది. ఇలాంటి సందర్భాల్లో ప్రజలతో కిట కిటలాడే దేశం కాబట్టి పహేవా కూడా పూర్వీకుల ఆత్మలతో రద్దీగా వుంటుందేమోనని కిరణ్‌కు అనిపించింది.

కిరణ్ వాళ్ళమ్మ తమ కులం, తమ పట్టణం చెప్పగానే స్థానిక కుటుంబ పూజారి వెతికి ఒక పెద్ద కాగితాల కట్ట వెలికి తీశాడు. అందులోనుంచి పెద్ద

కాగితం తీశాడు. అందులో ఆమె కుటుంబ వివరాలున్న వంశవృక్షం వుంది. ఆ కాగితాన్ని చదువుతూ ఆమె పూర్వీకుల పేర్లు చెప్పాడు.

ఉదాహరణకు అందులో నమోదు చేసిన ప్రకారం ఒకానొక ఏడాది ఆగస్టులో వాళ్ళ వంశానికి చెందిన హీరా కుమారుడైన వజీరా వచ్చి తన తండ్రికి శ్రాద్ధకర్మలు నిర్వహించాడు. వజీరా ఆ స్థలానికి వచ్చిన సందర్భంగా ఆ కాగితంపై చేసిన సంతకాన్ని చూసేందుకు వీలుగా దాన్ని కిరణ్ వాళ్ళమ్మ ముందుకు జరిపాడు. దానికింద వజీరా కుమారుడు హజూరాసింగ్ సంతకం వుంది. కొన్నేళ్ళ కిందట హజూరా కుమారుడు ఉత్తమ్‌సింగ్ వచ్చి ఈ కర్మలు నిర్వహించాడు. ఇప్పుడు కిరణ్‌జిత్, ఆమె తల్లి ఉత్తమ్‌సింగ్ కుమారుడు సర్దార్ జశ్వంత్‌సింగ్ మోక్షప్రాప్తికోసం శ్రాద్ధకర్మలు అర్పించడానికి వచ్చారు.

కిరణ్‌జిత్‌కు ఆ గడబిడ వాతావరణం విసుగ్గా వుంది. తనముందే చెరువులోని బురద నీటిలో జనాలు స్నానం చేస్తున్నారు. చెరువుచివర్న చిన్న ఇరుకైన దేవాలయం వుంది. ఇటుకలతో కట్టిన ఈ ఆలయం నిండా కాలుతున్న అగరు వత్తుల వాసన గుప్పుమంటోంది. ఆలయంలో యాత్రికుల మధ్య పూజారి కూర్చుని గడగడా సంస్కృతంలో మంత్రాల్ని ధాటిగా చదువుతున్నాడు. గంట పాటు తన ఈ పూజా కార్యక్రమ తతంగాన్ని పూర్తి చేయాల్సివుంది. బయట అసహ్యంగా కనిపిస్తున్న భిక్షగాళ్ళు భక్తులను డబ్బులకోసం వేధిస్తున్నారు.

ఇంకోవైపు చెరువుగట్టుమీద కూర్చున్న కుటుంబ పూజారి కిరణ్‌జిత్‌ని, వాళ్ళమ్మను తాను చెప్పినట్లు చెయ్యమని చెప్పి పూజాదికాలను ప్రారంభించాడు.

చెప్పులు విప్పి పూజా వస్తువులను సమీపంలో భద్రంగా ఎవరూ ఎత్తుకు పోయేందుకు వీలు లేకుండా ఉంచాడు.

పూజారి తన కార్యక్రమాన్ని మొదలు పెడుతుండగా మరో వ్యక్తి వచ్చాడు. తాను కూడా పూజ చేయాల్సి వుందని అన్నాడు. కిరణ్ వాళ్ళ కుటుంబ పూజారి ఓ పక్కన ఏ పని లేకుండా కూర్చున్న మరో పూజారిని పిలిచి అతని చేతిలో కొంత డబ్బు పెట్టి కొత్తగా వచ్చిన వ్యక్తిచేత పూజలు చేయించమని కోరాడు.

కిరణ్ వాళ్ళమ్మ ఇంటినుంచి చనిపోయిన తమ పెద్దల పాతవస్త్రాలు, కొత్తబట్టలు, ఇతర వస్తువులను తీసుకొచ్చింది. పూజారి దగ్గరలో వున్న దుకాణం నుంచి బియ్యం, పిండి, రోలి, దర్భపుల్లల్ని తెచ్చాడు. నేలమీద పిండితో గీతలు

గీసి కుండలి వేశాడు. కుండలిలో ఒకో గడిలో ఒకో దేవి, దేవతా రూపాలను ప్రతిష్ఠించాడు.

అతడు చేసే ప్రతి అంశాన్ని కిరణ్‌జీత్ శ్రద్ధగా గమనిస్తోంది. పూజారి వేగంగా కదులుతూ పొల్లు పోకుండా తంతు నిర్వహిస్తున్నాడు.

మంత్రాలకు అనుగుణంగా కుండలిలోని దేవతల గదుల్లో పసుపు కలిపిన బియ్యం గింజల్ని, రోలీని చల్లుతూ వుండమని చెప్పాడు. ప్రతి దేవతను, దేవుడ్ని స్తుతిస్తూ, వారి మహిమల్ని వల్లిస్తున్నాడు. శ్రాద్ధకర్మ పూర్తయింది. మిగిలిన పిండిని తడిపి చిన్న చిన్న ఉండలుగా చేసి పూజారి కిరణ్‌కు, ఆమె తల్లికి ఆ ఉండల్ని ఇచ్చాడు. చెరువులోని చేపలకు ఆహారంగా వేయమని చెప్పాడు. చివరికి సూర్యుని స్తుతిస్తూ చేతిలో నీళ్ళు తీసుకుని అర్ఘ్యం ఇచ్చాడు.

కర్మకాండ అయ్యాక మరణించిన వారికి పిండాలు పెట్టి ఆరగించ వలసిందని వారిని ఆహ్వానించారు. అది ముగియడంతో ఇక పూజారికి దక్షిణ సమర్పణ వంతు వచ్చింది. ఇలాంటి కర్మకాండల నిర్వహణలో అవతల వచ్చిన వారి స్థితినిబట్టి దక్షిణ ఎంత అన్నది ఆధారపడి వుంటుంది. ఇచ్చేవారిని బట్టి ఎక్కువ, తక్కువ వుంటుంది. తనతో తీసుకెళ్ళవలసిన సరంజామాను అతను మూటగట్టుకుని వారిని సమీపంలోని దేవాలయానికి తీసుకెళ్ళాడు. అక్కడి దేవతా విగ్రహానికి వారు తైలాభిషేకం చేయాలి. ఆ పనీ పూర్తయ్యాక "ఇక మీరు తినవచ్చు. మీరేది తిన్నా నేరుగా మీ పెద్దలకు చేరుతుంది." అని చెప్పాడు.

అక్కడ్నించి ఇవతలికి వచ్చారు. కిరణ్ వాళ్ళమ్మ రోడ్డు పక్కన తిను బండారాలు దొరికే కొట్టుదగ్గర ఆగింది. "పద ఏదైనా తినడానికి కొనుక్కుందాం" అంది కిరణ్‌తో. పాలలోకి కొన్ని జిలేబీలను వేయమని అమ్మను అడిగింది. వాళ్ళ నాన్నకు పాలలో జిలేబీలు వేసుకుని తినడమంటే చాలా ఇష్టం. ఇక్కడ కూడా భిక్షగాళ్ళ సంత ఎక్కువగానే వుంది.

"బీబీ దానమివ్వండమ్మా." భిక్షగత్తె బతిమాలింది. "మీ పెద్దల పేరుతో ఇవ్వండమ్మా. వాళ్ళు నేరుగా వచ్చి అడగలేరు. వారికి నోరు లేదు." వాళ్ళ ఆత్మలు భిక్షగాళ్ళలో నిక్షిప్తమై వుంటాయన్న మాట కిరణ్‌కు విచిత్రంగా తోచింది. నోట్లో పోసుకున్న పాలు గొంతుకు అడ్డంపడ్డాయి. "మా నాన్న ఆత్మకూడా ఈ బిచ్చగాళ్ళ మధ్య తిరుగాడుతోందా?" ఆమె గొంతు జాలిగా వణికింది.

"మనమిక్కడికి అసలు రాకుండా వుండాల్సింది" అమ్మతో అన్నది.

"పూర్వీకుని ఆత్మ శాంతికి తగిన రీతిలో కర్మకాండ నిర్వర్తించేదాకా భూతరూపంలో భూమ్మీద సంచరిస్తూనే వుంటాడు. మరొక శరీరంలోకి ప్రవేశించ డానికి నిరాకరిస్తుంటాడు. బతికున్నవారిపై పోయినవారు మోపిన భారం ఇది. పిల్లలు కృశించిపోవడానికి కారణాల్లో ఇదీ ఒకటి. రక్తసంబంధీకులు ఈ శ్రాద్ధకర్మలను ఆచరిస్తే తప్ప ఇవి మరణించిన వారికి మోక్షం కలిగించలేవు."

కిరణ్ పాలు తాగుతుండగా ఆమెకు కొద్దిదూరంలో నిలబడి తన వైపే ఎంతో ఆశగా చూస్తున్న భిక్షగాడి గిన్నెలో పాలు, జిలేబీలను పోసింది. తన గిన్నెలో పాలూ, జిలేబీ పడగానే భిక్షగాడు భయంకరంగా నవ్వాడు.

కిరణ్ వాళ్ళమ్మ కొట్టువానికి డబ్బు చెల్లించి నెమ్మదిగా అక్కడ్నించి కదిలింది. కాని కిరణ్ మాత్రం అక్కడే నిలబడి పోయింది. తల్లి వెనక్కి తిరిగింది. "ఏమైంది నీకు" అడిగింది.

ఒక్కక్షణం కిరణ్ తటపటాయించింది. తర్వాత తన చేయి తడబడుతూనే ముక్కు దగ్గరికి వెళ్ళింది. వణుకుతున్న వేళ్ళతో ముక్కుపుడకను తాకింది. తల్లి ఏమీ అర్థం కానట్టు చూస్తోంది. కిరణ్ తన ఎడమ చేతికి వున్న రత్నాలు పొదిగిన బంగారు గాజుల్ని కూడా తీసి బ్యాగులో పెట్టుకుంది. అమ్మ ఆశ్చర్యంగా చూస్తోంది. బిడ్డ చేస్తున్నదేమిటో ఆమెకు అర్థం కాలేదు.

"అమ్మా! గిల్ కుటుంబ పూజారిని కలుద్దాం పద" కిరణ్‌జిత్ తడబడుతూ అంది.

నుదుట చెమట పట్టింది కిరణ్ తల్లికి. కూతుర్ని తన వెంట నడవమంది. మొత్తం మీద గిల్ కుటుంబ పూజారి ఉండే చోటు కనుక్కున్నారు. అక్కడికి చేరాక కిరణ్ తల్లి వెనక్కి తిరిగి తన కూతురివైపు చూసింది. కిరణ్ తన తల చుట్టూ చున్నీ కప్పుకుంది. ఆమె నాసికాగ్రాన ముక్కు పుడక తొలిగి పోయింది. ముక్కు పుడక తొలగించిన చోట మచ్చ మాత్రం వుండిపోయింది.

* * *

కొంత కాలం పాటు కిరణ్‌జిత్ డైరీ రాసేది. ఆమె రాసుకున్నవి ఇలా వున్నాయి:

15.7

ఏడాది అయ్యింది. కాని ఇదొక శతాబ్దమంత భారంగా
నడిచినట్లుంది. సుదీర్ఘకాలంగా నేను సాగుతున్నట్లే వుంది.
సూర్యుడు యుగాలనుంచి ఉన్నాడు, ఎన్నడు అస్తమిస్తాడో తెలీదు.
అందరూ తేజ్‌వంత్‌నే ఎప్పుడూ తలచుకుంటారు, ఆయనే బతికుండి
నేనే చనిపోయినట్లుంది.
అదే నిజం కావచ్చు
అతను యుద్ధంలో తన ప్రాణాలర్పించాడు, నిజానికి అతను
మరణించలేదు.
అతని అస్థికలింకా. అక్కడక్కడా వుండి వుంటాయి. ఎప్పుడో
నేనక్కడికి వెళతాను.
అలాంటి వీరుల అస్థికలు అక్కడ చాలా వుంటాయి. అతనివేనని
ఎలా గుర్తించగలను!

27.7

ఇది మేఘావృత రాత్రి
ప్రభంజనం తలుపులూ, కిటికీలపై దాడి చేస్తున్నది.
ఇది ఏదేశం?
పయనిస్తూ.... పయనిస్తూ... ఒకచోటికి చేరి అడిగింది.
రోజూ... సూర్యుడుదయిస్తాడా?
"స్కార్లెట్ లెటర్" లోని హెస్టర్ పాత్రను ఎలుగెత్తి పిలవాలనుకుంది.
ఆకాశంలో పక్షుల గుంపు ఎగురుతోంది.
ఒక్క క్షణం నా సందేశాన్ని మోసుకు వెళ్ళ గలరా అని పక్షులను
అడగాలనిపించింది.
అనుమతి లేకుండా అవి సరిహద్దులనెలా దాటుతాయి?
మయూరాలు పిచ్చుకల నడిగాయి,
ఎప్పుడూ సంచరిస్తూనే వుంటారెందుకు?
మీ దేశం నిర్జన ప్రదేశమూ, ఊషర క్షేత్రమా

లేదా ప్రేమలో పడ్డారా?
రైలు స్టేషన్ దగ్గర కూత వేసింది.
ఎంతో మంది ఈ రైల్లో వచ్చి వుంటారు.
ఇంతమంది ఎక్కడ్నించి వస్తారు?
ఎక్కడికి వెళతారు?
ఆకాశవాణి శాస్త్రీయ సంగీతాన్ని ఆలపిస్తోంది. 'మయూరాలు నాట్యమాడు తున్నాయి.'
మయూరాలకెవరైనా చెప్పారా?

*1.8*

ఈరోజు మా బంధువుల బాలుడొకడు వచ్చాడు.
సీటుకోసం తన పేరును ప్రధానాచార్యునికి సిఫార్సు చేయమని అడిగాడు
'సరే' అన్నాను నేను.
అతని పేరును గుర్తు చేసుకోవడానికి చాలా ప్రయత్నించాను. కాని గుర్తురాలేదు వుంహు!
"నీ పేరేమిటి?" చివరికి అడిగాను.
'రేపు నీపేరే నువ్వే మరెవర్నో అడగడం మొదలు పెట్టకు' నవ్వుతూ చెప్పాడు.
వెళ్ళిపోయాడు తన పేరు చెప్పకుండానే.

*6.8*

కంటి పరీక్ష కోసం వైద్యుని వద్దకు వెళ్ళాను.
కొన్నిసార్లు సూర్యకాంతి నా కళ్ళను గుచ్చుకుంటోంది, సూర్యుడు నా కళ్ళలోనే కాపురం పెట్టినట్లు.
కొన్నిసార్లు ప్రతిదీ మసకమసకగా వుంటుంది, చీకటి రాత్రి నన్ను ఆవరించినట్లు.
'తరచూ చదువుతున్నప్పుడు పదాలు పరుగెత్తుతున్నట్లనిపిస్తాయి.

తర్వాత మాయమవుతాయి', చెప్పాను వైద్యునితో. ఆయన నవ్వి టార్చ్‌లైట్‌తో నా కళ్లను పరీక్షించడం ప్రారంభించారు.

ఆయన నాకళ్ళు పదాల్ని చదివేలా చేశాడు.

'నీ నేత్రదృష్టి బావుంద'ని చెప్పాడు. 'బహుశా నీ కళ్ళపైన ఎవరో తన చెడు దృష్టిని ప్రసరింపజేసి వుంటారు.." అన్నాడు నవ్వి.

ఆయన నవ్వు నాకు అకస్మాత్తుగా గుర్తు చేసింది. మేం పదవ తరగతి కలిసి చదివాం బడిలో.

'చికిత్స కోసం ఎవరైనా మాంత్రికుడ్ని సంప్రదించడం మంచిది' హాస్య మాడుతూ అన్నాడు.

'కాని డాక్టర్! తప్పక ఏదో లోపముంది నా కళ్ళలో' - నేనన్నాను.

'అవును చెప్పానుగా ఇది ఏదో దుష్ప్రభావమే. అయినా సరే నేను కొన్ని మందులు రాస్తున్నాను. వాటిని పడుకోబోయే ముందు కళ్ళలో వేసుకోండి! మందులు రాసిన కాగితాన్ని అందుకొని డాక్టర్‌కు డబ్బులిద్దామని పర్స్‌లో చేయి పెట్టబోయాను.

'డబ్బువద్దు నిన్నే నా ఫీజుగా తీసుకుంటాను.'

నేను సమాధానమివ్వలేదు.

అతనికి తెలిశాక అప్పటి నుంచి నన్ను వేరే దృష్టితో చూశాడను కుంటాను. వేరే విధంగా మాట్లాడాడనుకుంటాను.

మా అమ్మ సోదరి ఒక పాట పాడేది. అదేమిటంటే?

'గంపనిండా మామిడి కాయలు
ఎక్కడ దింపుతావు వీటిని ?
ఈ బ్రిటిషువారి సామ్రాజ్యం
ఎక్కడ దింపుతావు దానిని?'

*15.8.*

అమృత్ ఉత్తరం మూడు నెలలకిందట వచ్చింది. అమ్మ పోయిందని ఆమె రాసింది.

ఇన్ని నెలలకాలంలో నేను ఆమెకు ఉత్తరమూ రాయలేదు. కనీసం ఆమెకు నా ఓదార్పు పలకడానికీ వెళ్ళలేదు.

చండీఘర్ రెండు గంటలసేపట్లో వెళ్ళగలిగినంత దూరంలో వున్నా
ఈ రెండు గంటల దూరమైనా గత మూడు నెలల్లో వెళ్ళలేక
పోయాను.
అమృత్‌కు తెలుసు ఇందులో నా అమర్యాద ఏమీ లేదని.
ఈ రోజు అందిన తన రెండో ఉత్తరం చెప్పింది తనకు నాపట్ల
కోపమేమీ లేదని.
'పండిన పండ్లు ఏదో ఒకరోజు రాలిపోవాల్సిందే జీవితం కూడా ఈ
మార్గాన్నే సాగాల్సిందే' ఆమె రాసింది.
ఆమెకంటే ఎక్కువగా సాంత్వన నాకు కావాల్సినట్లే నేనామెకు
రాద్దామను కున్నాను. 'గడచిన ఏడాది నన్ను దాటిపోయింది.
నాకు ఎలాంటి వార్తలూ రావడం లేదు. నా గురించి కూడా..... '

## *20.8*

అతనో రచయిత
'నీ మీద ఒక నవల రాస్తాను. దాంతో నువ్వు శాశ్వతంగా నిలిచిపోతావు'
అన్నాడు.
వెళ్ళి ఆయనకు చెప్పు:
'మరణం లేకుండా బతుకంతా ఈడ్వాలని శాపగ్రస్తుడైన
అషురసీగాథ నాకు గుర్తుంది. బైబిల్ లోనిది ఈ గాథ పార్‌లేగర్
స్విఫ్ట్ దీన్ని వెల్లడించి అషురస్
మరణానికి బాటలు ఎలా పరిచాడో ఎవరికి తెలుసు?'

## *1.9*

తేజ్‌వంత్ సోదరుడు, అతని భార్యా కలిసివచ్చారు. 'అమ్మ మీరు
లేకపోవడం లోటుగా ఉందంటోంద'న్నారు.
'నాకు నువ్వెవరో తెలీదు. నాకు మీ అమ్మ తెలియదు. మీ సోదరుడు
తేజ్‌వంత్ కూడా తెలియదు'. అని చెప్పాలనుకున్నాను
అతనికి. కాని ఏదీ చెప్పలేకపోయాను.

పంచాయితీవారు మన ఊరినుంచి లుధియానా వెళ్ళే రోడ్డుకు
తేజ్‌వంత్ పేరు పెట్టారని చెప్పాడు సంతోషంగా.
రైడర్స్ టు ది సీ'లోని వృద్ధురాలు అన్నమాట నాకు గుర్తొచ్చాయి.
ఆమె ఏమంటుందంటే; సముద్రం ఆటుపోట్లకు గురవుతున్న
ఈ సమయంలో వేరే స్త్రీలాగా నేను ప్రార్థించలేను.
ఎందుకంటే-ఈరోజు నా నాలుగో కొడుకు కూడా చని
పోయాడు. ఎవరి కోసం నేనిప్పుడు ప్రార్థించాలి. నేను
ప్రశాంతంగా నిద్రపోగలను"
'సరే! కాలేజికి వెళ్ళే వేళయింది' కుర్చీలోంచి లేస్తూ చెప్పాను.
'నేను నిన్ను డ్రాప్ చేస్తాను' అతను చెప్పాడు. కారు తాళాలు తన
ప్యాంటు జేబులోనే వున్నట్లుంది.
'నేను కూడా వస్తాను మీతో' అతని భార్య కూడా లేచింది.
'నువ్విక్కడ వెయిట్ చెయ్యి. నేనొక్క క్షణంలో వస్తాను."
మా అమ్మ ఆమెకు అంతకు ముందు షర్బత్ ఇవ్వబోతే తీసుకోలేదని
ఈసారి టీ తీసుకొమ్మంది. వేసవిలో కూడా టీ తాగడం ఆమెకు
అలవాటు.
'వద్దు. వద్దు. టీ అవసరం లేదు.'ఆమె లేచి కదిలింది.
'అక్కర్లేదు. నా అంతట నేను వెళ్ళగలను' వాళ్ళకు చెప్పాను.
'లేదు నేను డ్రాప్ చేస్తాను.' అన్నాడు
'నేను మీతో వస్తాను' ఆమె వత్తిడి చేసింది.
మీ రిద్దరూ ఇక్కడే వుండండి. నేను మీతో వెళ్ళడం లేదు.
నేను మెట్లవైపు నడిచాను.
కాలేజికి వెళ్ళేదారి ఇవాళెందుకో చాలా దూరమైనట్లుంది.
'ఓ అమ్మా! ఈ దారుల్లో వెళ్ళడం చాలా కష్టంగా వుంది అమ్మా!'

**6.9**

నన్నెవరు పిలిచారు
రాత్రివేళ?

ఎవరి ఇంట్లో రాత్రి ఈ వేళప్పుడు కూడా దీపం వెలుగుతోంది?
ఈ రాత్రి వేళ వరకూ మేలుకొని వున్న వ్యక్తికి వెళ్ళి చెప్పండి. వెళ్ళి
నిద్ర పొమ్మని. రాత్రి మేలుకొని వుండేవారికి పగలు ఆశ్రయ మివ్వదు.
ఓ నేలతల్లీ! నేను నీ అతిథిని
నువ్వేం చేశావు?
భూమి సిగలో పొద్దు తిరుగుడు పూవు నెవరు ముడిచారు?
నా తలలో ఒక తెల్ల వెంట్రుక మెదిలింది.
ఎవరైనా వెళ్ళి అతనికి చెప్పండి.

*10.9*

నగరమంతా నిదురలోకి జారిపోయింది.
తలుపు దగ్గర నిలబడి నేనెవరికోసం ఎదురు చూస్తున్నాను
నేను చాలా దూరాన్నుంచి వచ్చాను.
కాని తలుపు వద్ద నిలబడి వున్నాను.
చుట్టూ ఎడారి.
ఎడారి చెట్లుగా మారిపోయింది.
పచ్చని చెట్లు ఎడారి అడుగు పొరలో కప్పబడి పోయాయి.
ఈ దేశంలో ఎన్నడూ వానలు కురవవా?
మయూరాలు వర్షాన్ని ఆహ్వానిస్తూ నాట్యం చేయడం లేదే?
ఈ నేలను శపించాలనిపిస్తోంది
ఇంతకూ నేనే ఆ నేలను.

*13.9*

ఇది ఉదయమా?
మధ్యాహ్నామా?
ఇది సాయంత్రమా?
ఎక్కడ నుంచి మనం బయలు దేరాలి?

మనం చేరవలసిందెక్కడికి?
ఏ విశ్రాంతి తీరం ఇది?

*18.9*

శాపం అహల్యను శిలగా మార్చింది.
ఆమె ఎప్పుడు తప్పు చేసింది?
మిట్ట మధ్యాహ్నం సూర్యుడికి గ్రహణం పట్టింది.
ఋణదాతలే దారి కాచి దోచుకున్నారు.
దయచేసి ఎవరైనా రక్షిస్తామని అభయమివ్వండి.
దుష్యంతుడు శకుంతలను గుర్తించలేదు.
ఆమె ఏమైనా పాకిస్థాన్ నుంచి తిరిగి వచ్చిన మహిళా? ఎవరైనా
గుర్తించడానికి వెనుకాడడమెందుకు?
సీత అరణ్యవాసంలో
కాదు సీతలోనే అరణ్యవాసం.
ద్రౌపదిని వివస్త్రను చేయకుండా ఇప్పుడు ఏ కృష్ణుడో ఆమెను
కాపాడలేడు.
శ్వెత్లానా నాలుగోపెళ్ళి వార్త వచ్చింది.
అంతా అదృష్ట దేవత లీలా విలాసం

*20.9*

ఒక ప్రేమమయి అయిన తల్లి కనుమూసిన తన బిడ్డనుమహాత్ముడైన
బుద్ధుని వద్దకు తీసుకెళ్ళి గుండెలవిసేలా శోకిస్తూ తన
బిడ్డకు ప్రాణభిక్ష పెట్టవలసిందని వేడుకుంది.
బిడ్డను బతికిస్తాను కాని అందుకోసం ఆవగింజలు కావాలి. అదీ
ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక్క మరణం కూడా
సంభవించని ఇంటి నుంచి ఆ ఆవగింజలు తీసుకు
రమ్మన్నాడు. బాధాతప్తురాలైన ఆ తల్లి
ఆవగింజల కోసం ఇల్లిల్లూ తిరిగింది. ఎన్నడూ మరణమనేది

సంభవించని ఒక్క ఇల్లు కూడా ఆమెకు తారసపడలేదు.
ఆశోప హతురాలై తిరిగి వచ్చింది.
అప్పుడు బుద్ధుడు అన్నాడు ... అమ్మా! ఈ మార్గంలో జీవితం తరలి పోతుంది అని
అవును... ఈమార్గంలోనే తరలి పోతుంది.
వెళ్ళి చెప్పు ప్రతి ఒక్కరికీ... జీవితం ఈ మార్గంల్లోనే తరలిపోతుందని.
పక్షులు తమ సంకల్పాన్ని రాయవు
మేఘాలు గూళ్ళను అల్లవు.
పక్షిలాంటి జీవికి, మేఘంలాంటి జీవికి, అనేక సూర్యుల ఉనికికి సంకెళ్ళు వేసే ప్రయత్నం ఎందుకు చేస్తావు?

*21.9*

కొన్ని అర్థాలు ఎన్నటికీ పదాలుగా పరివర్తన చెందవు.
కొన్ని పదాలు అర్థ రహితంగా ఉంటాయి.
నీ నుంచి నా నుంచి
నీ ద్వారా నా ద్వారా
అవి ఈ ప్రపంచంలో పరిఢవిల్లుతాయి.
ఎవరైనా తన నీడల్లో తానే కూర్చోలేరు.

*22.9*

సమస్త సృష్టి 'ఓం'కారంతో ముడిపడివుంది.
మెదడు గుడ్డిది.
ఎవరన్నారు రేపు వస్తుందని.
ఆత్మ మరణించదు. అది వస్త్రాలు మార్చుకుంటుంది.
మనిషి వస్త్రాలు కావచ్చు, శరీరం కావచ్చు ఎవరికి తెలుసు.
పాము ఆత్మ కావచ్చు
సింహం ఆత్మ కావచ్చు.

తోడేలు ఆత్మ కావచ్చు
నక్క ఆత్మ కావచ్చు.
ఒక కుక్క ఆత్మ లేదా ఇంకేమైనా కావచ్చు.
దేవుని ఆత్మ కూడా అలాగే.
అయితే తోడేలు ఆత్మకు సింహపు చేష్టలు రావు.
దాని పరిమితులు దానివి.
పంచతంత్రం కథల ద్వారా తిరస్కరణ ఎలా జరుగుతుందో
తెలుసుకున్నాం. ఆ పాత్రల్లో జీవించేది మనం కాదు. మనలో ఆ
పాత్రలు
ఇన్ని శతాబ్దాలుగా జీవించడం. మనలో మార్పు పైపైన మాత్రమే.

*23.9*

ప్రతిరోజూ సూర్యుడు వచ్చి అడుగుతాడు
నువ్వేం చేస్తావు
ఈరోజు?
ప్రతిరోజూ నేను నక్షత్రాలతో చెబుతాను
నేనీరోజు వృథా చేశాను.
ప్రతిరోజూ అర్థానికి, అర్థ రాహిత్యానికీ మధ్య
మార్గంలో కలియదిరుగుతాను.
ప్రతి మార్గానికి విశ్వాసం వుంది
ప్రతి మార్గానికి విశ్వాస ఘాతుకత్వం వుంది.
ఎవరూ తన నీడలో తాను కూర్చోలేరు.

*25.9*

తప్పనిసరిగా నా కళ్ళకు ఏదో సమస్య వుంది.
ఇప్పుడు ఇవి వందల, వేల, లక్షల మైళ్ళ ఆవలవున్నా
వాటిని చూడగలవు.

కొన్నిసార్లు అవి చరిత్ర పుటలు ఆవలకు చేరగలవు.
అక్కడి ప్రజలకు ఈ విషయం ఎలా తెలిసిందో నాకు తెలీదు
వారు నా క్షేమాన్ని అడుగుతున్నారు.
నేను ఏదీ గుర్తు తెచ్చుకోలేక పోతున్నాను.
భూమ్మీద నా ఇంటి గురించి అడుగుతున్నారు వారు దాన్ని గద్దలు
తన్నుకు పోయాయని వారికి చెప్పాను.
వారు అర్థం చేసుకున్నారు.
నేను తిరిగి వచ్చేటప్పుడు వారు కొన్ని స్వప్నాల్ని మూట కట్టి ఇచ్చారు.
భూమ్మీద వాటిని నేనెక్కడ దాచగలను అని నేను వాదించే ప్రయత్నం
చేశాను. గద్దలు వాటిని కూడా తీసుకెళ్ళిపోతాయి.
సరేకాని స్వప్నాలు లేకుండా సుదీర్ఘమైన, చీకటి నిండిన రాత్రులను
ఎలా గడుపుతావు? అడిగాయి.
మిణుగురుల్లాంటి స్వప్నాలతో మాట్లాడుతూ రాత్రి భూమ్మీదికి తిరిగి
వచ్చాను.
కాని ఇదేమిటి? అవి ఒకదానివెంట ఒకటి మరణించనారంభించాయి
ఎవరో చంపుతున్నట్లుగానో లేదా ఈ భూమ్మీద వాతావరణం తమకు
సరిపోకనో.
ఒక్కొక్కదాన్నే సమాధి చేస్తున్నాను.
వాటికోసం చిన్న సమాధులు నిర్మిద్దామనుకున్నాను కాని సమాధి
ఫలకాలపై ఏమని రాయను?

### *1.10*

అమ్మ పవిత్ర గ్రంథాలను పఠించి, ప్రార్థిస్తుంది.
దేవుడ్ని ఆమె ఏమడుగుతుంది.?
ఎందుకీ జనం దేవుడ్ని అంతగా మొహమాటపెడతారు? ఆయన
ఏ దాల్మియానో, బిర్లానో కాడు కదా!
వద్దు నాకేమీ వద్దు.
సన్నగా తుంపర్లు పడుతున్నాయి.

మా అమ్మమ్మ ఒక కథ చెప్పేది.
ఒకానొక మెట్టనేలలో,
రెండు స్తంభాలు నిలబడివున్నాయి
రెంటినీ నీలితాడుతో బంధించారు,
నిద్రపోతున్న ప్రజలు మేల్కొన్నారు.
వారు నిజంగా మేల్కొన్నారా?
లేదంటే దేవుని సందేశాలు వృథాకావూ?

## 4.10

నేను చిన్నగా వున్నప్పుడు నా చేయి కాలింది.
చేతి రేఖలు కూడా కాలాయి.
అగ్నితో శత్రుత్వం వహించలేవు. అగ్ని అంటే: ఎంతయినా
మరణించిన తర్వాత తనలో నిన్ను కడుపులో పెట్టుకునేది అదేకదా!
అగ్నికి నమస్కరించాను.
సూర్యులందరికీ నమస్కరించాను.
ఆయన అనుజ్ఞ లేకుండా ఆకు కూడా కదలదు.
ఆమె ఒక అదృష్టదేవత. నది ఒడ్డున కూర్చుని రెండు ఆకులను ముల్లుతో కట్టి నీటి తరగలపై జెట్టీలా వదిలింది. నిజానికివి ఆకులా? కావు. ఆమె దగ్గరికి చేసి కుట్టేవి మానవ సంబంధాలకు ఆమె పెళ్ళిళ్ళు చేస్తున్నది. కొన్నిసార్లు అత్యంత సన్నిహితంగా వున్న ఆకులు సైతం కొంత దూరమై వేరు వేరయిపోతాయి.
ఎందుకు ఎప్పుడో తెలియదుగాని కలిపి కుట్టే సూది ద్రోహం చేసి జారుకుంది.
అదృష్ట దేవత పాశ్చాత్య దేశాల్లో అధిక సమయం పని చేయాల్సి వుంటుంది. ఎందుకంటే; వారి పెళ్ళిళ్ళు జరుగుతూ విచ్ఛిన్నమవుతూ వుంటాయి.
నేను అడుగుతాను. ఎప్పుడైనా తారసపడ్డానా అని

### 7.10

ఆఖరు క్షణాల్లో తేజ్‌వంత్ ఎవర్ని తలచుకొని వుంటాడు?
భూమి మీద మృతుల ఆర్తనాదాలు  వినిపించే వుంటాయి.
చాలాసార్లు అటువైపు భూతాలు ఇటువైపు భూతాలతో
ఘర్షణ పడుతుంటాయి.
మట్టిలో కలిసిపోయిన వాళ్ళకెవరు చెప్తారు?
లేదు, నేనెవరి గురించీ ఆలోచించను.
ఆఖరికి నా గురించి కూడా.
ఆకాశంలో ఒక నక్షత్రం ప్రత్యక్షమైంది.
హమ్మయ్య నక్షత్రాలకెవరూ ఇంకా చెప్పలేదు.

### 15.10

కొన్నిసార్లు ఈ చుక్కలు నా కళ్ళలోపలికి వచ్చి కూర్చుంటాయి.
నా గురించి ఆలోచించవద్దు. ఈ చుక్కల్ని మాత్రం ఆర్పవద్దు
ఎక్కడ్నించి ఇంత భారీ పొగ వస్తోంది?
డింగ్ - డాంగ్ గడియారం అర్ధరాత్రి ఆగిపోయింది.
ఇక ఇప్పుడు కాపలాదారు మారతాడు. దేవతలు
ఆ స్థానాన్నాక్రమిస్తారు. ఎందుకీరాత్రి అర్థంతరంగా ఆగింది?
కాలాన్ని మంచపు కోడుకు కట్టేసిందెవరు?
ఇక మరి కాపలాదురు మార్పు ఉండదా?
మరొక క్రోధదేవతను రప్పించండి.
మరొక శ్రీరామ చంద్రుడ్ని పిలవండి
రాత్రి అర్థంతరంగా ఆగింది.

### 18.10

చెట్లు నడవగలిగితే,
ఇక ఏదీ అవసరం లేదు. చెట్లు సందేశాల్ని తామే అందిస్తాయి.

రాత్రి ఎవరితో మాట్లాడుతున్నది?
సూర్యుని అంతరంలో మండుతున్న అగ్ని తన దగ్గరికి ఎవర్నీ రానివ్వదు లేదో, అదొకటే ఒంటరి కాదని చెప్పు.
నీలోని అగ్నిని నువ్వే ఆర్పు లేదా సూర్యునిలా ఒంటరిగా జీవించు?
నేనే లేనప్పుడు బాధపడే దెవరు?
మా నాయనమ్మ చెప్తుండేది. చెడుకాలం మనిషికేగాని
జంతువులకు, పశువులకు లేదని. మీ నాన్న తలపాగాకు అప్రతిష్ఠ తెచ్చిపెట్టకు అని.
ఆమెను నేనడగడం మరచాను మా నాన్న తలపాగా ఎక్కడ, దాని రంగు ఏమిటో?

*20.10*

'సాయంత్రం ఒక లెక్చరుంది. ఇక్కడే ఉండడం మంచిది. ఇంటికి వెళ్ళవద్దు' ఆయన చెప్పారు.
'కాని నేనిక్కడ ఉండి ఏం చేస్తాను,' నేనన్నాను.
'అక్కడయినా నువ్వు చేసేదేమిటి?' ఆయన మళ్ళీ అన్నారు.
"ఆ మాటకొస్తే ఎక్కడైనా నేను చేసేదేముంది?" నాలోనేనే
'నేను నిన్ను ప్రేమిస్తాను. కాని నువ్వు అందరికీ ఓ మొండి దానివి,
క్రూరమైన దానివి. నాకు భార్య, పిల్లలు లేకపోతేనే...' ఓ కథ మదిలో మెదిలింది.
'నేను దీపాన్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను' మిడత చిమ్మట పురుగుతో అంది.
'తెలివితక్కువగా మాట్లాడకు అగ్నికి ఆహుతైపోతానని భయపడనిదే దీపాన్ని పెళ్ళి చేసుకోగలగుతుంది'.
'నేను దీపాన్ని నీకన్నా ఎక్కువ ప్రేమిస్తున్నాను' అంది మిడత చిమ్మట పురుగుతో.
'సరే! నీ పేరు దీపానికి సిఫార్సు చేస్తాను రాజభవనంలోకి వెళ్ళి దీపాలు వెలిగించారోమో చూడు. అంది చిమ్మట.

మిడత లోపలికివెళ్ళి కొద్దిసేపటికి తిరిగివచ్చి 'దీపాలు వెలిగించారు'
చెప్పింది.
'దీపాలు వెలిగిస్తే ఎందుకు వెనక్కి వచ్చావు?' చిమ్మట అడిగింది.
నువ్వు నిప్పును అడుగుతున్నది చేతుల్ని చలికాచుకోవడానికే తప్ప
నిప్పు చేతులు పట్టుకునే అర్హత లేదని ఆ పెద్దమనిషికి
చెప్పాలనుకుంటున్నాను.
కాని నేనేమీ చెప్పలేకపోయాను.

*25.10*

అక్కడో చాలా పెద్ద నది వుంది. ఇది ఒక అగ్నినది.
నేను దాన్ని దాటాలి. అందుకోసం మరణానికి ముందు
ఒక గోవును దానమిచ్చారు.
ఒకటి, రెండు లెక్కపెట్టే సమయం ప్రారంభమైంది ఇప్పుడు.
యమధర్మరాజు దొంగరవాణాదార్లనుంచి తన లెక్కల పుస్తకాన్ని
కాపాడుకోవాలి.
కాని ఎవరైనా అసలు ఎందుకు వెళ్ళాలట?
అటువైపు? కాని వెళ్ళాల్సిందే కాలం ఆపడానికి
వీల్లేనిది. గాలి నెవరు? పట్టి
బంధించగలరు?
నేను రెండువేల సంవత్సరాలుగా నడుస్తూనే వున్నాను.
నడచి నడచి నా కాళ్ళు కూడా అలసిపోయాయి.
వచ్చే దారిలో ఎన్నో విగ్రహాల్ని ప్రతిష్ఠించారెందుకు?
దారి చూపడానికా?
అయితే మాత్రం ఎంతకాలం
ఈ మరణించిన వారి విగ్రహాలు
బతికున్నవారికి దారి చూపుతూ వుండాలి?
కనిపిస్తున్నదంతా అది వట్టి భ్రమ. ఇది చెట్టు
నీడ. మరి అసలు చెట్టెక్కడ?

### 1.11

ఈరోజు, ఈ దారిన సాగిపోయిందెవరు?
గాలికి మాట వినని గుణముంది.
ఒకప్పుడు భారీ భూకంపం వచ్చింది.
శిథిలాల్లో నేనేమైనా కూరుకుపోయానా?
ఎవరైనా నన్ను రక్షించడానికి రాగలరా?
కాని ఎవరికీ తెలియరాదు.
చాలా ఏళ్ళ తర్వాత పరిశోధకులు ఆ స్థలాన్ని తవ్వుతారు. ఎన్నెన్నో
వస్తువులు వెలికివస్తాయి. శిథిలాలు, పగిలిన మృణ్మయ
పాత్రలు, ఆభరణాలు, నాణేలు, ఎముకలు, నేనూ....
ఈ వస్తువులన్నిటినీ స్పృశిస్తున్నప్పుడు వారిలో ఒకరి చేతులు
వణుకు తాయి.
అతని కంటి కొసలు తడి బారతాయి.
'పిచ్చివాడు' భూమి నవ్వుతుంది.
నేను కలిసిపోయిన మట్టిలో
ఏం పెరుగుతుంది?
గురివెంద మొక్క.

### 3.11

రజకునికి నేనో పదిరూపాయలిచ్చాను. అన్ని సంబంధాలు
ఇచ్చిపుచ్చుకొనేవే కదా!
మూడు చీరలు - నావే, ద్రౌపదివి కావు.
ఆరు దుప్పట్లున్నాయి. శవంపైన కప్పడానికి రెండు చాలు రెండు
బొంత కవర్లు... మనిషిది కాదు.
పది తెరలు, పది మాత్రమే ఎందుకు, ఎన్నో
నాలుగు అంగీలు, నేను తొడుక్కున్నవి.
ధూళి దుమారం లేస్తోంది. ఎండిన ఆకులు నేల రాలిపోతాయి.
కొన్నిసార్లు గాలి దుమారంలో పచ్చనాకులు కూడా

రాలుతాయి. రాలిన ఆకులకోసం చెట్లు దుఃఖించవు. రాలిన
ఆకులు నేలలో కలిసిపోతాయి. ఈనేల నుంచే అవి
పెరిగాయి. కాదు. నేలనే స్వయంగా ఆకులుగా మారింది.
నేల ఆకులగా మారడం, ఆకులు నేలలో కలవడం- ఇదే
కథంతా. మరి ఎందుకీ అనవసరమైన గోలంతా?
అన్ని తలుపులూ, కిటికీలూ మూసేస్తున్నారు గాలులు ఏ సందేశాన్ని
తెస్తాయోనని.
బిడారును సిద్ధంగా ఉండమనండి మేం వస్తున్నాం.
రాధ గురించి మాట్లాడకండి ఆరోజులే వేరు.
అందులోనూ కృష్ణుడు దేవుడు.

*6.11*

నా అంతట నేనే ఎక్కడో ఉండిపోయాను.
ఇంట్లోనివారు ఎక్కడికి వెళ్ళారు?
ఈ ఒంటరితనం ఎందుకు?
ఎవరు విలపిస్తున్నారు?
నేను చనిపోయానా?
లేదు లేదు నేను స్పృహలోనే వున్నాను.
తలుపుదగ్గర్నుంచే వెనక్కి వెళుతున్నదెవరు తలుపు తట్టకుండానే?
నేనిప్పటికీ అతని అడుగుల చప్పుడు వినగలను.

*15.11*

కలసినడుస్తూ,
నడకదారి నాకోసం పట్టణమైంది.
అలాకాకపోతే నేరుగా నడుస్తున్నాను.
భటిండాలోని హర్భజన్ నవ్వుతాడు.
లోకంలో ఇంకా నవ్వగలుగుతున్నారు నేను ఆశ్చర్యపడ్డాను.
ఆయనవైపు చూశాను తదేకంగా

బహుశా ఒక్క సంవత్సరంలోనే అతడు అనేక
సంవత్సరాలను దాటాడు.... అందుకనే.... అందుకనే...
నేను అనుకున్నాను ఇక నేనెప్పుడూ ఏడవరాదని
నా కనుకొలుకులు అశ్రువులతో నిండాయి.
అతను మళ్ళీ నవ్వాడు.
దుఃఖించడానికిది సమయం కాదు. మరో సందర్భంలో దుఃఖిద్దాం,
మనం తీరిగ్గా ఉన్నప్పుడు.
ఇది నేలను చదును చేసే తరుణం, చీకటిని వెలిగించడానికి
ముందున్న దారి కనిపించకుండా పోయింది. అతనితో లేదా నాతో
నేను చెప్పాను.... నేను గట్టిగా చెప్పలేను.
'మునుముందుకు వెళితే ఏమవుతుంది ఎక్కడికి వెళుతున్నా
దారులు అవే తెరచుకుంటాయి' అంటూ అతను కదిలి
సాగిపోయాడు.

*18.11*

ఈ విలాప శబ్దాలు ఎక్కడ్నించి వస్తున్నాయి?
కొందరు దేవుని తప్పుల్ని సరిదిద్దాలని ప్రయత్నిస్తున్నారు.
మీరేమంటారు? అభారతీయుల భారతీయీకరణ
జరుగుతోంది.
ఇది ఔరంగజేబు కాలం కాదని నేను విన్నాను.
గానుగ చుట్టూ తిరిగే ఎద్దు ఎక్కడికీ చేరదు.
మీరంతా వెళ్ళి మునకలు వేయండి.
ఇది నీరో కాలం కాదు ఏమీ పట్టనట్లు కూర్చోడానికి
మేఘాలు గర్జించాయి
లేదు. వియత్నాం లోని పిల్లలబడిపైన బాంబులు వేసింది అమెరికా
ఈరోజు బడివేళలు ముగిశాక పిల్లలు ఇంటికి తిరిగిరారు.
వాళ్ళ వాళ్ళ శరీర భాగాలెక్కడవున్నదీ వారికి తెలియదు.
వాళ్ళందరిదీ ఒకే మరుభూమి, దానిపై పువ్వులు పూస్తాయా?

బాంబులు మాత్రమే మొలిచి పెరుగుతాయి.

*21.11*

'మా నేల అయోగ్యమైంది కాదు
మేము ప్రేమలేని వాళ్ళమూ కాము.
మా పిల్లల్ని వదిలి మేం మరో సీమకు తరలాం.
దేవుడు మా గింజల్ని ఎక్కడెక్కడో చల్లాడు.
'ఎందుకు అబద్ధాలు చెప్తావు ఓ విహంగమా
నీకెలా తెలుసు దేవుడెక్కడున్నాడో'
ఆయన ఉన్నాడనుకున్నా మీ గింజల్ని ఎక్కడెక్కడో చల్లడం లాంటి
అనవసరమైన పనుల్ని చేయడానికేవున్నాడా?
అబద్ధాలు చెప్పడం మంచిదికాదు.
నీ మీద ఒట్టేసి చెబుతున్నా ఆయన ఎక్కడా లేడు.
నీకు నేను నిజం చెబుతున్నా ఆయన ఎక్కడా లేడు.
ఆయన ఉంటే....

*29.11*

రాత్రి ప్రశాంతంగా వుంది.
ఒక తుపాకీ గుండు పేల్చారు.
ఎగురుతున్న పక్షులు చెదిరి ఎగిరిపోయాయి.
గాలి భయంతో నిండివుంది.
తుపాకీ గుండునెవరు పేల్చారు?
ఇది తేజ్‌వంత్‌ను చంపిన తూటాలాంటిదే?
తూటాల్ని పేల్చింది కేవలం కుట్టుమిషన్ల అమ్మకాల్ని పెంచడానికేనా?
కాల్చడం తప్పదు. లేదంటే తూటాల తయారీదార్ల
వ్యాపారం దెబ్బతింటుంది.
'నీ కళ్ళలో ఈ ధగధగ ఏమిటి?' ఎవరో అడిగారు
నేను అతనికి చెప్పాలనుకున్నాను... యుద్ధంలో మరణించిన

వారందరినీ దహనం చేయలేదు. అందుకు తగిన స్థలం
లేదు. సమయమూ లేదు.
శత్రువు వారిని దాటిపోతున్నాడు.
వీరందరి సాముహికచితి మండుతోంది నాలో. ఈ ధగధగ ఈ చితిదే
కావచ్చునేమో.
కాని నేనేసమాధానమూ ఇవ్వను.
చాలా వేడిగా వుంది.
చాలా సేపటినుంచి సూర్యుడు మండుతున్నాడు. తెలీదు ఎప్పుడో
అస్తమయం.
వాళ్ళు చెబుతున్నారు నదిలో నీరు చాలా చల్లగా వుందని
హమ్మయ్య నీటికి తెలియదు ఇప్పటికీ
ఇప్పటికీ నిద్ర రావడం లేదు నిద్రమాత్రలు వేసుకున్నాగానీ.

*1.12*

అమ్మాయి రాత్రి అడిగింది నీ నిద్ర ఎక్కడికి ఎగిరి పోయింది?
పగలు నిందించింది ఏమయ్యాయి నీ వివేక విజ్ఞతలు?
సమాధానమివ్వు ఓ అమ్మా!
ఏడవకు ఓ నాన్నా!
కుమార్తెల బాధలు తీవ్రం
ఎడారివైపు పయనం ప్రారంభించిన ఆ నదిగా నేనెప్పుడున్నాను?
నువ్వు నా ముఖాననే తలుపులూ, కిటికీలు వేసేసిన గాలి గా
నేనెప్పుడున్నాను?
నువ్వు అధైర్యంగా వున్న ఆ ప్రపంచం కావాలని నేనెప్పుడు
అడిగాను?
"దేనికోసమూ అడక్కు. వారసుల్లేకుండా చనిపోయిన వారి
పేర్లనెవరూ ప్రస్తావించలేదు.' ఎవరో విలపించారు.
దేనికోసమైనా నేను ఎప్పుడు అడిగాను?
నాకు చేతులయినా లేవు.

దీపం వెలిగించు చాలా చీకటిగా వుంది.
అక్కడేమైనా మరణం సంభవించిందా?
నేను మరణించానా?
కాని సరిహద్దుల్లో యుద్ధం జరిగింది.

*5.12*

గాలి ఏమైనా సందేశాలు తెస్తుందేమో
తలుపులూ, కిటికీలూ మూసేయండి.
కోరికే బాధకు మూలకారణం
నీకళ్ళలోంచి సూర్యులను పంపించెయ్.
భూమ్మీద ఎవరూ శాశ్వతంకాదు
నేను చనిపోదలచుకోలేదు
నా చావుతో నా తల్లిదండ్రుల ఇల్లు మూతబడుతుంది
శాశ్వతంగా.
నా స్వంత ఇల్లు?
దాన్ని గద్దలు ఎత్తుకెళ్ళిపోయాయి.
నేను పిచ్చిదాన్ని కాను.
అరువుపై నాకేమైనా ఇవ్వలేరా?
ఈ దేశంలో అనేక జన్మల దాకా రుణాలు ఉండిపోతాయని
నేను విన్నాను.

*10.12*

తలుపుకొట్టిన చప్పుడవుతోంది.
నేను తెరుస్తాను.
బయట ఎవరూ లేరు, చీకటి, నిశ్శబ్ద నిశీధి తప్ప.
ఒకప్పుడు ఈ ఇంట్లో ఉండేవారు. వారిలో ఒకరు...
మరణించారెప్పుడో బహుశా వచ్చివుంటారు.
వర్తమానాన్నిదాటి నాటిరోజులు నా కళ్ళలో కదులుతున్నాయి. వారు

నాలాగే ఈ ఇంట్లో నివసించారు. ఈ ఇంటిని తమ ఇంటిలా
చూశారు.
మరు ఉదయం లేచేవారు, పాలు తాగి, రోజంతా తమ పనిలో
మునిగిపోయి, రాత్రి భోజనం చేసి చక్కగా కథలు
చెప్పేవారు. ఒకరి తర్వాత మరొకరు ఎక్కడికి వెళ్ళిపోయారో
తెలియదు. వారి స్థానంలో ఒకరి తర్వాత మరొకరు చాలా
మంది వచ్చారు.
అప్పుడప్పుడూ చనిపోయిన వారికోసం శోకించడం
పుట్టిన వారికోసం పండగ జరుపుకోవడం ఉండేది.
మరణించినూరెక్కడికి వెళుతున్నారో కొత్తగా పుట్టినవారు
ఎక్కడ్నించి వస్తున్నారో ఈ ఇల్లు దిగ్భ్రమ చెందేది.
ఒకప్పుడు చనిపోయిన వారిలో ఒకరు ఇల్లు దొరక్క తర్వాత తిరిగి
వచ్చారు.
ఇంటికి తిరిగి వచ్చి ఆ ఇంట్లో అప్పటికే మరెవరో వుండడం
అతడు నాటిన యూకలిప్టస్ మొక్క పెద్ద వృక్షంగా ఎదిగింది. ఒక కొమ్మ
కిటికీలోంచి ఇంట్లోకి పాకింది.
అప్పట్లో పై అంతస్తులో గదులులేవు నక్షత్రాలను
అక్కడనుంచి చూడగలిగేవాళ్ళం
కొళాయిలో నుంచి అనవసరంగా నీరు బొట్లు బొట్లుగా రాలేది.
గదుల తలుపులు, కిటికీల రంగు ఇప్పుడు మారింది.
అప్పుడు గవాక్షంలో ఒక ఊరపిచ్చుక నివాసమేర్పరచుకుని వుండేది.
కాని ఇప్పుడు వేరెవరెవరో ఈ ఇంట్లో నివసిస్తున్నారు. వారికి
ఈ మనిషి ఎవరో తెలీదు.
వారికెలా తెలుస్తుంది. ఒకప్పుడు ఈ ఇల్లు
ఇతనికి చెందినది అని?
ఇది పూర్తిగా భిన్నమైన కాలమని నాకు అర్థమైంది ఇప్పుడు ఎవరో
భిన్నమైనవారు ఈ ఇంట్లో ఉంటున్నారు.
ఇంటి ప్రాంగణంలోని గోడకు 'కిరణ్' అని సిమెంటు తడిగా

వున్నప్పుడు చెక్కారు.

అదింకా కనిపిస్తోంది.

ఎవరా కిరణ్?

ఊరపిచ్చుకలు యూకలిప్టస్ చెట్టునడిగాయి.

'ఒకమ్మాయి రాత్రి పొద్దు పోయేదాకా

మేలుకుని వుండేది. అప్పుడప్పుడు

ఆరాత్రి డాబాపైన నిలబడి వేరే ఇళ్ళల్లో కూడా ఆ

సమయంలో దీపం వెలుగుతోందా? అని చూసేది'

చెట్టు చెప్పింది.

ఊరపిచ్చుకలు ఎగిరిపోయేవి

కోడి తన కూతతో జనాన్ని నిద్రలేపేది.

ఈ కూత ఏ గౌతముని కోసం?

నేను తలుపుమూసి మంచంపై వాలిపోయేదాన్ని.

అమ్మ నిద్రలేచి ప్రార్థన చేసే సమయమది

నేను బయట మళ్ళీ అడుగు చప్పుడు విన్నాను.

లేచి తలుపు తెరిచాను.

రేపు ఎప్పుడైనా నేనూ ఇలాగే వస్తే ఎవరైనా నా కోసం

తలుపు తెరుస్తారా? అనిపించింది.

చాలా దూరపు స్టేషన్‌లో రైలు కూతవేసింది.

ఇక్కడికి వచ్చిన మనిషి ఈ రైలుకే

వెళుతున్నాడేమో అనిపించింది.

*21.12*

మాది ఊరపిచ్చుకల గుంపు ఓనాన్నా!

మేం ఎగిరిపోతాం

ఏ సీమ? నాన్న అడుగుతారు.

ఏ సీమో తెలీదు.

తెలీదు... మాకు తెలీదు.

*31.12*

తలుపు తడుతున్న శబ్దం నేను విన్నాను.

* * *

డైరీలో ఇంతకంటే ఎక్కువ రాయలేదు. అన్ని పుటలూ ఖాళీగా వున్నాయి. ఒకరోజు మధ్యాహ్నం కిరణ్ ఇల్లు విడిచి వెళ్ళిపోయింది. రాత్రివరకూ తిరిగి రాలేదు.

రాత్రంతా కూడా తిరిగి రాలేదు.

మరునాడు కూడా....

ఆమరునాడు కూడా.

అలా ఎన్నో రోజులు గడిచినా ఆమె తిరిగి రాలేదు. ఎవరో చెప్పారు. మధ్యాహ్నం ఆమె భాక్రా కాలవ వైపు వెళుతుండగా చూశానని.

ఇంకెవరో చెప్పారు. ఆమె రైలెక్కుతుండగా తాను చూశానని. ఆమె నీలిరంగు సూటు వేసుకుందని.

'ఆమె ఎవరితోనో కలిసి టాక్సీలో వెళుతుండగా చూశాను. వెంట ఒక యువకుడున్నాడు' అన్నాడు మూడోవ్యక్తి

ఆమె దిగంబర సన్యాసులతో వెళ్ళిందని, వారు ఆమెను వశీకరణ విద్యను ప్రయోగించి తీసుకెళ్ళారని మరొకరు అన్నారు.

'ఆమె కమ్యూనిష్టులతో బెంగాల్ వెళ్ళిందని'

ఫిలాసఫీ ప్రొఫెసర్ అభిప్రాయం.

"వితంతువుగా జీవించడం సులభం కాదు. ఆమె ఎవరితో లేచి పోయి వుంటుంది." వీధి మహిళ మరొకామెతో అంది.

'ఆమె ప్రవర్తన కూడా అనుమానాస్పదమైంది. భర్త చనిపోయిన తర్వాత కూడా ముక్కు పుడక తీయలేదు. మరొకరి సమాధానం.

'ఇలాంటి చెడ్డ రోజుల బారినుంచి దేవుడు అందరినీ కాపాడాలి.

ఏమైనా ఆ కుటుంబ ప్రతిష్ఠ – మంటగలిసింది.' ఎవరో ముసలావిడ

నోరు నొక్కుకుంది.

'లేదు...లేదు...లేదు...ఇది నిజం కాదు. అంతా చెత్త వాగుడు. లోకం నీలాపనిందలు వేస్తున్నారు. కిరణ్ అలాంటిది కాదు ఇది నిజం కాదు. నా మనసు చెప్తున్నమాట.'

కన్నీళ్ళతో కిరణ్ తల్లి ఈ మాటలంది. ఇంట్లోకి వెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చింది.

* * *

# పద పట్టిక

## సంధ్యారాగం

పంచాయిత్ : గ్రామపాలనా కేంద్రం. పంచాయితీ.

అహల్య : హైందవ పురాణాల్లోని గౌతమ మహర్షి భార్య అహల్య. గౌతముని శాపానికిగురై శిలగా మారుతుంది. త్రేతా యుగంలో శ్రీరాముని పాద స్పర్శతో పునర్జీవితు రాలౌతుంది.

రామ : శ్రీరాముడు. శ్రీమహావిష్ణువు త్రేతాయుగంలో శ్రీరామునిగా అవతరించాడు. రాముని కథయే రామాయణం.

త్రేతా, సత్య,
ద్వాపర్ యుగ్ : హిందూ మత విశ్వాసాన్ని అనుసరించి కాలాన్ని త్రేతా యుగం, సత్య యుగం, ద్వాపర యుగం, కలియుగం అని విభజించారు.

ఉపనిషత్తులు : వైదిక వాఙ్మయానికి సంబంధించినవి. భగవంతుని గురించీ, సృష్టిని గురించీ తెలుపుతాయి.

మహా భారత్ : ప్రాచీన హైందవ ఇతిహాసం, దీన్నే పంచమ వేదమని అన్నారు. కురుపాండవుల మధ్య జరిగిన కురుక్షేత్ర యుద్ధం, మహాభారతంలో ప్రధానమైంది.

శ్రాద్ధ్ : దివంగతులైన పెద్దల ఆత్మశాంతికై నిర్వహించే కర్మకాండ.

భాభీజీ : అన్న భార్య, వదిన.

## వజ్రపు ముక్కుపుడక

కాజల్ : కంటికి పెట్టుకునే కాటుక.

పల్లా : వివాహ సమయంలో వధూవరుల కొంగులు ముడి వేయడం

సంప్రదాయం.

గ్రంథ్ సాహిబ్: సిక్కుల పవిత్ర గ్రంథం. దీన్నే గురుగ్రంథ్ సాహిబ్ అంటారు.

జూటి : కాలిజోళ్ళపై చిత్తర్వు.

పండాల్ : బహిరంగసభ లేదా ఉత్సవం జరపడానికి నిర్మించే టెంటు.

టాంగావాలా : టాంగా నడిపేవాడు.

లాంబార్దార్ : ఊరిపెద్ద

పంచం : శుక్లపక్ష పంచమినాడు జరిపే పండుగ.

తీజ్ : తొలకరి ప్రారంభంలో స్త్రీలు జరుపుకునే పండుగ.

కుర్తా : పొడవాటి అంగీ.

శికరా : నీటిలో తేలియాడే ఇల్లు.

వీర్ చక్ర : ధైర్యానికి ఇచ్చే ఉన్నతమైన అవార్డు.

జనాబ్ : గౌరవవాచకం.

లాఠీ : కర్ర.

షర్బత్ : తీయని చల్లని పానీయం.

శ్రాద్ధ్ : మరణించిన పెద్దల ఆత్మశాంతి కోసం నిర్వహించే శ్రాద్ధకర్మ.

అమావాస్ : అమావాస్య.

పూజ : దేవునికి, లేదా దేవతకు చేసే పూజ.

రోలి : రంగుపొడి

దర్భ : హిందువులు మతపరమైన కర్మలు చేసేందుకు ఉపయోగించే దర్భలు.

కుండలి : జాతకచక్రం

దక్షిణ : పూర్వం విద్య నేర్పిన గురువులకు శిష్యులు సమర్పించే (గురు) దక్షిణ.

జిలేబీ : తీపి పదార్థం.

దుష్యంతుడు : అయోధ్య నేలిన రాజు. శకుంతలను కణ్వముని ఆశ్రమ వాతావరణంలో ప్రేమించి గాంధర్వవివాహం చేసుకున్నాడు. ఆమె తర వద్దకు వచ్చినప్పుడు ఆమెను శాపవశాత్తు మరచి పోతాడు.

శకుంతల : కణ్వమహర్షి పెంచుకున్న కూతురు. దుష్యంతుని వివాహ

| | | |
|---|---|---|
| | | మాడుతుంది. |
| సీత | : | శ్రీరామ చంద్రుని భార్య. భర్త అడుగుజాడల్లో ఆయన వెంట వనవాసానికి వెళుతుంది. |
| ద్రౌపది | : | మహాభారతంలో పాండవుల సతీమణి. హస్తినలో ధర్మరాజుతో దుర్యోధనుడు జూదమాడినప్పుడు కౌరవులు ముఖ్యంగా దుశ్శాసనుడు ఆమెను పరాభవిస్తాడు. |
| కృష్ణ | : | శ్రీ మహావిష్ణువు దాల్చిన అవతారాల్లో శ్రీ కృష్ణావతారం ఒకటి. ద్రౌపదిని దుశ్శాసనాది కౌరవుల నుంచి కాపాడుతాడు. |
| మహాత్మ బుద్ధ | : | కపిలవస్తు రాజకుమారుడు. లౌకికమైన సంపదలు, సుఖాలను పరిత్యజించి రాజ్యం విడిచివెళ్ళాడు. బోధివృక్షం కింద తపస్సు చేసి బుద్ధుడయ్యాడు. తన బోధనలతో బౌద్ధ మతాన్ని నెలకొల్పాడు. |
| పంచతంత్ర | : | అద్భుతమైన భారతీయ నీతి కథల సమాహారం. |
| దాల్మియా | : | ప్రఖ్యాత భారతీయ పారిశ్రామికవేత్త. |
| బిర్లా | : | ప్రఖ్యాత భారతీయ పారిశ్రామికవేత్త. |
| రామ | : | శ్రీరాముడు. శ్రీ మహావిష్ణువు త్రేతాయుగంలో శ్రీరాముడై అవతరించాడు. రామకథే రామాయణం. |
| ధర్మరాజు | : | యమధర్మరాజు, యముడు. |
| లాల్‌రీ | : | గురివింద గింజ. |
| రాధ | : | శ్రీకృష్ణుని సఖి. మధుర భక్తికి రాధను ప్రతీకగా చెప్పుకుంటారు. |
| ఔరంగజేబు | : | 18వ శతాబ్దానికి చెందిన మొగలు చక్రవర్తి. |

Lasertype setting at Literacy House, Printed at Print Process, New Delhi.

దలిప్‌కౌర్ తివానా రచించిన సంధ్యారాగంలోని హరిజిత్, వజ్రపు ముక్కుపుడక నవలికలోని కిరణ్ పాత్రలు వ్యక్తిగతమైన నిస్సహాయతల దృష్ట్యా వేరువేరుగా కనిపిస్తున్నప్పటికీ నిజానికి భిన్నమైన పాత్రలేమీ కావు. రచయిత్రి ఈ పాత్రల మనోభావాలను, అవి అనుభవించిన సంఘర్షణను విలక్షణ శైలితో పాఠకుల ముందుకు తెచ్చారు. ఆ పాత్రల ద్వారా స్త్రీలుగా సమాజం విధించిన నైతిక విలువలు, కట్టుబాట్ల పట్ల తమ గాఢమైన అసంతృప్తిని ప్రతీకలు, అంతరంగ భావనల ద్వారా రచయిత్రి చక్కగా వ్యక్తీకరించారు. కొంత ఆధునికమూ, కొంత సంప్రదాయమూ కలగలిసిన సమకాలీన వాతావరణాన్ని కథనంలో చిత్రించి పాఠకుల చేత ఉత్కంఠతో చదివించేలా చేసిన నవలికలివి.

**దలీప్ కౌర్ తివానా** సమకాలీన పంజాబీ సాహిత్య రంగంలో అగ్రశ్రేణి నవలా రచయిత్రుల కోవలోనివారు. 27 నవలలు, 7 కథా సంపుటాలు, మొదటి భాగం స్వీయ జీవిత చరిత్ర, సాహిత్య జీవిత చరిత్ర వెలువరించారు. వీరు పాటియాలా లోని పంజాబీ విశ్వవిద్యాలయ భాషాధ్యయన పీఠానికి డీన్‌గా, పంజాబీ శాఖ అధ్యక్షురాలిగా సేవలందించారు. సాహిత్య అకాడమీ పురస్కారం, సరస్వతీ సమ్మాన్ లతో సహా అన్ని ముఖ్యమైన పురస్కారాలను అందుకున్నారు. తివానా రచనలు ఆంగ్ల, ఫ్రెంచి, వంటి విదేశీ భాషల్లోనూ, ఉర్దూ, హిందీ బెంగాలీ, గుజరాతీ తదితర భారతీయ భాషల్లోనూ అనువదించ బడ్డాయి.

డా. జె. చెన్నయ్య ప్రముఖ రచయిత, అనువాదకులు. 'తెలుగు పత్రిక, ప్రసార భాష' వీరి ప్రముఖ రచన. తమిళనాడు గవర్నర్ సుర్జిత్‌సింగ్ బర్నాల Quest for freedom: A story of an escap గ్రంథంతో పాటు పలు గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. ఆకాశవాణి ద్వారా ప్రధానమంత్రి, గవర్నర్‌లు చేసిన ప్రసంగాలను తెలుగులోకి అనుదించారు.

₹ 80.00 ISBN 978-81-237-6018-6

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా